www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 138 | శనివారం | 08-11-2025 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00



కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడండి 03



ప్రజాపక్షం
శనివారం, 08 నవంబరు

# కార్మికుల ప్రాణాల పట్ల నిర్దయ

సిగాచి ఇండస్ట్రీస్‌లో పేలుడు వ్యవహారంలో మృతులు కుటుంబాలకు, క్షతగాత్రులకు నాలుగు నెలల దాటినా పూర్తి స్థాయి పరిహారం ఇవ్వకపోవడం అత్యంత విషాదం. అంతటి ఘోర దుర్ఘటనలో బాధ్యులుగా యాజమాన్య ప్రతినిధులలో ఒక్కరిని కూడా అరెస్టు చేయని విషయం ఇటీవల హైకోర్టు విచారణ సందర్భంగా వెలుగు చూసింది. సంగారెడ్డి జిల్లా పాశమై లారంలో జూన్ 29వ తేదీన సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భారీ పేలుడు సంభవించింది. మృతుల్లో అనేక మంది శరీరాలు పేలుడు దాటికి తునాతునకలై, మాడి మసై పోయిన దృశ్యాలు తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది. వారిలో అనేక మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మృతుల కుటుంబాల గోస అంతా ఇంతా కాదు. ప్రతిఒక్కరిదీ ఒక వ్యథార్థ గాథ.

నాడు ఘటనాస్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ తదితరులు పరిశీలించారు. కంపెనీ తరఫున కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియాగా ఇస్తారని ప్రకటనలు వెలువడ్డాయి. అంతేగాక, రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురితో ఒక ఉన్నతస్థాయి కమిషన్‌ను ఏర్పాటు చేసి నెల రోజుల్లో ఘటనకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంత జరిగినా ముందుకు సాగలేదు.

దీనిపై కె.బాబూరావు అనే రిటైర్డ్ సైంటిస్ట్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. దుర్ఘటనలో 54 మంది మరణించగా, 28 మంది గాయపడ్డారని, పరిహారం చెల్లింపు, దర్యాప్తు జాప్యాల నేపథ్యంలో సిట్ వేయాలని కోరారు. దీనిపై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట మంగళ వారం జరిగిన విచారణ సందర్భంగా వెల్లడైన అనేక అంశాలు కార్మికుల పట్ల నేరపూరిత నిర్లక్ష్యాన్ని, దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను బైటపెట్టాయి.

మృతుల కుటుంబాలలో ఎంత మందికి యాజమాన్యం కోటి పరిహారం ఇచ్చారు? పరిశ్రమ ఎవరి ఆధీనంలో ఉంది? దర్యాప్తు ఎందుకు ఆలస్యం సాగుతోంది? అని హైకోర్టు మౌలిక ప్రశ్నలను సంధించింది. దీనిపై ప్రభుత్వం తరఫు నుంచి వచ్చిన సమాధానాలు ఉన్నత న్యాయస్థానాన్ని సంతృప్తి పరచ లేకపోయాయి. కోటి రూపాయల పరిహారం ఇస్తామన్న ప్రకటనలు చేసినప్పటికీ... మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల మధ్యనే పరిహారం అందజేసినట్లు కోర్టుకు ప్రభుత్వ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తెలియజేశారు. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, ప్రమాదంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సైతం మరణించారని చెబుతుండగా హైకోర్టు జోక్యం చేసుకొంది. వైస్ ప్రెసిడెంట్ మరణించినంత మాత్రాన మిగిలిన బాధ్యులను వదిలేస్తారా? అని ఘాటుగానే ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. నిపుణుల కమిటీ నివేదిక వారం క్రితమే ప్రభుత్వానికి అందిందని అడిషనల్ ఏజీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

పేలుడు జరిగిన పరిశ్రమలో దుర్ఘటనకు సంబంధించిన నియమ నిబంధనలు, రక్షణ చర్యలు పాటించకపోవడం, ప్రభుత్వ సంస్థల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు బైటపడ్డాయి. ఆ తరువాత కూడా పరిహారం, బాధ్యుల అరెస్టుల విషయంలో అలసత్వం ప్రభుత్వ వ్యవస్థల అలసత్వం, సాచివేత, నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సిగాచి దుర్ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కార్మిక భద్రత, రక్షణ చర్యలు, ఉద్యోగ భద్రత, వలస కార్మికులు, కనీస వేతనాలు తదితర ప్రశ్నలు దేశవ్యాప్తంగా మరోసారి తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా నాలుగు కార్మిక కోడ్‌లు అమలులోకి రాకముందే, కార్మికులు సాధించుకున్న హక్కులను తుంగలో తొక్కుతున్న వైనానికి ఇదొక నిదర్శనం. వాటికి ప్రభుత్వ విభాగాలు వంత పాడుతున్నాయి. ఘటన తీవ్రతను చల్లార్చేందుకు ప్రభుత్వాలు, యాజమాన్యాలు, వ్యవస్థలు అప్పటికప్పుడు ఆపత్భాల మొక్కుల మాదిరిగా సాంత్వన కలిగించే ప్రకటనలు చేస్తున్నాయి. రోజులు గడుస్తున్న కొలది వాటి అమలు జావగారిపోతున్నది. ప్రకటనలు డొల్ల వాగ్దానాలేనని తేలిపోతున్నాయి. కార్మికుల జీవితాలు గాలిలో దీపాలుగా మారాయి. దీనికి కారకులు ఎవరు?

నాలుగు కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దొడ్డిదారిని వాటిని అమలు చేసేందుకు వేర్వేరు రూపాలలో ప్రస్తుత చట్టాలను సవరిస్తున్నాయి. ఆ కోవలోనే రాష్ట్రంలో కూడా రోజుకు పనిగంటల విధానాన్ని సవరించి, పదిగంటలకు పెంచుతూ కార్మిక శాఖ జిఒ 282ను జారీ చేసింది. సులభతర వాణిజ్యం అనే కార్పొరేట్ పరిభాషతో ఈ మార్పు తీసుకువచ్చింది. రాష్ట్రానికి పెట్టుబడుల పేరుతో గ్లోబల్ వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఐటి కంపెనీలకు అనేక రాయితీలు, భూములు దఖలు చేస్తూ బడా పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ పరుస్తున్నారు. పెట్టుబడులు రావడం, మనవారికి ఉపాధి కల్పించడం మంచిదే. అదే సమయంలో చట్టాలను ప్రైవేటుకు అనుకూలంగా, జవాబుదారీ రాహిత్యంగా మారుస్తే, ఎలా ఉంటుందో మనం చూస్తూనే ఉన్నాం. సిగాచి ఉదంతంలో,అలాగే టాటా హస్తగతం చేసుకున్న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్‌లో దుర్ఘటనకు ఎవరు బాధ్యులు, ఎంతమంది అరెస్టయ్యారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# జూబ్లీహిల్స్ ఫలితం 'గేమ్ ఛేంజర్' కానుందా?



ఎస్.కె. జకీర్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల రూపు రేఖలు మార్చుతుందా? తెలంగాణ బలాబలాలు మారతాయా? 119 నియోజకవర్గాల్లో ఒకటయిన జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలిచినా, ఓడినా ఒరిగేదేమిటి? మొత్తం తెలంగాణకు 'గేమ్ ఛేంజర్' ఎలా అవుతుంది?

బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జరుగుతున్న ఈ ఎన్నిక ఎందుకింత ఉత్కంఠ రేపుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ కారణాల వలన ఉప ఎన్నికలు జరిగినా ఇంత ఉష్ణోగ్రత ఇదివరకు లేదు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాగిస్తున్న ప్రచార సరళి వల్ల ఈ సమస్య వచ్చింది. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన అనంతరం జరుగుతున్న రెండవ ఉప ఎన్నిక ఇది. కంటోన్మెంటు ఉపఎన్నికల సందర్భంగా ఈ హడావుడి లేదు. ఆ ఎన్నిక నోటిఫికేషన్ రావడం, ఎన్నిక జరిగిపోవడం ఎవరికీ గుర్తు లేదు. జూబ్లీహిల్స్‌లో గెలవకపోతే ఇక తమ పార్టీ పరువు పూర్తిగా గంగలో కలుస్తుందని, పార్టీ మనుగడ కూడా కష్టమన్న అంచనాకు కెసిఆర్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై జరిగే ఏ ఎన్నికల్లోనూ సరిగ్గా పెర్ఫామ్ చేయలేమని, పార్టీ శ్రేణుల్లో విశ్వాసం కలిగించలేమన్న భయాందోళనలతో బిఆర్ఎస్ హైకమాండ్ గడుపుతోంది.

''500 రోజులు ఆగితే కెసిఆర్ ప్రభుత్వం వస్తుంది. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం. కెసిఆర్ హయాంలో ఎక్కడచూసినా కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. అమెరికా వైట్హౌస్ ను తలదన్నేలా రాష్ట్ర సచివాలయం, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్లు ఇలా ఎన్నో నిర్మించాం. రేవంత్‌రెడ్డి రెండేళ్లలో కూలగొట్టడమే తప్ప కొత్తగా నిర్మించిందేమీ లేదు. పేదల ఇళ్ల పైకి బుల్డోజర్లు పంపి కూలగొట్టి, వారికి నీడలేకుండా చేశారు''అని కెటిఆర్ ప్రచారం చేస్తున్నారు. 500 రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలా ఏర్పడుతుందో కెటిఆర్, కెసిఆర్‌కు తప్ప మరెవరికీ తెలియదు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 1130 రోజులకు పైగా గడువు ఉంది. 2028 చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కానీ అంతకు ముందే కెసిఆర్ సిఎం కానున్నారన్న ప్రచారం వెనుక 'రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర' ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేసి, ప్రభుత్వంపై జనంలో వ్యతిరేకతను తీసుకురావడానికి బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం అంతగా ఆకట్టుకోవడం లేదు. కెటిఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న కాలంలో ఆయన హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై చేసిన వ్యాఖ్యలు, నిర్దాక్షిణ్యంగా అలాంటి కట్టడాల ను కూల్చిపారేస్తామని చేసిన భీషణ ప్రతిజ్ఞతో కూడిన వీడియోలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టింది. దీంతో బిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడుతోంది.

ఏడుగురు మంత్రుల మీద వేటు పడనున్నట్టు, తనకు నచ్చని మరికొందరిపై ముఖ్యనేత కత్తిగట్టినట్టు, జూబ్లీహిల్స్ ఎన్నికల తర్వాత వారిపై వేటువేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు నవంబర్ 11 తర్వాత రాష్ట్ర మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని ఢిల్లీ కాంగ్రెస్ నిర్ణయించినట్టు ఒక ప్రచారాన్ని బిఆర్ఎస్ సోషల్ మీడియా ఉధృతం చేసింది. ఇందుకు గాను తాడు బొంగరం లేని కథనాలను వండి వార్చుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు దాదాపు చేజారినట్టేనని, ఎన్నికల ఫలితాలతో ప్రమేయం లేకుండా మంత్రివర్గ ప్రక్షాళన ఖరారు చేసినట్టు ఢిల్లీ కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టుగా ప్రధాన ప్రతిపక్ష శిబిరం టక్కు టమార విద్యలతో ప్రచార కాండ సాగిస్తున్నారు. తనతో విభేదించే మంత్రులను, భవిష్యత్తులో తన సీటుకు ముప్పుగా మారే అవకాశం ఉందనుకున్న మంత్రులను సిఎం టార్గెట్ చేసినట్టు ఒక ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా అవినీతికి సంబంధించిన పక్కా ఆధారాలు తెప్పించి ఒక్కో మంత్రిని టార్గెట్ చేస్తూ ఫిర్యాదులు రూపొందించి, ఒక కాపీ కాంగ్రెస్ అధిష్ఠానానికి అందజేస్తూ ముఖ్యమంత్రి కార్యం నడిపించినట్టుగా కెటిఆర్ సోషల్ మీడియా చెబుతోంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఇద్దరు బిసి మంత్రులకు ఉద్వాసన ఖాయమని ప్రచారం నడిపిస్తూ సిఎంకు, మంత్రులకు మధ్య గ్యాప్ తీసుకురావడానికి బిఆర్ఎస్ విఫలయత్నం చేస్తోంది. చివరకు డిప్యూటీ సిఎం పదవికి కూడా బిఆర్ఎస్ సోషల్ మీడియా ఎసరు పెట్టింది.

గజ్వేల్ సభ తెలంగాణ గేమ్ ఛేంజర్ కానుందంటూ గత ఏప్రిల్‌లో బిఆర్ఎస్ శ్రేణుల్లో జరిగిన ప్రచారం బూటకమని తేలిపోయింది. ఆ సభ తర్వాత పార్టీ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ తో చెలరేగిన మంటలు ఇప్పుడప్పుడే చల్లారే పరిస్థితులు లేవు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగంపై ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తన ఎమ్మెల్సీ పదవికి ఆమె రాజీనామా చేశారు.ఆమె రాజీనామా ప్రస్తుతం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వద్ద పెండింగులో ఉన్నది.జాగృతి జనం బాట పేరిట కవిత జిల్లాలు పర్యటిస్తున్నారు.అవకాశం దొరికినప్పుడల్లా ఆమె తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పై ప్రత్యక్షంగా, పరోక్షంగా విరుచుకుపడుతూనే ఉన్నారు. ఆమె గాయపడిన సింహం వలె గర్జిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా



కెసిఆర్ గజ్వేల్ సభలో పెద్దఎత్తున విరుచుకు పడ్డారు. కానీ బిజెపిపై చేయవలసినంతగా దాడి చేయలేదన్నది కవిత విమర్శ. అంతే కాకుండా తాను జైలులో ఉన్నప్పుడు పార్టీని బిజెపిలో పార్టీ విలీనానికి కుట్ర చేశారని ఆమె చేసిన ఆరోపణలు జూబిలీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ కు ఆయుధంగా మారాయి.

''మళ్ళీ అధికారం మాదే'' అనే నినాదం ఆకర్షణ కోల్పోయింది. ఇందుక్కారణం ఎన్నికలు జరగడానికి మరో మూడేండ్ల వ్యవధి ఉన్నది. ఈ లోగా అనూహ్యమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకొని 'మధ్యంతర' ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. రేవంత్ ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగదన్నది బిఆర్ఎస్ నాయకుల ఊహ. ఒక ఆశ. కేసీఆర్ ఫార్మ్ హౌజ్ నుంచి 'జన జీవన స్రవంతి' లోకి రానంతవరకు ఆ పార్టీ శ్రేణులకు 'కిక్కు' రాదు. తన కుమారుడు కెటిఆర్ పార్టీని సమర్థంగా నడిపించలేకపోతున్నట్టుగా కొందరు సన్నిహితుల దగ్గర కెసిఆర్ కామెంటు చేసినట్టు ఒక ప్రచారం ఉన్నది. అయితే కెటిఆర్ ప్రాధాన్యాన్ని తగ్గించలేరు, అలాగని మాజీమంత్రి హరీశ్ రావుకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించలేరు. అటు కవిత తన దారి తాను చూసుకున్నారు.ఈ వాతావరణంలో తీవ్ర మానసిక ఒత్తిడికి కెసిఆర్ గురవుతున్నారు. దీంతో ఆయన ఆరోగ్యమూ దెబ్బ తింటున్నట్టు మానసిక వైద్యులంటున్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాలను శాసిస్తుందని కానీ,మొత్తం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని, 'గేమ్ ఛేంజర్' కానుందని కానీ ఎవరూ అనుకోవడం లేదు. తమ హయాంలో జరిగిన తప్పిదాలు, లోటు పాట్లు, ప్రజల నుంచి తాము ఎందుకు దూరమయ్యామో, ప్రజలు తమకు ఎందుకు దూరమయ్యారో కెసిఆర్ లేదా కెటిఆర్ వివరణ ఇవ్వవలసి ఉన్నది. ''మమ్మల్ని అధికారానికి దూరం చేసి ఏమి కోల్పోయారో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ప్రజల్ని మోసంచేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది''అంటూ కెటిఆర్ పదేపదే మాట్లాడి ప్రజల్ని అవమానిస్తున్నా రు.

ముందుగా అసలు బిఆర్ఎస్ జాతీయ పార్టీయా, ప్రాంతీయ పార్టీయా అన్నది కెసిఆర్ స్పష్టం చేయవలసి ఉంటుంది.పదేండ్ల కాలంలో దాదాపు 7 లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేయవలసి వచ్చిందో, రైతు భరోసా తదితర పథకాల రూపంలో వేల కోట్ల రూపాయలను పుట్నాల వలె ఎందుకు పంచవలసి వచ్చిందో, ధనిక రాష్ట్రం కొన్నేండ్ల వ్యవధిలోనే ఎందుకు అప్పుల ఊబిలో కూరుకుపోయిందో కెసిఆర్ లేదా కెటిఆర్ జవాబు చెప్పడం లేదు. 'ధరణి' పేరిట జరిగిన 'భూ దోపిడీ',లక్షలాది ఎకరాల గుటకాయ స్వాహా, కాళేశ్వరం అక్రమాలు, ఫార్ములా ఈ రేసు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల గోల్ మాల్, అన్నింటికీ మించి ఫోన్ ట్యాపింగ్ వంటి నేరాలపై కెసిఆర్ 'వాంగ్మూలం' ఇవ్వవలసి ఉన్నది. తాము మరలా అధికారంలోకి వస్తే 'గడీ' పాలన ఉండదనీ, ఫార్మ్ హౌస్ నుంచి పరిపాలించబోమని చెప్పడానికి కెసిఆర్ సాహసించలేరు. కెటిఆర్ అటువంటి హామీ ఇవ్వలేరు. ప్రగతిభవన్ ఖాళీ చేసినప్పుడు, దానికి రక్షణగా ఉన్న ఇనుప ముళ్ల కంచెలు తొలగించినపుడు కెసిఆర్ ఎంతగా విలవిలలాడిపోయి ఉంటారో అంచనా వేయవచ్చు.

కాగా తెలంగాణ సెంటిమెంటు అస్త్రాన్ని బూజు దులిపి మళ్ళీ బయటకు తీసుకు రావడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలోనూ బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అయితే అది కాలం చెల్లిన ఔషధం. స్వరాష్ట్రమే సాకారమయ్యాక ఇన్ని సంవత్సరాల తర్వాత అలనాటి 'ప్రత్యేక భావోద్వేగాలు' రగిలించినా పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు. కనుక తమ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలపైనే కెటిఆర్ ఫోకస్ పెట్టవలసి ఉంటుంది. పార్టీ క్యాడర్‌ను అధికారంలో ఉన్న తొమ్మిదిన్నర ఏండ్లలో బిఆర్ఎస్ నాయకత్వం ఖాతరు చేసిందా? వారి బాగోగులు ఎప్పుడయినా పార్టీ నాయకత్వం పట్టించుకుందా? 'పార్టీ అంటే మేమే, మేమే పార్టీ' అనే వైఖరితో కెసిఆర్, కెటిఆర్ ప్రవర్తించిన కారణంగా పార్టీ కింది స్థాయి శ్రేణులన్నీ భగభగ మండిపోయాయి. 'కుటుంబ పాలన'కు వ్యతిరేకంగానే ప్రజలు తీర్పు ఇచ్చారు.

తాజా పరిస్థితి వేరు. బిఆర్ఎస్ పార్టీ అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటున్నట్టు స్వయంగా ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బిజెపి పుంజుకోవడం,పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడం బిఆర్ఎస్ 'పుణ్యమే'నన్న విశ్లేషణ ఉన్నది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో 119 స్థానాలకు గాను 64 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బిఆర్ఎస్ 39 స్థానాలకు పరిమితమైంది. 2018 లో కేవలం ఒక సీటు మాత్రమే పొందిన బిజెపి 14% ఓట్లతో 8 అసెంబ్లీ సీట్లు గెలుచుకోవడం తేలికగా తీసుకోవలసిన అంశం కాదు.

ఇదిలా ఉండగా ఏ పార్టీలోనయినా అత్యంత ముఖ్యమైన అంశం సంస్థాగత నిర్మాణం. టిఆర్ఎస్/బిఆర్ఎస్‌లో మొదటినుంచీ ఈ అంశాన్ని పట్టించుకున్న దాఖలాలే లేవు. గ్రామస్థాయి నుంచి తెలంగాణ భవన్ కు సమగ్ర సమాచార పంపిణీ వ్యవస్థ లేదు.నిష్పాక్షిక విశ్లేషణలు,నివేదికలు కెసిఆర్, కెటిఆర్ కు చేరే అవకాశాలు లేవు. ఒకవేళ చేరినా ఆయా సమాచారాన్ని వాళ్లిద్దరూ అలక్ష్యం చేసే రకం. తమకు తెలిసిన దానికన్నా ఇంకొకరికి ఎక్కువ విషయాలు, వాస్తవాలు తెలిసే చాన్సు లేదని కెసిఆర్ నమ్ముతుంటారు.ఇప్పటికీ కెసిఆర్ వైఖరిలో, ఆలోచనా సరళిలో ఎలాంటి మార్పు లేదని పార్టీ వర్గాలు చెబుతున్నవి.

# వన్నెతరగని దేశభక్తి గేయం వందేమాతరం



నర్సింగు కోటయ్య
నాగార్జున ప్రభుత్వ కళాశాల(A), నల్గొండ
9985930885

వందేమాతరం నినాదం లేని స్వాతంత్ర ఉద్యమాన్ని ఊహించలేం. ఆనాడు బ్రిటిష్ వారు వెయ్యి ఫిరంగులు ఎత్తి పెడితే మన భారతీయులు వందేమాతరం నినాదంతో 1000 ఫిరంగులకు మించిన భయాన్ని బ్రిటిష్ వారిలో పుట్టించారు. ఆ నినాదాన్ని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు నినదించారు. అంత గొప్ప స్ఫూర్తిని, ఉద్యమకాంక్షను రగిలించిన ఆ శక్తివంతమైన గేయమే మన జాతీయ గేయం అయినది. నరనరాన దేశభక్తిని నింపిన వందేమాతర గేయంలో భారత దేశ గొప్పతనం తెలుస్తుంది. బ్రిటిష్ వారి మెడలు వంచిన నినాదం వందేమాతరం.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 8 ఏప్రిల్, 1894) (బంకించంద్ర ఛటోపాధ్యాయ). 'ఛటోపాధ్యాయ్' అని బ్రిటిష్ వారు పలకలేక 'ఛటర్జీ' అని పిలువసాగారు. బ్రిటిష్ వారిని అనుకరిస్తూ ప్రపంచంకూడా 'ఛటర్జీ' అని పిలవడం ప్రారంభించింది. బ్రిటిష్ కొలువులో.. భారతీయ ఆత్మతో పని చేసిన బంకించంద్ర ఛటర్జీ భారతదేశం కోసమే పనిచేశారు. ఇతను బెంగాలీ కవి, వ్యాసరచయిత, సంపాదకుడు. ఇతని రచన అయిన వందేమాతరం ఇతనికి మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇతను వ్రాసిన ఆనంద్ మఠ్ అనే నవల నుండి ఈ గేయాన్ని సంగ్రహించారు. ఈ గేయం భారత స్వతంత్ర సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది. తాత్వికుల వివిధ రచనలోని బోధనలు వారి వారి దేశాలలో చైతన్యాన్ని తీసుకు వచ్చినవి.ఫ్రెంచ్ విప్లవంలో రూసో 'సోషల్ కాంట్రాక్ట్' వోల్టేర్ 'ది ఆంగ్లస్ లెటర్స్',మంటెస్క్యూ 'ది స్పిరిట్ ఆఫ్ లాస్', అమెరికా విప్లవంలో జాన్ లాక్ 'ట్రూ ట్రీటిస్ ఆఫ్ సివిల్ గవర్నమెంట్, జార్జ్ మెసన్ 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' థామస్ పెయిన్ 'కామన్ సెన్స్' కరపత్రం మొదలైనవి. విప్లవాలను, స్వాతంత్ర్య యుద్ధాలను, స్వాతంత్ర్య ఉద్యమాలలో ప్రజలను చైతన్యం చేసే అంశాలలో రచనలు ముఖ్యమైనవి. బంకించంద్ర చటర్జీ నవల ప్రభావితం చేసినంతగా ప్రపంచంలో ఏ రచన చెయ్యలేదు. బకింగ్ చంద్ర చటర్జీ తన 'ఆనంద్ మఠ్' నవల బెంగాలీ భాషలో రాయగా, అరవింద్ ఘోష్ ఆంగ్లంలోకి అనువదించారు.

ఆంగ్లేయుల గుండెల్లో ప్రమాదఘంటికలు మోగించిన వందేమాతరం గేయం, పదం స్వాతంత్రోద్యమ నాయకుల నుంచి సామాన్యుల వరకు ఉత్తరం నుంచి దక్షిణం వరకు తూర్పు నుంచి పడమర వరకు యావత్ భారతదేశాన్నిఉర్రూతలూగించి, ప్రతిధ్వనించింది. పూర్వకాలంలో గాని , ఇటీవల కాలంలో గాని ప్రపంచ సాహిత్య చరిత్ర లో,జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలలో ఒక మహాకవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి ఉద్యమింపజేసిన సంఘటన బంకించంద్ర చటోపాధ్యాయ విషయంలో లాగా మరొక దేశంలో ,మరొక దేశ స్వాతంత్రోద్యమంలో సంభవించలేదు.భారతదేశ స్వాతంత్రోద్యమం పల సిద్ధి దిశగా చైతన్యవంతమవుతున్నప్పుడు వందేమాతర గీతం దాని వేగాన్ని త్వరితం చేసినది. తమ సంస్కృతికి, సాంఘిక ధార్మిక జీవన ప్రవృత్తికి హాని, ప్రమాదం సంభవిస్తాయని ప్రచారం కన్న బలమైన విప్లవోద్యమ సాధనం ఇంకొకటి ఏ సమాజంలోనూ ఏ దేశ చరిత్రలోనూ ఉండదు.

అదిగాక బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టుతున్నారు, మానవ ధర్మాన్ని రూపుమాపుతున్నారు. అనే వేదన బంకించంద్ర చటోపాధ్యాయకి ఈ 'ఆనంద్ మఠ్' అనే నవల రాయడానికి ప్రేరణ కలిగించి, ఈ నవలలో సన్యాసుల స్వాతంత్ర సమర శంఖ నినాదం వందేమాతర గీతం అయిన ది.

మన దేశ జాతీయ గేయం వందేమాతరం గేయం. దీన్ని 1875లో నవంబరు 7న బంకిమ్ చంద్ర ఛట్టోపాధ్యాయ్ వ్రాసారు. ఆయన రచించిన బెంగాలీ నవల 'ఆనంద్ మఠ్'లో ఈ గేయాన్ని పొందుపరిచారు. వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం నవంబరు 7న మొత్తం దేశ ప్రజలు జరుపుకున్నారు.

భారతీయుల ఐహిక, పరమార్థ జీవితాలు బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో క్షీణ దశకు చేరే ప్రమాదాన్ని నివారించడానికి సన్యాసుల సమరం సాగింది. బకించంద్ర చటర్జీ ఈ నవల రాయడానికి నూరేళ్లకు పూర్వం 1773లో ఉత్తరదేశంలో కొందరు సన్యాసులు ఇంగ్లీష్ వారి ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి ఉద్యమించారు.1770 ప్రాంతంలో కరువుతో ప్రజానీకం అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో లక్షల మందికి పైగా చనిపోయారు.. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల పన్నుల పీడనానికి వ్యతిరేకంగా హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్లు ఏకమై చారిత్రాత్మక తిరుగుబాటు చేశారు. వారు కంపెనీ ఖజానాలను, ఆహార గోదాములను దోచుకుని పేద ప్రజలకు పంచిపెట్టారు. 'ఆనంద్ మఠ్' నవలను బంకిమ్ చంద్ర ఛట్టోపాధ్యాయ్ రచించేందుకు హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్ల తిరుగుబాటు ఉద్యమమే స్ఫూర్తిని



ఇచ్చింది. దేశభక్తిని, జాతీయతా వాదాన్ని రగిల్చేలా సాగిన ఆ ఉద్యమ ఘటనల గురించి 'ఆనంద్ మఠ్' నవలలో కళ్లకుకట్టేలా ఎన్నో ప్రస్తావనలు ఉన్నాయి. 'ఆనంద్ మఠ్' నవల 1882లో ప్రచురితమైంది.. 1884 ఏప్రిల్ 8న బకించంద్ర చటర్జీ మరణించాక 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరకల్పన చేసి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. అక్కడ నుండి వందేమాతరం అందరి నోళ్ళలో నినాదంగా మారింది. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ను విభజించడంతో వందేమాతర ఉద్యమంగా ఊపిరి పోసుకున్నది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కలిస్తే, కనబడితే వందేమాతరం నినాదాలతో కుల మతాలకతీతంగా నినాదంగా మారిపోయినది. ఇది బ్రిటిష్ వారికి శత్రు నినాదంగా భవిష్యత్తులో మారిపోయినది. ఇది భారత జాతీయ చరిత్రలో ఒక నూతన శకానికి నాంది పలికిన ఉద్యమం.

హిందూ, ముస్లిం ఐక్యతను దెబ్బ తీయడం. (devide and Rule Policy) విభజించుపాలించు సిద్ధాంతంతో హిందువులను ముస్లిములను విడదీస్తూ రెండు రాష్ట్రాలుగా చేస్తూ వైస్రాయ్ లార్డ్ కర్జన్ 1905 జూలై 20 న బెంగాల్ విభజన అధికార ప్రకటన చేశాడు. తూర్పు ప్రాంతాలైన ఢాకా, ఫరీదాపూర్, ఐకార్ గంజ్, నవాఖలీ, చిట్టగాంగ్ ప్రాంతాలు, అస్సాంతో కలిసి తూర్పు బెంగాల్ గా ఏర్పాటు చేశారు. దీని రాజధాని ఢాకా, ఉప రాజధాని చిట్టగాంగ్. బెంగాల్ పశ్చిమ ప్రాంతం, బీహార్, ఒరిస్సా , సెంట్రల్ ప్రావిన్స్ నుండి వేరు చేసిన శంబల్ పూర్ కలిసి పశ్చిమ బెంగాల్ గా (రాజధాని కలకత్తా) ఏర్పాటు చేశారు. ఈ విభజన 1905 అక్టోబర్ 16న అమలులోకి వచ్చినది. ఈ బెంగాల్ విభజనకు వ్యతిరేక ఉద్యమం 1905 ఆగష్టు 7 నే ప్రారంభమైనది . ఈ ఉద్యమానికి వందేమాతర ఉద్యమం అని అశ్వనీకుమార్ దత్త నామకరణం చేశాడు .వందేమాతరం అనగా (Hail Motherland) 'మాతృభూమికి నమస్కారం'(భారత మాతకు వందనం) అని అర్థం.ఈ ఉద్యమంలో ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించటం, ఒకరినొకరు పలకరించటం, వందేమాతరం అనే ఊత పదాన్ని ఉపయోగించటం వలన వందేమాతరం ఉద్యమం అనే పేరు వచ్చింది. ఈ ఉద్యమంలోనే విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను మాత్రమే ఉపయోగించాలానే నిర్ణయం తీసుకొనటం వలన దీనికి గల మరొక పేరు స్వదేశీ ఉద్యమం.

వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు పరిమితం కాకుండా దేశవ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రవాద నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బెంగాల్ లో బిపిల్ చంద్రపాల్ ,అరవింద గోష్ ,బరిసాల్ లో అశ్వనీకుమార్, దత్తపంజాబ్, ఉత్తరభారత్ లలో లాలా లజపతిరాయ్ ,అజిత్ సింగ్, హన్స్ రాజ్, పశ్చిమ భారత్ (పూనా, ముంబయి) లలో తిలక్ , పరంజపే, మద్రాస్‌లో చిదంబరం పిళ్ళే, సుబ్రహ్మణ్య అయ్యర్, ఆనందాచార్యులు, టి.ఎం.నాయర్, ఆంధ్రలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, డిల్లీ & జమ్ములలో సయ్యద్ హైదర్ రాజా, యునైటెడ్ ప్రావిన్స్ లలోమదన్ మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ బెనారస్‌లో సుందర్ లాల్ మొదలైన వారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

ఈ ఉద్యమ కాలంలోనే తిలక్ స్వదేశీ నేత కంపెనీని పూనాలో స్థాపించినాడు. ఠాకూర్ స్వదేశీ స్టోర్ స్థాపించినాడు.గోదావరి స్వదేశీ స్టోర్ గున్నేశ్వరరావు ఇచ్చిన రూ. 1000 విరాళంతో రాజమండ్రిలో ప్రారంభమైనది. ట్యుటికోరిన్ (మద్రాస్)లో స్వదేశీ స్టీమ్ నేవిగేషన్ కంపెనీని స్థాపించారు. అక్కడ ఈ ఉద్యమాన్ని సుబ్రమణ్య అయ్యర్, చిదంబర పిళ్లై విస్తృతం చేశారు. ఆంధ్ర ప్రాంతంలో కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు నేతృత్వం వహించి ఉద్యమాన్ని విస్తరించారు. వందేమాతరం ఉద్యమంను తీవ్ర ఉద్యమంగా ప్రారంభం నుంచి సాగించిన వారు అతివాదులు (జాతీయవాదులు) ఈ ఉద్యమంలో అత్యధిక ప్రాముఖ్యం వహించిన నాయకులు లాల్, బాల్, పాల్, ఘోష్ లు. 1906 లో కలకత్తాలో అపూర్వమైన రీతిలో శివాజీ ఉత్సవాలు నిర్వహించారు. స్వరాజ్యం సంపాదించటం ధ్యేయంగా లాల్, బాల్, పాల్, ఘోష్ లు ఉద్యమం నడిపించారు. ఇలా స్వాతంత్ర్యం కోసం జరిగిన ప్రతి ఉద్యమంలో ఊపిరైనది. బానిసత్వంలో పడిపోయిన భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించే మార్గంగా వందేమాతరం చైతన్యంనింపినది. సామాన్యులనూ సమరయోధులుగా మార్చింది.

అందరూ వందేమాతరంలో స్వాతంత్ర్య కాంక్షను చూశారు కానీ.. మతం కోణం చూడలేదు. దీంతో వందేమాతరం దేశం మొత్తం వ్యాపించింది. భారతీయులలో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమానంగా గౌరవిస్తూ జాతీయ గేయంగా అధికారికంగా స్వీకరించింది

భారత స్వాతంత్రోద్యమంలో వివిధ దశలలో జరిగిన ఉద్యమాలలో సామాన్యులు, స్వాతంత్రోద్యమకారులు తెల్లవారి చేతిలో బానిస జీవితాన్ని కొనసాగించిన ప్రతి భారతీయుడిలో వందేమాతరం జీవనాడి అయింది, రాజమండ్రి కళాశాల సంఘటనలో,కోటప్ప కొండ సంఘటనలో,కాకినాడ కొట్లాటలో, తెనాలి బాంబు కేసు సంఘటనలో,కుదిరాంబోస్ ఉరిశిక్ష సమయంలో, విప్లవకారుల అమరత్వ సమయంలో నినదించిన నినాదం, గేయం వందేమాతరం.

## జాతీయోద్యమ ప్రేరక శక్తి

వందేమాతర గీతానికి ఆవిర్భావం వెనుక ఒక అవమాన గాథ ఉంది. బంకించంద్ర ఛటోపాధ్యాయ్ బ్రిటిష్ పాలనలో డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తుండగా ఒక తెల్ల అధికారి అతనిపై జాతి వివక్షతో దాడి చేశాడు. ఆ అవమానం ఆయన హృదయంలో జ్వాలగా మారింది. తరువాత బ్రిటిష్ పాలకులు God Save the King (గాడ్ సేవ్ ద కింగ్)గీతాన్ని భారత జాతీయ గీతంగా ప్రకటించాలని చూస్తున్నారని తెలిసి, బంకిమ్ చంద్ర కలం నుంచి అక్షరాల మంటలు చిమ్మాయి. 1875 నవంబర్ 7న ఆయన రచించిన గీతమే, భారతీయ గేయం. ఇది బంకించంద్ర ఛటర్జీ రచించిన 'ఆనందమఠ్' అనే బెంగాలీ నవల లోనిది. స్వాతంత్ర్యోద్యమకాలంలో ఈ గీతాన్ని భారతీయులు 'విప్లవ గీతంగా' గానం చేశారు. ఇది జనగణమనతో సమానమైన స్థాయి కలిగి ఉంటుంది. వందేమాతరం గీతం ప్రథమంగా 1896లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలాపించబడింది. ఆ తర్వాత యావత్ భారత జాతి గుండెలనిండా చేరి ఉద్యమానికి పురికొల్పింది. ఇది భరత జాతి దాస్య శృంకణాల విముక్తి గీతమైతే, బ్రిటిష్ వారిని సప్త సముద్రాలు దాటించి విప్లవ గీతంగా మారింది.

'వందేమాతరం!

*సుజలాం సుఫలాం మలయజశీతలాం సస్యశ్యామలాం*
*మాతరం! వందేమాతరం!*
*శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం పుల్లకుసుమిత*
*ద్రుమదళ శోభినీం,*
*సుహాసినీం సుమధురభాషిణీం సుఖదాం వరదాం*
*మాతరం! వందేమాతరం!.*

**భావం:** తల్లీ! భారతమాత నీకు వందనం! తీయని జలాలతో, కమ్మని ఫలాలతో, చల్లని మలయ మారుతాలతో, పచ్చని పైర్లతో విలసిల్లే, తల్లి నీకు వందనం! పండు వెన్నెల రాత్రులలో విరబూసిన తరూలతలతో శోభిస్తూ, స్వచ్ఛమైన నవ్వులతో, మధురమైన మాటలతో మాకు సుఖాలను కలిగిస్తూ వరాలనిచ్చే, తల్లి నీకు వందనం!.

భాషా మిశ్రమం గురించి విమర్శలు ఎదురైనా ఆయన తగ్గకపోగా మీకు నచ్చితే పాడండి, లేకుంటే విసిరేయండి; దీని విలువ ప్రపంచం గుర్తిస్తుంది అని అన్నారు. తరువాత రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతంలోని ఆధ్యాత్మికతను గుర్తించి దేశాన్ని మాతృమూర్తిగా చూపించే విధానాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చారు. 1886లో అనేక సభల్లో స్వయంగా ఆలపించారు. బంకిమ్ చంద్ర మరణానంతరం ఈ గీతం అగ్నికణాలై ప్రజల్లో వ్యాపించింది. 1947 ఆగస్టు 15న మన స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున పార్లమెంట్‌లో సంగీతకారుడు ఓం ప్రకాశ్ ఈ గీతాన్ని ఆలపించారు. దూరదర్శన్‌లో ప్రతిరోజూ వినిపించే వందేమాతరంకు నేపథ్య సంగీతం లేకపోవటానికి దీనిలోని పదాల మాధుర్యం కారణమని చెబుతారు. బిబిసి వరల్డ్ సర్వీస్ నిర్వహించిన

* అంతర్జాతీయ పోటీల్లో ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గీతాలలో వందేమాతరం రెండవ స్థానం దక్కించుకుంది.
* 1906లో పాథే ఫోన్స్ కంపెనీ రవీంద్రనాథ్ ఠాగూర్ గళంలో దీన్ని రికార్డు చేసింది. బ్రిటిష్ పోలీసులు ఆ రికార్డులను నాశనం చేశారు. అయితే ఒరిజినల్ కాపీ పారిస్‌లో దొరికి,
* 1966లో ఇందిరా గాంధీ దాన్ని తిరిగి భారత్‌కు తెప్పించారు.
* 1950లో రాజ్యాంగ పరిషత్తు 'వందేమాతరం' ను 'జనగణమన'తో సమాన హోదాలో గౌరవించాలని తీర్మానించింది. ఈ గీతం భరత జాతి చైతన్యానికి నిత్య దీప్తి.

భారత సంస్కృతిలో అసతోమా సద్గమయ, సత్యమేవ జయతే, జననీ జన్మభూమిశ్చ, మా ఫలేషు కథాచనా వంటి వాక్యాలతో పాటు...ప్రపంచ స్థాయి 'నో దై సెల్ఫ్'...'సోక్రటీస్ సూత్రము, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప' అనే మార్క్స్ నినాదం మానవ వికాసానికి మైలు రాళ్లు అయినట్లే, వందేమాతరం కూడా ఆ కోవకు చెందిన మహోన్నత నినాదం. ఇది కేవలం స్వాతంత్ర్య చరిత్రలో ఒక పుట కాదు. భారత జాతి ప్రాణాల్లో నిత్యం ప్రజ్వరిల్లే అగ్నికణం. వందేమాతరం గీతం మాత్రమే కాదు, భరత జాతి బానిసత్వ విముక్తి గీతం.

మేకిరి దామోదర్

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 138 | శనివారం | 08-11-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00





# చర్చలు సఫలం

## ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బంద్ విరమణ

**తక్షణం రూ.600 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకారం**

**త్వరలో మిగతా రూ.300 కోట్లు**

**ఉపముఖ్యమంత్రి భట్టి హామీ**



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బంద్‌ను విరమిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటించిన కళాశాలలు యధావిధిగా ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం చర్చలు జరిపారు. కళాశాల యాజమాన్యాలకు సంబంధించిన బకాయిలు తరువాయి 6లో

# సైబర్ నేరాలపై భారీ ఆపరేషన్



**నెలరోజుల్లో 55 మంది అరెస్టు**

**బాధితులకు రూ.62.34 లక్షల చెల్లింపు**

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ మేరకు నెల రోజుల పాటు సైబర్ నేరస్తుల ఆట కట్టించేందుకు భారీ ఆపరేషన్ నిర్వహించినట్లు హైదరాబాద్ క్రైమ్స్ అదనపు పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక్క అక్టోబర్ నెలలోనే 55 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన శుక్రవారం తరువాయి 6లో



### ప్రతి ఎన్నిక నాకు ప్రతిష్ఠాత్మకమే..

రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికలైనప్పటికీ తానే అభ్యర్థిగా భావించి పనిచేస్తానని, ప్రతి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటానని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను పిసిసి అధ్యక్షునిగా ఉన్నప్పుడే మునుగోడు, హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. సామాన్య కార్యకర్తగా పార్టీ విజయం కోసం పనిచేస్తానని చెప్పారు. కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌస్‌లో పడుకోవాలా అని ప్రశ్నించారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని అన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లకు కిషన్ రెడ్డి లొంగిపోయారని విమర్శించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి

# అండగా నిలబడండి

**నగర అభివృద్ధికి హైదరాబాద్ ప్రజలు మద్దతివ్వాలి**

- స్థానిక ఎమ్మెల్యేల సహకారం ఉంటేనే సాధ్యం
- మహానగరానికి గోదావరి జలాలు తీసుకువస్తాం రేడియల్ రోడ్లు, మెట్రో రైలును విస్తరిస్తాం
- ఫ్లై ఓవర్లు, అండర్ ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు మోకాలడ్డుతున్నారు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**అభివృద్ధి పనులకు హైదరాబాద్ బ్యాడ్ బ్రదర్స్ కిషన్‌రెడ్డి, కెటిఆర్ అడ్డుకట్ట**



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో చేపపట్టనున్న మెట్రో రైల్ విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీ లాంటి పలు అభివృద్ధి పనులను 'హైదరాబాద్ బ్యాడ్ బ్రదర్స్ కిషన్‌రెడ్డి, కెటిఆర్' అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని, పదేళ్ల వరకు (2024–2034) వరకు మద్దతు ఇవ్వాలని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరువాయి 6లో



# వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో కనిపించొద్దు

- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాల నుంచి తరలించాలి
- సంబంధిత అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తరలించాలని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్ స్టేషన్లు , రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు సహా బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను కనిపించవద్దని సంబంధిత అధికారులకు న్యాయస్థానం స్పష్టం చేసింది. వీధి కుక్కల కేసును జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన ధర్మాసనం శుక్రరవారం విచారణ చేపట్టింది. 'విద్యా కేంద్రాలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్‌లు, డిపోలు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు ఆందోళనకరమైన రీతిలో పెరుగుతున్నాయి. అందుకే తరువాయి 12లో

పాన్ ఇండియా 'ఎస్ఐఆర్' కసరత్తుపై

# 11 నుంచి 'సుప్రీం' విచారణ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలనే ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను నవంబరు 11న విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే ఎన్‌జిఒ తరపున న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ మాట్లాడుతూ ఈ అంశాలు ప్రజాస్వామ్య మూలాలలోకి వెళ్లాయని చెప్పిన తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీ మాట్లాడుతూ నవంబరు 11 నుంచి పిటిషన్ల విచారణ ప్రారంభం అవుతుందని చెప్పారు. నవంబరు 11నుండి అనేక ముఖ్యమైన విషయాలను చేపట్టడానికి ఇతర సంఘాల విచారణను సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తామని ధర్మాసనం తెలిపింది. 'వివిధ రాష్ట్రాలలో ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తు తరువాయి 12లో



# బిజెపి, బిఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం

- ఓటమి భయంతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న బిఆర్ఎస్
- మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో బిజెపి లోపాయికారి ఒప్పందంతో పనిచేస్తుందని, కెటిఆర్ తానా అంటే, కిషన్ రెడ్డి తందాన అని అంటున్నారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,జూపల్లికృష్ణారావు ఆరోపించారు. ఓటమి భయంతోనే బిఆర్ఎస్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు.హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయనను ఎంపిగా గెలిపించినందుకు సహాయంగా కెసిఆర్‌కు గురుదక్షిణ కింద బిజెపి అభ్యర్థిని బలిస్తున్నారని ఆరోపించారు.గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 25 వేల ఓట్లను సాధిస్తే, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అదే శాసనసభ నియోజకవర్గం నుండి 64 వేల ఓట్లు బిజెపికి ఎలా వచ్చాయన్నారు.కెటిఆర్ తానా అంటే కిషన్‌రెడ్డి తందాన అంటారని ఎద్దేవా తరువాయి 6లో

# జూబ్లీహిల్స్ తీర్పుతో రాష్ట్ర దశ, దిశ మార్పు



- ఈ ఎన్నిక 4 లక్షల ప్రజల భవిష్యత్తుకోసం కాకుండా 4 కోట్ల ప్రజల భవితవ్యానికి సంబంధించింది
- ఉప ఎన్నికల్లో బిజెపి సైడయ్యింది
- 'మీట్ ది ప్రెస్'లో బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వికాసానికి , విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ ఎన్నిక జూబ్లీహిల్స్‌లో ఉండే నాలుగు లక్షల ప్రజల భవిష్యత్ కోసం కాదని, నాలుగు కోట్ల ప్రజల భవితవ్యానికి సంబంధించిందన్నారు. ప్రశ్నించే గొంతును గెలిపించాలని ఆయన కోరారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హరీశ్‌రావుతో శుక్రవారం 'మీట్ దిప్రెస్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తరువాయి 6లో

# బిఆర్ఎస్ పరిస్థితి అగమ్యగోచరం



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ముందే చేతులెత్తేసింది
- ముస్లిం ఓట్లకోసం కాంగ్రెస్ యత్నం
- మాగంటి గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ గోపీనాథ్ మరణం ఒక మిస్టరీ అనే విషయాన్ని స్వయంగా ఆయన తల్లి ఆరోపించిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గోపీనాథ్ మరణంతో పాటు ఆయన ఆస్తిపాస్తులపైన సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో బిజెపి వర్సెస్ ఐఎంసి(ఇండియన్ ముస్లిం కాంగ్రెస్) మధ్యే పోటీ అని, బిఆర్ఎస్ పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని, ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ ముందే చేతులెత్తేసిందని చెప్పారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర తరువాయి 6లో

# మేధాశక్తే ఓ ప్రయోగశాల

- నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం
- న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం కృషి చేయండి
- శాతావాహన యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచన

ప్రజాపక్షం/కరీంనగర్

నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని శాతావాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 25 మందికి పిహెచ్‌డి పట్టాలతో పాటు 2018 నుండి 2025 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తరువాయి 6లో








# జనరల్
STATE & REGIONAL NEWS

## క్రికెటర్ అరుంధతిరెడ్డిని సన్మానించిన మంత్రి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముంబయిలో జరిగిన మహిళల ప్రపంచ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టులో ఉన్న క్రికెటర్ అరుంధతిరెడ్డిని శుక్రవారం తన ఛాంబర్‌లో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సన్మానించారు. ఇటీవల జరిగిన ఉమెన్ వరల్డ్ కప్ 2025లో తన దైన పాత్ర పోషించిన అరుంధతి రెడ్డిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ ఎండి సోని బాలదేవి, కోచ్ ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులను ఆదుకోవాలి

### దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/బీమదేవరపల్లి :** మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లిందని వాటిలో ప్రధానంగా బీమదేవరపల్లి మండలంలో తీవ్ర ప్రాణనష్టం, పశు సంపద, పంట నష్టం, ఆస్తి నష్టం, రోడ్లు దెబ్బతిన్నాయని, జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి బాధితులందరికి నష్టపరిహారం చెల్లించాలని, వరద ప్రభావంతో దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీమదేవరపల్లి మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావం కారణంగా కొత్తపల్లి వరద ప్రభావంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కాకుండా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంట పొలాల్లో ఇసుక మేటలు తేలి రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల ప్రకటించిందని, ఆ పంట నష్టం ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, పశు సంపద నష్టపోయిన వారికి కూడా పరిహారం ఇవ్వాలని, ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసి పంటలకు సాగు నీరు అందించాలని, ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించి, పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదరిక నిర్మూలనలో కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం ఆదర్శమని చాడ వెంకట రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పాలన ఉంటే ఏమిటో కేరళ ప్రభుత్వం చూపించి, నిరూపించిందని, కేరళలో పేదరిక నిర్మూలనకు కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం తీసుకున్న చర్యలు అమోఘమని, విద్య, వైద్య రంగంలోనే కాకుండా సుపరిపాలనలో కేరళ దేశంలో ముందంజలో ఉందని చాడ తెలిపారు. సిపిఐది వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి పిలుపునిచ్చారు. ఈ బస్సు జాత నవంబర్ 18న బీమదేవరపల్లి మండలంలోని మాణిక్య పూర్ గ్రామానికి చేరుకొని అక్కడి నుండి హనుమకొండ జిల్లాలో బస్సు జాత ప్రారంభం అయి 19న పరకాలలో ముగించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లనుందని తెలిపారు. ఈ బస్సు జాతను పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎన్‌వి స్టాలిన్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొగల రామచంద్ర రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి అదరి రమేష్, నాయకులు చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ అవకాశాలు పుష్కలం...
# పెట్టుబడులు పెట్టండి

### 'అమెరికా - యూటా' రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన 'తెలంగాణ'లో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని 'అమెరికా యూటా' పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా ఎండి, సిఒఒ డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో శ్రీధర్‌బాబును శుక్రవారం ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా–తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్‌టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టి హబ్, టి వర్క్స్, వీ హబ్‌లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా, సిలికాన్ స్లోప్స్ & యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచిగా మారాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. తెలంగాణ లాంటి ఫాస్ట్‌గ్రోయింగ్, డైనమిక్, ప్రోయాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హోకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కోఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ ఫుడ్ సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మి నారాయణ, ఐఐఆర్‌ఎఫ్ గురు సాలే తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం

### హనుమకొండ ఎసిపి నరసింహారావు
### ఘనంగా నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం



**ప్రజాపక్షం/హనుమ-కొండ :** పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం అని హనుమకొండ ఎసిపి పి.నరసింహ రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లో నవచేతన బుక్ హౌస్‌లో ఘనంగా పుస్తక ప్రదర్శన ప్రారంభం అయింది. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఎసిపి నరసింహారావు అనంతరం మాట్లాడుతూ మనిషిని పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి పుస్తకాలకే ఉందని అన్నారు. విద్యార్థి దశ నుండే పుస్తకాలు చదివే అలవాటును రూంపొందించుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖ ప్రచురణ సంస్థలకు చెందిన అనేక రకాల పుస్తకాలను తగ్గింపు ధరలతో నవచేతన బుక్ హౌస్ ద్వారా పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, ఈ పుస్తక ప్రదర్శనలో 10 నుండి 40 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎలుగటి తిరుపతి రెడ్డి, న్యాయవాదులు బండి మొగిలి, ఏరుకొండ జయశంకర్, ఎం.సదాశివుడు, జర్నలిస్టులు మంచాల రాజు, ఎండి. ఉస్మాన్ పాషా, తాండూరు గోపి, పి.కిషోర్ కుమార్, కుక్కల రాజు, సిబ్బంది అకినెపల్లి రమేష్, టి.సూర్య తదితరులు పాల్గొన్నారు.

## 'అక్టోబర్ విప్లవం' సమాజంలో వినూత్న మార్పు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాంతి, అందరికీ భూమి, ఆహారం హామీలను నెరవేర్చిన సోవియట్ యూనియన్ 'అక్టోబర్ విప్లవం' సమాజంలో వినూత్న మార్పును తీసుకొచ్చిందని, దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని చూపిందని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్‌లోని ఎం.బి భవన్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన 'అక్టోబర్ విప్లవం విశిష్టత' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ, బూర్జువాలు కలిసి రష్యాలో జార్ చక్రవర్తుల పాలనను కూలదోసి ఫిబ్రవరి 17న ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, కానీ ప్రజలు ఆశించిన విధంగా యుద్ధాల నుంచి విముక్తి, రైతులకు భూమి, అందరికీ రేషన్ అందించేందుకు బూర్జువాలు సిద్ధంగా లేకపోవడంతో ప్రజల సహకారంతో 'అక్టోబర్ విప్లవం' ద్వారా లెనిన్ నాయకత్వంలో రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వం యుద్ధాల నుంచి శాంతి కలిగించి, పేదలకు భూములను పంపిణీ చేసిందని, అందరికీ రేషన్, సంక్షేమం అందించిందని వివరించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రపంచంలో సోషలిస్టు వ్యవస్థ పని అయిపోయిందని పెట్టుబడిదారీ దేశాలు సంతోషపడుతున్న సమయంలోనే 'చైనా కమ్యూనిస్టు' పార్టీ ఆధ్వర్యంలో సోషలిస్టు వ్యవస్థ నేడు ప్రపంచం ముందుకు బలంగా వచ్చిందన్నారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో చైనా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పెట్టుబడి దారీ దేశమైన అమెరికాకు గుండెకాయ లాంటి ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు భావజాలం ఉన్న మమ్దాని అధికారంలోకి వచ్చారని, అమెరికా ప్రజలు కూడా సోషలిస్టు వ్యవస్థ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన తెలిపారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేయాలని, ప్రజలను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. కాగా ఈ సదస్సులో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్, బండారు రవి కుమార్ పాల్గొనగా, తొలుత వేదికపైకి వక్తలను రాష్ట్ర కమిటీ సభ్యులు జె.బాబురావు ఆహ్వానించారు.

## నగరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో ఓటర్లు బిజెపి, బిఆర్‌ఎస్‌కు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. ఎల్లారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను అప్యాయంగా పలుకరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ హైదరాబాద్ మహా నగరాభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. కొన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను చూపించి నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం మాపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశలు, భావితరాల ఆకాంక్షలే అజెండాగా అత్యంత పారదర్శకతతో కూడిన పాలనను తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి నిరంతరం పాటుపడుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి, నిరంతరం నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం తపించే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కార్యాలయంలో జాతీయ గేయం వందేమాతరం గీతాలాపన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ గేయం వందేమాతరంకు 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా డిజిపి బి.శివధర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖకు సంబంధించిన ప్రధాన విభాగాల కార్యాలయాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది సమష్టిగా పాల్గొని దేశభక్తి ఉట్టిపడే వాతావరణంలో వందేమాతరం గేయాన్ని ఉత్సాహంగా ఆలపించారు. భారతదేశ చరిత్రలో అపూర్వమైన స్థానం కలిగిన వందేమాతరం గేయం జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గీతం పోషించిన ప్రేరణాత్మక పాత్రను స్మరించుకున్నారు. లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయం, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లతో పాటు జిల్లాల ఎస్‌పి కార్యాలయాల్లో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇంచార్జ్ చార్మినార్ డిఐజి ఎల్.ఎస్. చౌహాన్, ఎఐజిలు రమణ కుమార్,ఏఐజీ నాగరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'వందేమాతరం' 150 సంవత్సరాల జ్ఞాపకార్థం ఏడాది పొడవునా జరిగే వేడుకల్లో భాగంగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ అధికారులు, సిబ్బంది శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జాతీయ గేయాన్ని ఆలపించారు. బంకించంద్ర ఛటర్జీ సహకారాన్ని గౌరవించడం, మాతృభూమి పట్ల ఐక్యత, త్యాగం, ప్రేమ విలువలను పునరుద్ధాటించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.

## ఆర్‌టిసిలో జెఎసికి శ్రీకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలంగా ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పోరాటానికి కార్మిక సంఘాలు సిద్ధమౌతున్నాయి. ఇందుకోసం ముందుకు వచ్చే ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసిని ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పలు కార్మిక సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్. బాల్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె.రాఘవులు, కోశాధికారి కె.రామిరెడ్డి, తెలంగాణ మద్దూర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కమలాకర్ గౌడ్ చీఫ్ అడ్వైజర్ బి.యాదయ్య, బహుజన కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, బుద్ధ విశాల్, బి.రాములు, బి.డబ్ల్యు.యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.వి.కె.యాదవ్, సుద్దాల సురేష్, డి.రామచంద్రం, కార్మిక పరిషత్ నుండి బి.యాదగిరి, ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్‌టిసి కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్‌టిసి కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే గతంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా యూనియన్ల ప్రాతినిధ్యం లేకపోవడం వలన, వాటిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం వలన అన్ని డిపోలలో కార్మికులపై అధిక పనిభారం మోపి నిత్యం వేధింపులకు యాజమాన్యం పాల్పడుతోందని, రాబోయే రోజులలో ఆర్‌టిసి ఉనికికి, కార్మికుల భద్రతకు ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల వలన పెను ప్రమాదం ముంచుకు వస్తోందని తెలియజేస్తూ, ఆర్థిక అంశాలపైన, ఇతర పెండింగ్ అంశాలపైన ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులలో ఉన్న కార్మికవర్గాన్ని మరోసారి పోరాటం వైపు తీసుకురావటానికి కలిసివచ్చే సంఘాలతో జెఎసిగా ఏర్పడి సర్కారు ఇచ్చిన హామీల అమలుకై సమరం సాగించడానికి ఈ నెల11 జరిగే మరో సమావేశంలో నూతన జెఎసిని ఎన్నుకుని, అదేరోజు ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా జోరందుకున్న సిపిఐ ప్రచారం

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రచారం జోరందుకుంది. నవీన్ యాదవ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీ, వినోబా నగర్, మారుతినగర్, సీతానగర్, హరిజన బస్తీ, వినాయక్ నగర్ ఏరియా సిపిఐ నేతలు విస్తృతంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ మాట్లాడుతూ.. బిజెపితో అంతర్గతంగా చీకటి ఒప్పందాన్ని చేసుకున్న బిఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో కెటిఆర్ ఓటమి భయంతో కాంగ్రెస్ అభ్యర్థిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఏమి ఒరగబెట్టిందో చెప్పకుండా దిగజారి దూషణలకు దిగుతుండడం గర్హనీయమన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల అదేవిధంగా విద్యా రంగ, నిరుద్యోగ సమస్య పట్ల చిత్తశుద్ధితో ఉన్నదని అందుకనే ప్రజలు కాంగ్రెస్‌ని గెలిపించాలని సిపిఐ నిర్ణయం తీసుకుందని అన్నారు. మతం తప్ప ఏనాడు ప్రజల జీవితాల గురించి మాట్లాడని కేంద్రమంత్రి బండి సంజయ్ మతవిద్వేషాలు సృష్టించడానికి కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఇటువంటి నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని ఇప్పుడు ఆ పార్టీ నేతలు మొసలి కన్నీరు కారుస్తుండడం విచారకరమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ మాట్లాడుతూ.. పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రజల ఆస్తులు దోచుకున్నారని ఆరోపించారు. అడిగిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపారని ఇప్పుడు వచ్చి ఓట్లు అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, కాంగ్రెస్ పార్టీ షేక్ పేట్ డివిజన్ ఇంచార్జి క్రాంతి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, షేక్ షంషుద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, కొమురెల్లి బాబు, సైఫ్, నరసింహ, షానా అంజుమ్, అనిల్, దశరథ్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.


# జర్నలిస్టుల కోసం హైపవర్ కమిటీ

### దాడులు, దౌర్జన్యాలపై విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో జర్నలిస్టులపైన జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హైపవర్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండేళ్లపాటు పని చేయనుంది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి హైపవర్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఉత్తర్వులు (జిఒ నంబర్ 219) జారీ చేశారు. సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి ఛైర్మన్‌గా మొత్తం 14 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సమాచార, పౌర సంబంధ శాఖను ఆదేశించింది.

జర్నలిస్టుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి, దాడులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునేందుకు హైపర్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. అవసరమైతే కమిటీ తరచూ సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనుంది. కాగా ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలనలను, ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది.

**కమిటీ:** ఛైర్మన్‌గా సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి, సభ్యులుగా హోం శాఖ ముఖ్యకార్యదర్శి/ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, సమాచార, పౌర సంబంధాలశాఖ ఇ.ఒ స్పెషల్ సెక్రటరీ, అదనపు డిజి (లా అండ్ ఆర్డర్), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్సు (హెచ్143/2013), 'తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్సు (హెచ్ 9/2014), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (H2843/2010), తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్సు (టిఎఇఎంజె), తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్సు యూనియన్ (టిఇఎంజెయు), స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(418/2014), తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్, మ్యాగజైన్స్ అసోసియేషన్ (788), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్సు యూనియన్ (హెచ్69/2017/టిఎస్) ఉన్నారు. కాగా మెంబర్ కన్వీనర్‌గా సమాచార, పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరక్టర్/డైరక్టర్ ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సైబర్ మోసానికి 'ఎంపి' బలి
### బ్యాంక్ ఖాతా నుంచి రూ.56 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**కోల్‌కతా:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులతోపాటూ సెలబ్రిటీలు కూడా నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఎంపీ సైబర్ మోసానికి బలయ్యారు. ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి నేరగాళ్లు ఏకంగా రూ.50 లక్షలు కాజేశారు. తణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నాలుగుసార్లు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సైబర్ మోసానికి బలయ్యారు. స్టేట్ బ్యాంక్‌లో ఎంపీ ఖాతాను సైబర్ నేరగాళ్లు నకిలీ పత్రాలను ఉపయోగించి యాక్సెస్ చేశారు. నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి ఏకంగా రూ.56 లక్షలు కాజేశారు. ఈ సొమ్మును వివిధ ఖాతాలకు తరలించడం, ఏటీఎమ్ ద్వారా విత్‌డ్రా చేయడంతోపాటూ ఆభరణాల కొనుగోళ్లకు ఉపయోగించినట్లు తేలింది. ఈ ఘటనపై అత్యవసర దర్యాప్తు కోరుతూ సైబర్ క్రైమ్ పోలీసులకు కోల్‌కతా ఎస్‌బీఐ బ్రాంచ్ ఫిర్యాదు చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎస్ఐఆర్ వద్దు: 'సుప్రీం'లో డిఎంకె పిటిషన్



**న్యూఢిల్లీ :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎస్ఐఆర్‌ను తమ రాష్ట్రంలో చేపట్టరాదని ఆ పిటిషన్‌లో కోర్టును కోరింది. దీనిపై అత్యవసరంగా వాదనలు చేపట్టాలని డీఎంకే అభ్యర్థించింది. అయితే మంగళవారం ఈ కేసుపై వాదనలు చేపట్టనున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. ఇటీవల బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టి 65 వేల ఓటర్లను తొలగించారు. ఇది విజయవంతం కావడంతో దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఈసీ భావిస్తోంది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం... పిటిషన్‌ను స్వీకరించింది. న్యాయవాది వివేక్ సింగ్ ఆ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి ఈ నెల మూడో తేదీన పిటిషన్ వేశారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ వ్యతిరేకమని, ప్రజాస్వామ్య హక్కులకు ప్రమాదం అవకాశం ఉన్నట్లు ఆరోపించారు. తమిళనాడులో ఎస్ఐఆర్ చేపట్టాలని గత నెల 27న ఈసీ ఇచ్చిన నోటిఫికేషన్ కొట్టివేయాలని వివేక్ తన పిటిషన్‌లో కోరారు.

## ఆర్‌బిఐ చర్యలతో ఎస్‌బిఐ పటిష్టం
### సంజయ్ మల్హోత్రా



**ముంబై:** ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఇప్పుడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెప్పారు. 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన సంస్కరణల కారణంగానే ఈ స్థాయికి చేరిందన్నారు. ఈ మేరకు ముంబైలో ఎస్‌బీఐ బ్యాంకింగ్, ఎనకమిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఆర్‌బీఐ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, కీలక విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ అలవడడంతో పాటు బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైందన్నారు. ముఖ్యంగా దివాలా చట్టం2016, కోర్టు వెలుపలి పరిష్కార మార్గాలు వంటివి రుణవిధానాల్లో కీలక మార్పునకు నాంది పలికాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు సంక్షోభాన్నే అవకాశంగా మలుచుకుని 2014 నుంచి ఆర్‌బీఐ అనేక చర్యలు చేపట్టిందని మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనికితోడు 27గా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను 2020 నాటికి 12కి తగ్గించడం, బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధనం సాయం, బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం, ఆరోగ్యకర రుణ వాతావరణం కల్పించడం వంటివీ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదం చేశాయన్నారు.

## బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు
### కంచి ఆలయం



**చెన్నై:** తమిళనాడులోని కాంచీపురంలో గల వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఆలయ యాజమాన్యం స్పందించింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు జరగలేదని స్పష్టం చేసింది. 'ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలు మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని ఆలయ కార్యనిర్వాహక అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలు మార్చేసి... వాటి స్థానంలో కొత్త తాపడాలు ఏర్పాటుచేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరికి తాపడాలలో ఎలాంటి మార్పు లేదని నిర్ధారించారు.

# హోల్‌సేల్‌గా ఓటు చోరీ
## బిహార్‌లోనూ కొనసాగింపునకు బిజెపి యత్నం

### తన వ్యాఖ్యలను ఇసి కూడా ఖండించలేదు : రాహుల్ గాంధీ




**న్యూఢిల్లీ/ బంకా :** ఢిల్లీలో ఓటు వినియోగించుకున్న బిజెపి నేతలు, బిహార్ తొలివిడత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటు వేశారని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బిజెపి ఎన్నికలను హోల్‌సేల్‌గా దొంగతనం చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోదీ ఎన్నికలను దొంగిలించడం ద్వారా ప్రధానమంత్రి అయ్యారని ఆరోపించారు. బిజెపి ఎన్నికలను ఎలా దొంగిలిస్తుంది అనే విషయాన్ని దేశంలోని యువతకు, జనరల్ జెడ్‌కు కాంగ్రెస్ స్పష్టంగా చూపించిందన్నారు. ఓటరు దొంగతనంను వెలికితీసే ఇంకా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బిహార్‌లోని బంకా జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ హర్యానాలోని 2 కోట్ల ఓటర్లలో 29 లక్షలు నకిలీవని పునరుద్ఘాటించారు. ఇదే తరహాలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోనూ చేశారన్నారు. ప్రస్తుతం బిహార్‌లో ఓట్ల చోరీకి యత్నిస్తున్నారని ఆరోపించారు. తన ఆరోపణలను ఇసి సైతం ఖండించడం లేదని రాహుల్ గాంధీ తెలిపారు. బిహార్ ప్రజలు ఈ తరహా ఓట్ల చోరీని అనుమతించరని తనకు తెలుసన్నారు. ఎన్‌డిఎ సర్కార్ సమస్యలపై యువత ప్రశ్నించకుండా వారిని దారి మళ్లిస్తూ సోషల్‌మీడియా రీల్స్‌లో ముంచుతోందని రాహుల్‌గాంధీ ఆక్షేపించారు. రీల్స్ 21వ శతాబ్దపు వ్యసనం అని గాంధీ అన్నారు. ఎన్నికలను తారుమారు చేయడం ద్వారా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆ విషయం నిరూపిస్తానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు హర్యానా ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ అక్కడ ఎన్నికల చోరీ జరిగిందన్నారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం నుంచి ఎటువంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. అదేవిధంగా బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓటింగ్ ఎలా జరిగిందని రాహుల్ ప్రశ్నించారు. భగల్‌పూర్‌లో జరిగిన మరో ఎన్నికల ర్యాలీలో, బిహార్‌లోని రైతులు, కార్మికులు, నేత కార్మికులు బ్యాంకుల నుండి రుణాలు పొందరని, వారి రుణాలను మాఫీ చేయరని రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. అయితే, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ కొన్ని కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తుందని గాంధీ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ముఖాన్ని 24 గంటలు చూపించడానికి టివి ఛానెల్‌లకు బిజెపి డబ్బు చెల్లిస్తుందని కూడా రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'మీడియాను బిజెపి నియంత్రిస్తోంది... మనం ఏమి చెప్పినా, మీరు దానిని సోషల్ మీడియాలో చూడవచ్చు... కానీ, టీవీ ఛానెళ్లలో కాదు. నరేంద్ర మోదీ, అమిత్ షా, ఇసి హర్యానా ఎన్నికలను దొంగిలించారు. తమ వద్ద నలుపు, తెలుపు రంగులో ఆధారాలు ఉన్నాయి...

హర్యానా ప్రభుత్వం 'చోరీ కి సర్కార్' (దొంగతనం ద్వారా ఏర్పడిన ప్రభుత్వం) అని నేను పూర్తి నమ్మకంతో చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు.

# మోదీ, నితీశ్‌పై నమ్మకం వల్లే బిహార్‌లో పెరిగిన ఓటింగ్

### ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**ఔరంగాబాద్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో భాగంగా గురువారం పోలింగ్ జరగగా, గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డుస్థాయిలో నమోదైంది. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు 'నరేంద్ర, నితీష్' ల ట్రాక్ రికార్డుపై నమ్మకం ఉంచడం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. శుక్రవారం మోదీ ఔరంగాబాద్, కైమూర్ జిల్లా ప్రధాన కార్యాలయం అయిన భభువాలో వరుస ర్యాలీలనుద్దేశించి ప్రసంగించారు. బిహార్‌లో జెడి (యు) అధ్యక్షుడు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన 121 నియోజకవర్గాలలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని కూడా ప్రశంసించారు. తాను వాగ్దానం చేసిన వాటిని అమలు చేస్తానని పేర్కొంటూ రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఆపరేషన్‌సిందూర్ వంటి ఉదాహరణలను ఆయన ఉదహరించారు. ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షాల తప్పుడు వాగ్దానాలకు వారు మోసపోలేదని, మిత్రపక్షంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ కూడా ఆర్‌జెడి మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాలను విశ్వసించడం లేదన్నారు. తేజస్వి యాదవ్ పేరును ప్రస్తావించకుండా అడవి రాజ్ యువరాజు తాను చేస్తున్న బూటకపు వాగ్దానాలను నెరవేర్చడానికి తన ప్రణాళికలు ఏమిటని అడిగినప్పుడల్లా నాలుక కరచుకుంటున్నారన్నారు. నక్సలైట్లు రాజ్యమేలుతున్న సమయంలో, ఎన్నికల సమయంలో హింస, బాంబు పేలుళ్లలో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన 'జంగిల్‌రాజ్' తిరిగి రావాలని ప్రజలు కోరుకోవడం లేదని నొక్కి చెప్పారు. వివాదాస్పదంగా మారిన ఆర్‌జెడి ఎన్నికల ప్రచారం గురించి ప్రస్తావిస్తూ, 'జంగిల్ రాజ్ వల్లాలు పిల్లలకు కూడా కట్టా (లైసెన్స్ లేని దేశీయంగా తయారు చేసిన తుపాకీ),దునాలి (డబుల్ బ్యారెల్ తుపాకీ) వంటి వాటి గురించి మాట్లాడటం నేర్పించారని దుయ్యబట్టారు. లాంతరు (ఆర్‌జెడి), పంజా (కాంగ్రెస్ చిహ్నం), లాల్ జెండా(వామపక్షాల ఎర్ర జెండాలు) చూసి పెట్టుబడిదారులు పారిపోతారని విమర్శించారు. ఈసారి కూడా వారు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించారని, కానీ ఎన్నికలను క్రమబద్ధంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని అభినందిస్తున్నానన్నారు. కాగా, ప్రధానమంత్రి ఒక ర్యాంకు పెన్షన్ పథకం గురించి కూడా మాట్లాడుతూ మాజీ సైనికుల ఖాతాల్లోకి రూ. లక్ష కోట్లు బదిలీ అయ్యాయన్నారు.

**'గత 35-40 ఏళ్లలో గెలవని స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయించింది'**

'బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆర్జేడీ అవమానించింది. గత 35—40 ఏళ్లలో గెలవని స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయించింది. పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి సిఎం పదవిని లాలు పార్టీ తస్కరించింది. ఇప్పుడు కూడా అనేక స్థానాల్లో కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీ పోటీ పడుతున్నాయి. వారి సహచరులు వారే వెన్నుపోటు పొడుస్తున్నారు. అలాంటి వారు మీకు మంచి చేస్తారా? కాంగ్రెస్, ఆర్‌జెడి కేవలం అవమానం, వేధింపులతోనే రాజకీయం చేస్తుంది. కాంగ్రెస్ రాజ కుటుంబం ఛాతి మైయా పూజను డ్రామా అన్నారు. మహా కుంభమేళాను అనవసరమని చెప్పారు. మనం చేసే ప్రతీ పండగలతో వారు ఇబ్బందులకు గురవుతారు. మన విశ్వాసాలను ఈ రాజకుంటుంబీకులు అవమానిస్తూనే ఉంటారు. ఇలాంటి వారికి నవంబర్ 11న జరిగే పోలింగ్‌లో మీ ఓటుతో గట్టి బదులు చెప్పాలి. ఇప్పటికే కాంగ్రెస్ ఓటమికి కారణాల కోసం వెతుకులాడుతోంది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి...
# పైలట్‌ను నిందించలేం

### తేల్చిచెప్పిన 'సుప్రీంకోర్టు'
### ప్రాథమికనివేదికలో అతడిపై ఎలాంటి ఆరోపణ లేదని వెల్లడి




**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ఘటనలో 260మంది ప్రాణాలను బలిగొన్న ప్రమాదానికి ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ చీఫ్ పైలట్‌ను ఎవరూ నిందించలేదని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. అతడి 91ఏళ్ల తండ్రి ఎటువంటి భావోద్వేగ భారాన్ని మోయవద్దని కోరింది. 'ప్రాథమిక నివేదికలో కూడా అతడిపై ఎలాంటి ఆరోపణలేదు'అనిజస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.అవసరమైతే దురదృష్టకర విమాన ప్రమాదానికి పైలట్‌ను నిందించకూడదని నొక్కిచెబుతూ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మరణించిన పైలట్ కెప్టెన్ సమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)కు నోటీసులు జారీచేసింది. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ఎఐ171 కూలిపోవడంపైసుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని పుష్కరాజ్ సభర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలెట్స్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 'మొదట ఇది దురదృష్టకర విమాన ప్రమాదం. రెండవది మీ కొడుకును నిందిస్తున్నారని మీరు మీపై భారం మోయకూడదు. విమాన ప్రమాదానికి పైలట్‌ను ఎవరూ నిందించకూడదు. ఇది ఒక ప్రమాదం' అని బెంచ్ పుష్కరాజ్ సభర్వాల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ చెప్పారు. 'ఈ ప్రమాదం పైలట్ తప్పిదం వల్ల జరిగిందని కౌంటీలోని ఏ ఒక్కరూ నమ్మరు' అని ధర్మాసనం చెప్పింది. విమాన ప్రమాదాలకు దారితీసిన తప్పిదాలను ఎత్తిచూపి పేరులేని ప్రభుత్వ మూలాన్ని ఉటంకిస్తూ అమెరికా ప్రచురణ సంస్థ వాల్ స్ట్రీట్ జనరల్ ఒకవార్తా కథనాన్ని ప్రచురించిన తర్వాత ఇదంతా ప్రారంభమైందని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ ధర్మాసనానికి తెలియజేశారు. 'ఇది ఇండియాను నిందించడానికి మాత్రమే ప్రచురించిన ఒక దుష్ట వార్తా కథనం. మేం విదేశీ మీడియా కథనాల గురించి ఏమాత్రం ఆందోళన చెందడం లేదు. ఈ దేశంలోని ఏ ఒక్కరూ ఇది పైలట్ తప్పిదం వల్లే జరిగిందని విశ్వసించడం లేదు' అని శంకర్‌నారాయణన్ చెప్పారు. మీడియా నివేదికల ప్రకారం గౌరవంతో అతని పరిష్కారం అమెరికన్ కోర్టులో ఉందని, అక్కడ అతను దావా వేయవచ్చునని జస్టిస్ బాగ్చి చెప్పారు. 'మీ ఆందోళన అర్థం చేసుకొనదగినదే కానీ, ప్రజల అభిప్రాయానికీ, వాస్తవ పరిస్థితికీ మధ్య ఒక స్పష్టమైన అసంబద్ధత ఉంది' అని జస్టిస్ బాగ్చి జోడించారు. 'ఎఎఐబి దర్యాప్తు పరిధిని నిందించడం కాదు. నివారణకు చర్యలను సూచించడమే. అవసరమైతే పైలట్‌ను నిందించడం తగదని మేం స్పష్టం చేయగలం' అని ధర్మాసనం చెప్పింది. 'మనది దాదాపు 142 కోట్లమంది జనాభా కలిగి ఉన్న దేశం. పైలట్‌పై నిందవేయాలని ఏ ఒక్కరూ భావించరు. ఈ విషాద ఘటనకు కారణం ఏదైనప్పటికీ అది పైలట్ల తప్పిదం మాత్రం కాదు' అని ధర్మాసనం జోడించింది. ఈ విషయంపై స్వతంత్ర దర్యాప్తును కోరుతున్నామని, విషాదం తర్వాత తయారు చేసిన ప్రాథమిక నివేదిక స్వతంత్ర దర్యాప్తు ఆధారంగా లేదని శంకరనారాయణన్ అన్నారు. ప్రమాదంపై దర్యాప్తు ప్రక్రియ ప్రకారం జరిగిందని జస్టిస్ బాగ్చి స్పష్టంచేశారు. ఈ విషాద సంఘటనపై న్యాయమైన, పారదర్శకమైన, సాంకేతికంగా బలమైన దర్యాప్తు జరగాలని పుష్కరాజ్ సభ ర్వాల్ కోరారు. ఆయన మాట్లాడుతూ 'నా కొడుకు 30 ఏళ్లకు పైగా విధి నిర్వహణలో ఎలాంటి మచ్చ లేని కెరీర్‌ను కలిగి ఉన్నాడు. 15,638గంటలు ఎటువంటి సంఘటనలు చోటుచేసుకుండా విమానయానం చేశాడు. బోయింగ్ 7878 ఎయిర్‌క్రాఫ్ట్‌లో 8,596 గంటలు ప్రయాణించినప్పటికీ ఒక్క లోపం లేదా మరణానికి కారణమైన సంఘటన కూడా నివేదించబడలేదు అని పుష్కరాజ్ సభర్వాల్ గుర్తుచేశారు. అక్టోబరు 10 న ఎపి &జె ఛాంబర్ల ద్వారా దాఖలు చేయబడిన ఈ పిటిషన్‌లో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ డిజిసిఏ మరియు ఎఎఐబిలను ప్రతివాదులుగా చేర్చారు.

## వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే..



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఎటిసి) వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో దాదాపు 350 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందుగా షెడ్యూల్ చేసిన పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. దీని ప్రభావం ఉత్తరాది ఎయిర్ పోర్టులపైన పడింది. అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని రన్‌వేపై విమానాలు పార్కింగ్ చేసేందుకు సరిపడినంత స్థలం లేనందున పలు సర్వీసులు రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు వివరించాయి. అయితే గురువారం సాయంత్రం నుంచే ఎటిసిలో ఈ సమస్య ఉత్పన్నమైందని వెల్లడించాయి. ఇక అందుబాటులో ఉన్న డేటా అధారంగా పలు విమానాల సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపింది. ఆ క్రమంలో చాలా ఆలస్యంగా విమాన సర్వీసుల నడుస్తున్నాయని చెప్పింది. మరోవైపు ముంబయి ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎటిసి వ్యవస్థ కుప్పకూలింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక న్యూఢిల్లీ ఎయిర్ పోర్టు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు ఇక్కడి నుంచి దాదాపు 1,500 విమానాలు రాక పోకలు సాగిస్తాయి. ట్రాకింగ్ వెబ్ సైట్‌లో విమాన సర్వీసు బయలుదేరు సమయం దాదాపు 60 నిమిషాలు ఆలస్యం చూపిస్తోంది. ఈ సాంకేతిక లోపాన్ని పరిష్కరించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి పని చేస్తున్నామని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే దీనిపై ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్, ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థలు తమ ఎక్స్ ఖాతా వేదికగా స్పందించాయి. ఇలా చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు సిబ్బంది సహాయం చేస్తున్నారని వివరించాయి. ఎటిసి వ్యవస్థలో ఏర్పడిన లోపం కారణంగా.. అన్ని విమాన సర్వీసుల రాకపోకలపై ఈ ప్రభావం పడిందని స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ వెల్లడించింది. అదే విధంగా ఎయిర్ ఇండియా సంస్థ సైతం స్పందించింది. ఈ ఊహించని అంతరాయం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. ఎటిసిలో ఏర్పడిన లోపాన్ని పునరుద్ధరించేందుకు టెక్నిషియన్స్ పూర్తి స్థాయిలో పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. కొన్ని గంటల్లోనే సాధారణ పరిస్థితికి తీసుకు వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టులో భారీగా ప్రయాణికుల క్యూ లైన్లు దర్శనమిస్తున్నాయి. పలు విమాన సర్వీసులను రీ షెడ్యూల్‌పై ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు విమాన సర్వీసుల ఆలస్యంపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

# వందేమాతరం ఎప్పుడైనా పాడారా?
## ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యాలయాల్లోనూ వినిపించలేదు: ఖర్గే



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఈ పాట ప్రసిద్ధ నినాదం. అయినప్పటికీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ కార్యాలయాల్లోగానీ, శాఖల్లోగానీ ఏనాడు పాడలేదు. సొంత గ్రంథాల్లోగానీ, సాహిత్యంలోనూ ఈ పాటను పొందుపరచలేదు. అలాంటిది ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ గేయ 150వ స్మారకోత్సవాలు జరుపుతున్నాయని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్ జాతీయ గీతం కంటే నమస్తే సదా వతసలే పాడటానికే ఇష్టపడిందని ఆయన తన ప్రకటనలో ఎత్తిచూపారు. కాంగ్రెస్ పార్టీ 1986 నుండి నేటి వరకు ఏ సమావేశమైనా, ప్లీనరీ అయినా, బ్లాక్‌స్థాయి సమావేశం అయినా నేతలు వందేమాతరం పాట ఆలపిస్తారు. నేడు జాతీయవాద సంరక్షకులమని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, బీజేపీ తమ శాఖల్లోగానీ లేదా కార్యాలయాల్లో గానీ వందేమాతరం లేదా మన జాతీయ గీతం జనగణమనను ఎప్పుడూ పాడకపోవడం విడ్డూరం. వాటికి బదులుగా వారు దేశాన్ని కాకుండా... వారి సంస్థలను కీర్తిస్తూ నమస్తే సదా వత్సల అనే పాట పాడుతున్నారు. 1925లో స్థాపించినప్పటి నుండి ఆర్ఎస్ఎస్ సార్వత్రిక గౌరవం ఉన్నప్పటికీ వందేమాతరాన్ని నిరాకరించింది. ఈ పాటను ఆర్ఎస్ఎస్ స్వీకరించలేదు. ఆర్ఎస్ఎస్ గ్రంథాలలో లేదా సాహిత్యంలో ఒక్కసారి కూడా పాట ప్రస్తావన కనిపించదని ఖర్గే తన ప్రకటనలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ న్యూదిల్లీలో జరిగిన ఈ గేయ 150వ వార్షికోత్సవాలకు హాజరయ్యారు. స్మారక స్టాంపును ఆయన విడుదల చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బీహార్‌లోని పట్నాలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆయన దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారని, ఈ గేయాన్ని పలకడానికి ఇష్టపడని ఈ నాయకులు ఇలాంటి ఉత్సవాల్లో పాల్గొనడం బాధాకరమని ఖర్గే మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆర్ఎస్ఎస్ భారతీయులకు కాకుండా బ్రిటీష్ వారికి మద్దతు ఇచ్చింది. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసింది. 52 సంవత్సరాలు జాతీయ జెండాను ఎగురవేయలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ దిష్టిబొమ్మలు తగలబెట్టిందనే విషయం అందరికీ తెలుసు. సర్దార్ పటేల్ మాట్లో చెప్పాలంటే గాంధీజీ హంతకులు అని ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వందేమాతర గర్వాన్ని మోసేది కాంగ్రెస్సే. 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహమతుల్లా సయాని నాయకత్వంలో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా వందేమాతరం పాటను బహిరంగంగా పాడారు. ఆ క్షణం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ప్రాణం పోసింది. మత, కుల, ప్రాంతీయ గుర్తింపును తారుమారు చేస్తూ బ్రిటీష్ సామ్రాజ్యం విభజించి పాలించే విధానం, భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి రూపొందించబడిందని కాంగ్రెస్ అర్థం చేసుకుంది. దీనికి వ్యతిరేకంగా వందేమాతరం గీతం అచంచలమైన శక్తి గీతంగా మారింది. భారతమాత పట్ల భక్తితో భారతీయులందరినీ ఏకం చేసిందని ఖర్గే గుర్తుచేశారు. 1905 బెంగాల్ విభజన నుండి మన విప్లవకారుల తుది శ్వాస వరకు వందేమాతరం దేశమంతటా ప్రతిధ్వనించింది. ఇది లాలా లజపతిరాయ్ ప్రచురణ శీర్షిక అని, భికాజీ కామా తయారు చేసిన జెండాపై చెక్కబడిందని ఖర్గే పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి గుండె చప్పుడుగా మారిన ఈ పాటను బ్రిటీష్‌వారు నిషేధించారని ఖర్గే అన్నారు. 30 సంవత్సరాలకు పైగా ఈ పాట భారత జాతీయవాదంపై ప్రభావం చూపిందని, ఈ పాట భారత జాతీయవాదానికి సంబంధించిందని, అలాంటి ప్రజల పాటలు ప్రత్యేకంగా రూపొందించబడలేదని 1938లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

## రూ.4 లక్షలు చాలడం లేదు
### 'సుప్రీం'లో షమీ మాజీ భార్య పిటిషన్

**న్యూఢిల్లీ :**నెలనెలా తనకు భరణం, కుమార్తె సంరక్షణ కోసం చెల్లిస్తున్న రూ.4 లక్షలు సరిపోవడం లేదని టీమ్‌ఇండియా స్టార్ బౌలర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని షమీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తనకు, తన కుమార్తెకు కలకత్తా హైకోర్టు మంజూరు చేసిన జీవనోపాధిని పెంచాలని కోరుతూ జహాన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కోసం నెలకు రూ.1.5 లక్షలు, కుమార్తె సంరక్షణ కోసం నెలకు రూ.2.5 లక్షలు షమీ చెల్లించాలని కోల్‌కతా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఆమె సవాలు చేశారు. ఈ మొత్తం తమకు సరిపోవడం లేదని సుప్రీం కోర్టు దష్టికి తీసుకువెళ్లారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం.ఎ4/513/2024 — eGP Portal - Tenders టెండరు ప్రకటన — తేది: 03.11.2025
ఈ దేవస్థానమునకు అవసరమైన క్యాలెండర్లు మరియు డైరీలు ముద్రణ మరియు సరఫరా చేయుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 08.11.2025 మధ్యాహ్నం గం.12:00లకు, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.12:00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.12:30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.3.00లకు,
ఇతర వివరములకు https://tender.telangana.gov.in నందు చూడవచ్చును.
సం/- కె.దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 10357-PP/CL/ADVT/1/2025-26, Date: 07-11-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
NIT No. 31/EE-Div.29/SBZ/GHMC/2025-26 — తేది: 07.11.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, సికింద్రాబాద్, డివిజన్-29 నందు అన్ని వార్డులలో 2025 సంవత్సరానికి నవంబర్-2025 నుండి డిసెంబర్-2025 వరకు వర్షా కాలం తరువాత తుఫాను నీటి కాలువల పూడిక తీయడం. **అంచనా విలువ / ఇసివి :** రూ.33.45లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 10.11.2025న సా.4.00గం.ల నుండి 13.11.2025న సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10372-PP/CL/ADVT/1/2025-26, Date: 07-11-2025



# ప్రపంచం
WORLD NEWS

## రోడ్డెక్కిన గ్రీస్ విద్యార్థులు

40 నగరాల్లో భారీ ర్యాలీలు

విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి డిమాండ్

**ఏథెన్స్:** గ్రీస్‌లో విద్యార్థులు భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి కదం తొక్కారు. అధ్యాపకుల నియామకాలు, వారి క్రమబద్ధీకరణ, మెరుగైన బోధనా పద్ధతులు, వేతనాల్లో పెంపుదల కోసం డిమాండ్ చేశారు. దేశంలోని 40 నగరాల్లో ర్యాలీలు జరిగాయి. లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి మద్దతు ఇచ్చారు. అధ్యక్షుడు తసౌలాస్ ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించారు. విద్యను వ్యాపారంగా మార్చవద్దని, విజ్ఞానాన్ని పెంపొందించే విద్యా సంస్థల్లో సిబ్బంది కొరతను పరిష్కరించాలని, తక్షణమే టీచర్లను భర్తీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యా రంగంలో సంస్కరణలు, బోధనా పద్ధతుల్లో మెరుగుదలను కోరారు. విద్యను ఆధునీకీకరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులు హెచ్చరించారు.

## సమష్టిగా ముందుకు...



వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్లీనంలో టు లామ్ పిలుపు

**హనోయ్:** పార్టీ, ప్రజలు, దేశం ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు టు లామ్ పిలుపునిచ్చారు. రాజధాని హనోయ్‌లో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ 13వ కేంద్ర కమిటీ 14వ ప్లీనం గురువారం మొదలై, శుక్రవారం ముగిసింది. పొలిట్‌బ్యూరో సభ్యుడు ట్యూంగ్ క్యాంగ్ అధ్యక్షతన ప్లీనం జరిగింది. 14వ జాతీయ మహాసభకు సన్నాహాల్లో భాగంగా ఏడాది పాటు చేపట్టిన కార్యకలాపాలపై, పార్టీ, ప్రజలు, సైనికపరంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనపై సభ్యులు చర్చించారు. పార్టీ నిర్మాణం, రాజకీయ వ్యవస్థ నిర్మాణంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. టు లామ్ మాట్లాడుతూ 'సమయం తక్కువ, పని ఎక్కువ. అయినా శక్తిమేరకు పనిచేశాం. అనుకున్న లక్ష్యాల్లో చాలా వాటిని ముందుగానే సాధించుకోగలిగాం' అని అన్నారు. సవాళ్లను అధిగమిస్తూ వ్యూహాత్మకంగా ముందుకెళుతూ దేశ ప్రయోజనాలు, ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించినట్లు తెలిపారు. కమ్యూనిస్టు ఆలోచనలతో ముందుకెళ్లడం ద్వారా పార్టీ, ప్రజలు, దేశ ప్రయోజనాల కోసం శక్తిమేరకు బాధ్యతగా పనిచేస్తున్నట్లు టు లామ్ తెలిపారు. భవిష్యత్తు అభివృద్ధి కోసం పునాది వేసుకోవాలని, లక్ష్యాలు సాధించాలన్నారు. పార్టీ తీర్మానాల అమలును ప్రముఖంగా చర్చించారు. ఐదేళ్ల ముందుగానే లక్ష్యాలు సాధించుకున్నట్లు తెలిపారు.

## వచ్చే ఏడాది భారత్ వస్తా

మోదీ గొప్ప వ్యక్తి... మిత్రుడు

రష్యా చమురు కొనడం ఆపేశారు : ట్రంప్



**వాషింగ్టన్:** 'రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చాలా వరకు ఆపేశారు. ఆ దేశంతో చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయి. కాబట్టి వచ్చే ఏడాది భారత్‌కు వెళ్లాలని ఉంది' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఓవల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య చర్చలలో పురోగతి ఉన్నట్లు తెలిపారు. 'అంతా గొప్పగా సాగుతోంది. ఆయన (మోదీ) రష్యా నుంచి చమురు కొనడం లేదు. ఆయన మంచి మిత్రుడు. గొప్ప వ్యక్తి. మేమిద్దరం తరచూ మాట్లాడుకుంటాం. ఏ విధంగా ముందుకెళ్లాలో నిర్ణయిస్తాం. గతంలో నా భారత్ పర్యటన గొప్పగా సాగింది. మళ్లీ తప్పక వెళతాను' అని ట్రంప్ అన్నారు. 2026లో న్యూఢిల్లీలో జరగబోయే క్వాడ్ సదస్సుకు హాజరు కావచ్చన్న సంకేతాలు ఇచ్చారు. ఈ సదస్సు కోసం ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలకు భారత్ ఆతిథ్యమివ్వనున్నది. అలాగే, సుంకాలు, భారత్ పాక్ మధ్య యుద్ధం ఆపడం గురించి ట్రంప్ మాట్లాడారు. సుంకాలను గొప్ప అస్త్రంగా అభివర్ణించారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీ అమెరికాను గౌరవించాలని, లేకపోతే బాధ్యతల నిర్వహణ కష్టమవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, గ్లోబలిస్టులపై అక్కసు వెళ్లగక్కారు. అధికారంలో ఉన్నంత వరకు అమెరికాను కమ్యూనిస్టు కానివ్వనన్నారు. ఇదిలావుంటే మమ్దానీకి సోషలిస్టులు, కమ్యూనిస్టుల అభినందనలు వెల్లువెత్తాయి. అమెరికాలో ప్రగతిశీల భావజాలం వ్యాప్తిని స్వాగతిస్తున్నట్లు జర్మనీ కమ్యూనిస్టు పార్టీ (ది లెఫ్ట్), కమ్యూనిస్టు పార్టీ యూఎస్‌ఏ వెల్లడించాయి. పెట్టుబడిదారీ వర్గంపై శ్రామిక వర్గం విజయమే తాము కోరేదని తెలిపాయి. మమ్దానీ గెలుపుతో సోషలిస్టు ఉద్యమానికి ఊపు తిరిగొచ్చిందని వ్యాఖ్యానించాయి. అమెరికా అంతటా సోషలిజంపై చర్చ జరుగుతున్నట్లు తెలిపాయి.

## స్వీడెన్ కమ్యూనిస్టు విప్లవానికి 30 ఏళ్లు




**స్టాక్‌హోమ్:** స్వీడెన్ కమ్యూనిస్టు విప్లవానికి 30 ఏళ్లు పూర్తి అయ్యాయి. మూడు దశాబ్దాల కిందట అంటే 1995 నవంబరు 45 తేదీల్లో స్వీడెన్ కమ్యూనిస్టులు నిర్ణయాత్మక ముందడుగు వేశారు. కమ్యూనిస్టు విప్లవాత్మకతను కొనసాగించాలని నిర్ణయించారు. ఆ తేదీల్లోనే స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ పేరును మరోమారు సొంతం చేసుకున్నారు. శ్రామికవర్గం ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తితో సోషలిజం కోసం పోరాటాలతో ఈ పేరు ముడిపడి ఉంది. ప్రస్తుతం జరుపుకునే 30వ వార్షికోత్సవం పార్టీ సంస్థాగత చరిత్రలో కీలక ఘట్టం మాత్రమే కాదు... కమ్యూనిస్టు ఉద్యమంలో దశాబ్దాలు సాగిన అవకాశవాదంపై రాజకీయ విజయానికి గుర్తు. అయితే స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ పేరు ఓ బాధ్యతగా పార్టీ పేర్కొంది. స్వీడెన్‌లో కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పుడూ ఓడిపోలేదని, సవాళ్లను మాత్రమే ఎదుర్కొందని, అంచెలంచెలుగా ఎదిగిందని ఈ వార్షికోత్సవం నొక్కి చెబుతోందని వెల్లడించింది. భవిష్యత్తుపై మరింత విశ్వాసంతో పార్టీ ముందుకెళుతోందని, శ్రామికవర్గానికి అండగా నిలుస్తోందని పేర్కొంది. చారిత్రక పోరాటాలకు భవిష్యత్తు విజయాలకు మధ్య ప్రత్యక్ష సాక్షిగా ఈ పేరును గౌరవిస్తున్నామని స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ వెల్లడించింది.

## మేధాశక్తే ఓ ప్రయోగశాల (3వ పేజీ తరువాయి)

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతాయని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే ఒక ప్రయోగ శాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి అన్ని రంగాల్లో విద్యా ప్రమాణాలు నెలకొల్పాలన్నారు. శాతావాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యారంగం బోర్డు, చాక్ పీస్‌లకే పరిమితం కావద్దని, ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతుందని, డిజిటల్ లర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం. నిరంతర అభ్యాసాలే విజయానికి దోహదం చేస్తాయన్నారు. ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కోరారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరవవద్దని పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనని అన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2008లో ప్రారంభమైన యూనివర్సిటీ 200 ఎకరాల్లో విస్తరించి ఉందని తెలిపారు. 156 పిజి, యుజి కాలేజీలు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నాయని తెలిపారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్, బిజినెస్ మెనేజ్ మెంట్, లా కోర్సులు యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బిజే రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,యూనివర్సిటీ వివిధ విభాగాల అధిపతులు, పలు విద్యా సంస్థల యజమానులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## దశ, దిశ మార్పు (3వ పేజీ తరువాయి)

జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానమిస్తూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోదని, అలాగే బిఆర్ఎస్ అధికారంలోకి రాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందన్నారు. జూబ్లీ హిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర దశ, దిశా మారబోతుందన్నారు. రాష్ట్రంలో ఏ వర్గాలూ సంతోషంగా లేవని, కేవలం రేవంత్ రెడ్డి బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారన్నారు. హైడ్రా పేరుతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో చెప్పిన 11 పెద్ద ప్రాజెక్ట్‌ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లను బ్లాక్‌మెయిల్ చేసి సెటిల్‌మెంట్ చేసుకున్నారని, భట్టి ప్రెస్‌మీట్ పెడితే, సిఎం సెటిల్‌మెంట్ చేసుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. హైడ్రా అందరికీ సమానంగా ఉండాలని, పెద్దల ఇండ్లను కూల్చిన తర్వాత పేదలకు డబుల్ బెడ్‌రూమును కేటాయించి, పునరావాస చర్యలు చేపట్టిన తర్వాత ఎటువంటి అభివృద్ధి చేసినా పర్వాలేదని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జూబ్లీ హిల్స్ ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ లేకపోతే ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అన్యాయమని, ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అరాచకం వల్లనే నాడు పిజెఆర్ చనిపోయారని, నాటి బిఆర్ఎస్ హయంలోనే ఖమ్మంలో 60 అడుగుల ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి పోలీస్ కమాండ్ కంట్రోల్ లో కూర్చొని కమీషన్ల పైన సమీక్ష చేస్తున్నారని ఆరోపించారు.

**ఎన్నికల నుంచి సైడైన బిజెపి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి, కాంగ్రెస్ ఒకటై పనిచేస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బిజెపి సైడ్ అయిందన్నారు. బిజెపికి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం నుంచి తెలంగాణ కు తెచ్చింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిద్ర పోనివ్వబోదని, ఆరు గ్యారెంటీలపై నిలదీస్తున్నామన్నారు. ఓటు చోరీ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ , తెలంగాణలో జరుగుతున్న ఓటు చోరీ గురించి ఎందుకు మాట్లాడరని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్,ఆరోగ్య శ్రీ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 'మీట్ ది ప్రెస్'కు సీనియర్ జర్నలిస్టు దొంతు రమేష్ సమన్వయ కర్తగా వ్యవహారింగా, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ వరికుప్పల వేదికపైన ఆసీనులయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను హరీశ్ రావు సన్మానించారు.

## లోపాయికారి ఒప్పందం
(3వ పేజీ తరువాయి)

చేశారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లో బిజెపికి కనీసం డిపాజిట్ వస్తుందా? అని కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ఈ ఉప ఎన్నికల్లో బిజెపికి కేవలం పది వేల ఓట్ల కంటే ఎక్కువ రాబోవని చెప్పారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బాకీకార్డు పేరుతో బిఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.8లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దివాళ తీయించారని మండిపడ్డారు.

## అగమ్యగోచరం (3వ పేజీ తరువాయి)

కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ మరణం విషయంలో ఆయన తల్లిని మానసిక క్షోభకు గురి చేశారని, కన్న కొడుకు ముఖం కూడా ఆమెకు చూడనియకుండా చేశారనే అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అసలు గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు?, ముందే చనిపోయారని చెబుతున్నారని, మరణ వార్తను ఎవరి కోసం ఆపారన్నారు. గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరగాలని, గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యం స్టేట్ మెంట్లను కూడా రికార్డు చేయాలన్నారు. తన తండ్రిని చూసేందుకు రావొద్దంటూ బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించినట్టుగా స్వయాన గోపీనాథ్ కొడుకే ఆరోపించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మాగంటి గోపీనాథ్ ఆస్తులపైన సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్ కన్నేశారని,ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు వచ్చాయని ఆరోపించారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, కాంగ్రెస్,బిఆర్ఎస్‌లకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పని చేస్తున్నాయన్నారు. తమ సభలకు అనుమతి ఇవ్వడం లేదని, కానీ బిఆర్ఎస్, కాంగ్రెస్‌సభలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ యత్నిస్తోందని, హిందువులంతా తమ సత్తా ఏమిటో కాంగ్రెస్‌కు రుచి చూపాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం దిగజారి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ అంటేనే ముస్లింలు అని చెబుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి మల్క కొమరయ్య, ఎంఎల్ఏ పాయల శంకర్, నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, ఎస్.కుమార్, వేముల అశోక్, జె.సంగప్ప, సోలంకి శ్రీనివాస్, రితేష్ రాథోడ్ పాల్గొన్నారు.

## భారీ ఆపరేషన్
(3వ పేజీ తరువాయి)

వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలో 196 ఎఫ్ఐఆర్ లను నమోదు చేశామని, సైబర్ నేరస్తుల మాయలో పడి సొమ్ము పోగొట్టుకున్న బాధితులకు రూ.62.34 లక్షలను తిరిగి అప్పగించామన్నారు. అలాగే.. నేరస్తులకు చెందిన 61 బ్యాంక్ అకౌంట్లలో రూ.107 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని శ్రీనివాస్ పేర్కొన్నారు.. అరెస్టైన సైబర్ నేరస్తులపై దేశవ్యాప్తంగా 136 కేసులున్నట్లు తెలిపారు. వీటిలో 45 కేసులు తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొన్నారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్ తో రూ.24.17 లక్షలు దోచుకున్న వ్యక్తితో పాటు.. హైదరాబాద్ లో 62 ఏళ్ల వృద్ధుడి వద్ద నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ వ్యక్తి తన మొబైల్ ను పోగొట్టుకోగా ఆ మొబైల్ నుంచీ రూ.1.95 లక్షలను కాజేసిన నేరస్తుల్ని అరెస్ట్ చేశారు. అలాగే ఇన్వెస్ట్మెంట్, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ఫ్రాడ్ ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుల నుంచి 31 మొబైల్స్, 14 చెక్ బుక్స్, 9 డెబిట్ కార్డులు, 2 ల్యాప్ టాప్స్, 3 షెల్ కంపెనీ స్టాంప్స్, 2 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అధికారుల పేరుతో ఉన్న ప్రొఫైల్స్ నుంచి వచ్చే మెసేజులను నమ్మి మోసపోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. అలాగే తెలియని సోషల్ మీడియా పెట్టుబడి గ్రూపుల్లో చేరవద్దని, ఏపీకే ఫైల్స్, ఫిషింగ్ లింక్స్ వంటి వాటిని ఓపెన్ చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబిఐ, ఆర్‌బిఐ, ఇడి, కస్టమ్స్, న్యాయవ్యవస్థ, సైబర్ క్రైమ్ పోలీసులు, నార్కోటిక్స్ బ్యూరో,బిఎస్ఎన్ఎల్, ట్రాయ్ తదితర ఏజెన్సీల నుండి వస్తున్నట్లు చెప్పుకునే బెదిరింపు వీడియో కాల్స్ లేదా సందేశాలు వచ్చినప్పుడు ప్రజలు భయపడవద్దని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్ లు వచ్చినపుడు 1930 హెల్ప్ లైన్ నంబరుకు ఫిర్యాదు చేయాలని అదనపు సిపి శ్రీనివాస్ సూచించారు.

## అండగా నిలబడండి (3వ పేజీ తరువాయి)

అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంఎల్ఎల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, తద్వారా హైదరాబాద్‌కు అదనంగా గోదావరి జలాలను తీసుకొస్తామని, రేడియల్ రోడ్లను, మెట్రోరైల్‌ను విస్తరిస్తామని హామీనిచ్చారు. గోదావరి జలాలు అదనంగా 20 టిఎంసిలు హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారని, హైదరాబాద్ నగరంలో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆనాడు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నాయకులు పి.జనార్దన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డిలను హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లని, ప్రస్తుతం హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కెటిఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అని అంటున్నారని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌లతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ నేత కెటిఆర్‌లపై సిఎం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**బిఆర్ఎస్ ఓటమి.. బిజెపి డిపాజిట్‌లు గల్లంత ఖాయం**

జూబ్లీహిల్స్ ఎన్నికలో బిఆర్ఎస్ ఓటమి ఖాయమని, బిజెపి డిపాజిట్ పోవడం ఖాయమని సిఎం ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. భవిష్యత్ కోసం జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఓటెయ్యాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్ రాకపోతే హిందవులు బిజెపి వెంట లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒప్పుకుంటారా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అందుకు ఈ ఎన్నికను ఒక రిఫరెండంగా బావిస్తారా అని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికపైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికే బాధ లేదని, కానీ కనీసం డిపాజిట్‌నైనా తీసుకురావాలని బండి సంజయ్, అరవింద్ ప్రయత్నిస్తున్నారన్నారు. మాగంటి గోపినాథ్ చావును రాజకీయం చేయదల్చుకోలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోపినాథ్ తల్లి ఆరోపణలు చేశారని, చావుబతుకుల మధ్య ఉంటే కన్నతల్లిని చూడనివ్వలేదని పేపర్లో చూశానని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖరాస్తే విచారణ జరిపిస్తామని తెలిపారు.

**కంటోన్మెంట్‌లో రూ.5 వేల కోట్లతో 'ఎలివేటెడ్ కారిడార్' పనులు ప్రారంభం**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో గత 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న 'కంటోన్మెంట్ నుంచి శామిర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు తాను అనుమతి తీసుకొచ్చానని, రూ. 5వేల కోట్లతో పనులు ప్రారంభించామని సిఎం రేవంత్ చెప్పారు. ఈ రెండు కారిడార్లపైనే ఉత్తర తెలంగాణ మొత్తం ఆధారపడి ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎలివేటెడ్ కారిడార్ అనుమతులకు ప్రయత్నించలేదని విమర్శించారు. అలాగే వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కూడా తామే అనుమతులు తీసుకొచ్చామని, అదనంగా కొత్తగూడెం, రామగుండం విమానాశ్రయాల నిర్మాణానికి కూడా ప్రయత్నిస్తున్నామని సిఎం తెలిపారు.

**విడతల వారీగా ఫీజు బకాయిలు**

ఫీజు రియంబర్స్‌మెంట్ నిదులను విడతల వారిగా విడుదల చేస్తామని, విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే కళాశాలలైనా, వారి వెనకాల ఉన్న రాజకీయ పార్టీలననైనా ఉపేక్షించేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రైవేటు కళాశాలలను అసోసియేషన్‌కు చెందిన ఒకరు తమకు 12 కళాశాలలకు, మరొకరు మహబూబ్‌నగర్ లో ఉన్న కళాశాలకు అనుసంధానంగా హైదరాబాద్‌లో 'ఆఫ్ క్యాంపస్'కు అనుమతి ఇవ్వాని అడిగితే తాము తిరస్కరించామని వెల్లడించారు. అందుకే వారు ఆందోళనకు దిగారని మండిపడ్డారు. బంద్ పేరుతోప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిలు చెల్లించలేదని బంద్ పాటిస్తున్నారని, మరి విద్యార్థుల విలువైన విద్యా సంవత్సరానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కళాశాలలో హాజరు శాతం, ఫేస్ రికోగ్నైజేషన్ , భవనాల పరిస్థితులు, ల్యాబులను పరిశీలించడం తప్పా అని అన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు వెళ్లే కళాశాలలకు తాళాలు వేసుకుని వెళ్తున్నారని, ఇదేం పద్ధతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలు ఎంత మొత్తంలో డోనేషన్లను వసూలు చేస్తున్నారో అందరికీ తెలుసని, తాము వాటినికొంత వరకు నియంత్రించి, చట్టం అమలుచేద్దామంటే బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతారా? అని అన్నారు. చట్టాల గురించి ప్రస్తావిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కూడా ప్రభుత్వం, యాజమాన్యాలు ఇద్దరూ కలిసి ఇక చట్టాన్ని పూర్తిగా అమలు చేద్దామని, వచ్చే విద్యా సంవత్సరం ఇష్టనుసారంగా డొనేషన్లను ఎలా వసూలు చేస్తారో తాను చూస్తానని సిఎం హెచ్చరించారు. ప్రైవేటు కళాశాలల యాజమానాయలు ఒకరిద్దరి మాటలు వినకుండా వాస్తవాలను అర్థం చేసుకోవాలని సూచించారు.

**కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి**

హైదరాబాద్ ఎవరి హయంలో అభివృద్ధి చెందిందో ఆలోచన చేయండని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్రంలో 2004 నుంచి 2014 సంవత్సరాల మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ భాగ్యనగరం ఎక్కువగా అభివృద్ధి చెందిందన్నారు. ఒఆర్ఆర్(ఔటర్ రింగురోడ్డు), శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, హైదరాబాద్ మెట్రో రైలు ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని సిఎం గుర్తుచేశారు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, రూ.60 వేల కోట్లతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే, బిఆర్ఎస్ ప్రభుత్వం 2023లో తమకు (కాంగ్రెస్ ప్రభుత్వానికి) రూ.8లక్షల కోట్ల అప్పులతో అప్పగించారని వివరించారు. నాటి యుపిఎ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని హైదారబాద్‌కు కేటాయించిన ఐటిఐఆర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేసింది ఎవరని ప్రశ్నించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రగతి భవన్, సచివాలయం, కాళేశ్వరం ద్వారా ఎవరికైనా ప్రయోజనం కలిగిందా? అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో చివరికి బాత్ రూమ్‌లకు కూడా బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు పెట్టించారని, ఢిల్లీలో తెలంగాణ భవనానికి కూడా బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు పెట్టించారని తెలిపారు. హైదరాబాద్‌కు వరదలు వచ్చినప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి వరద సాయంగా రూపాయి కూడా తీసుకురాలేదని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

**పదేళ్లలో మెట్రో రైలును పొడిగించారా?**

పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాతబస్తీకి మంజూరైన మెట్రోను కూడా పక్కకు పెట్టారని ఆరోపించారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టి నష్టాలకు కూడా బిఆర్ఎస్ కారణమన్నారు. ఎల్ అండ్ టి కెటిఆర్ దగ్గర కమీషన్‌లు దండుకున్నాడని ఆరోపించారు.

ఎల్ అండ్ టితో కలిసి మెట్రో నిర్వహించే ఒప్పందంతో వస్తేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెప్పిందన్నారు. ఎల్ అండ్ టి మెట్రో విస్తరణ, నిర్వహణకు అంగీకరించలేదని, ఉన్న మెట్రోనే కొనుగోలు చేయమని చెప్పిందన్నారు. రూ.40 వేల కోట్ల విలువైన మెట్రోరైల్ రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని, గతంలో మెట్రోరైల్‌కు ఇచ్చిన భూములు అమ్మకం ద్వారా రూ.15 వేల కోట్లు సమకుర్చుకుంటామని తెలిపారు. ప్రభుత్వంపై భారం పడకుండా మెట్రోను కొనుగోలు చేయడంతో కిషన్ రెడ్డి, కెటిఆర్ అవాక్కయ్యారని రేవంత్ రెడ్డి అన్నారు.

హైడ్రా వ్యవస్థ ద్వారా చెరువులు ఆక్రమణలు గురికాకుండా కాపాడుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కెటిఆర్ ఒక విష పురుగు అని, ఆయనే నగరానికి గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చారని ఆరోపించారు. నగరంలో జరుగుతున్న అత్యాచారాలకు గంజాయి, డ్రగ్సే కారణమన్నారు. కెసిఆర్‌కు సన్నిహితంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులను హరీశ్‌రావు ఒక్కొక్కరి రాజకీయంగా ఎలిమినేట్ చేస్తూ వచ్చారని, కీలక నేతలను చాలా చాకచక్యంగా హరీష్ రావు బయటకు పంపించారని ఆరోపించారు. చివరకు కల్వకుంట్ల కుటుంబాన్ని కూడా విడదీస్తున్నారని, ఇప్పటికే ఒకరిని దూరం చేశారని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## కేన్సర్ సోకిన ఫోర్త్‌స్టేజ్ రోగిలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్యాన్సర్ సోకిన ఫోర్త్ స్టేజ్‌లో రోగిలా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్ చేస్తామంటే ఎలా అని, ఫీజురియాంబర్స్‌మెంట్ ఇవ్వాలా కాకుంటే రేపు వస్తుందని, విద్యార్థుల భవిష్యత్ తిరిగి ఇస్తారా? అని ప్రశ్నించారు. ఆర్.కృష్ణయ్య అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారని, ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతిలో చిట్టా ఇస్తా, ఉన్న ఆర్థిక పరిస్థితిలో దేనికి నిధులు ఆపాలో చెప్పాలన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలకు ముందుగా ఫీజురియాంబర్స్‌మెంట్ విడుదల చేస్తామని సిఎం చెప్పారు. రూ.25 వేల కోట్లకు బ్యాంకుల పునర్ ఒప్పందం చేసుకున్నామని, దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.4 వేల కోట్ల వెసులుబాటు లభించిందన్నారు. ఇదే మాదిరిగా మరో రూ.2 లక్షల కోట్ల అప్పులకు సంబంధించి పునర్ ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇది సఫలమైతే రాష్ట్రానికి ఆర్థికంగా మరింత వెసులుబాటు లభిస్తుందన్నారు. అందుకోసమే ఢిల్లీకి మాటిమాటికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కేంద్రం, ఆర్‌బిఐ చుట్టూ తిరిగుతున్నామని తెలిపారు. కెసిఆర్ చేసిన అప్పులతో కొత్త అప్పులు పుట్టే పరిస్థితి లేదని చెప్పారు. కెసిఆర్ చేసిన అప్పులు కట్టడంతో పాటు ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడంతో సర్దుబాటు కలవడం లేదన్నారు. నిధుల రాబడి పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**ఓట్ చోరీకి అధ్యుడే కెసిఆర్..** ఓట్ చోరికి కెసిఆరే ఆధ్యుడని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమేశ్ కుమార్ జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఉన్నప్పుడు ఓట్ల చేర్చడం, తొలగించడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లు అప్పుడే ఓట్ చోరికి పాల్పడ్డారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంతో సోమేశ్ కుమార్‌ను తప్పించారని సిఎం గుర్తు చేశారు. మాటి మాటికి సిబిఐకి ఇవ్వండి విచారించి, కెసిఆర్, హరీశ్ రావును జైల్లో వేస్తామని చెప్పిన కిషన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు అడ్డుపడుతున్నాడని ప్రశ్నించారు. జస్టిస్ పి.సి.ఘోష్ నివేదిక ప్రాథమిక విచారణ నివేదికను సిబిఐకి ఇచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, విచారణ చేపట్టలేదన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ అంశంలో చార్జిషిట్ తయారు అయ్యాక గవర్నర్ ఆమోదం కోసం పంపించామని, కానీ ఇప్పటి వరకు అనుమతించడం లేదన్నారు. కిషన్ రెడ్డి కెసిఆర్, హరీశ్ రావు, కెటిఆర్‌లను కాపాడుతున్నాడని ఆరోపించారు.

## చర్చలు సఫలం (3వ పేజీ తరువాయి)

రూ. 1,500 కోట్లను చెల్లించాలని కోరాగా, ఇప్పటికే రూ 600 కోట్లు విడుదల చేశామని, మరో రూ 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని, మిగతా రూ 300 కోట్లను కూడా కొద్ది రోజుల్లోనే క్లియర్ చేస్తాం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే ఫీజు రియంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఒక కమిటీ వేయాలని కళాశాలల యాజమాన్యాలు కోరగా, త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీలో అధికారులతో పాటు యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తామని, త్వరితగతిన కమిటీ నివేదిక వచ్చేలా చేస్తామని, ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు..తమ మాటలను మీడియ వక్రీకరించింది.....**

దేవసేనను, సిఎం,డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులపైన తాము ఎటువంటి వ్యాఖ్యానాలు చేయలేదని, మీడియా సమావేశంలో ఒకటి మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు తమ మాటలను వక్రీకరించాయని ' పాతి' సంఘం అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్ అన్నారు. తమ మాటలను వక్రీకరిస్తూ మీడియాలో వచ్చిన ప్రకటనల పట్ల తమ సంఘం తరపున ఖండించామని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన కళాశాలలు సమ్మెకు వెళ్లడంతో కొన్ని పరీక్షలను, నిర్వహించలేకపోయినందుకు చింతిస్తున్నామని వివరించారు. ఇప్పటికే నిలిచిపోయిన పరీక్షలను రాసేందుకు మరోసారి అవకాశం కల్పించాలని యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి త్వరితగతిన ఏర్పాట్లు చేస్తామని నిమ్మటూరి రమేష్ వివరించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, లెక్చరర్ల ప్రదర్శనను రద్దు చేసుకుంటున్నామని ప్రకటించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో లెక్చరర్ల ప్రదర్శన తప్పు అని కోర్టు చెప్పిందని, నిరసన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నట్టు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సంఘం పాతి ప్రకటించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 'నేడు' సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సి.రాఘవాచారి 6వ స్మారకోపన్యాసం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అక్షరశస్త్రధారి సి.రాఘవాచారి 6వ స్మారకోపన్యాసం శనివారం (నవంబరు 8) సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరుగనుంది. 'ప్రసార మాధ్యమాలున్యాయవ్యవస్థ' అనే అంశంపై నిర్వహించనున్న స్మారకోపన్యాసానికి భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి వక్తగా హాజరుకానున్నారని విజయవాడకు చెందిన సి.రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగనున్నదని ట్రస్ట్ పేర్కొంది. ఉదయం 10గంటలకు జరుగనున్న సి.రాఘవాచారి స్మారకోపన్యాస కార్యక్రమానికి ఆయన అభిమానులు, జర్నలిస్టులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాలని ట్రస్ట్ నిర్వాహకులు కోరారు.

## ఢిల్లీకి చేరుకున్న మయన్మార్ సైబర్ ఫ్రాడ్ బాధిత తెలంగాణ వాసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మయన్మార్ మయవాడీలోని సైబర్ నేరాల శిబిరాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు శుక్రవారం స్వదేశానికి తిరిగి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరికి ప్రభుత్వం అండగా నిలిచింది. గురువారం రాత్రి ప్రత్యేక భారత వైమానిక దళం విమానంలో భారతీయ పౌరులను మయన్మార్ నుంచి తీసుకొచ్చారు. వీరిని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులు.. గ్రేటర్ నోయిడాలో సంబంధిత రాష్ట్ర అధికారులకు అధికారికంగా అప్పగించారు. వారిలో 11 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారున్నారు.హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి పలు జిల్లాలకు చెందిన వారు ఈ బృందంలో వున్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన వీరిని సంబందిత కేంద్ర ప్రభుత్వ అధికారులు తగిన విచారణ ధృవీకరణ అనంతరం తెలంగాణకు చెందిన వారిని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులకు అప్పగించారు.వీరికి తెలంగాణ ప్రభుత్వ అధికారులు వెంటనే తాత్కాలిక వసతి అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. వారు రాత్రికి హైదరాబాద్ వెళ్లడానికి ప్రయాణ ఏర్పాట్లు చేశారు.



## సత్తా చాటిని ఎస్.ఆర్ డిజి స్కూల్ విద్యార్థినులు

**హైదరాబాద్ :** హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర లో పాఠశాల విద్యార్థులకు పలు రంగాల్లో పోటీలు నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు పాఠశాలల నుండి విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బోడుప్పల్‌లోని ఎస్.ఆర్ డిజి స్కూల్ విద్యార్థినులు గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. స్కూల్ డ్యాన్స్ మాస్టర్ మహేశ్ నేతృత్వంలో విద్యార్థినులు ఈ పోటీల్లో ప్రధన బహుమతిని కైవసం చేసుకున్నారు. తమ పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతిని సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ బి.ఎన్.ఎల్. శిరీష హర్షం వ్యక్తం చేశారు. తాము విద్యర్థులకు చదువుతో పాటుగా సాంస్కృతిక రంగాల్లోనూ ప్రోత్సహిస్తామని ఆమె అన్నారు.

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రజాప్రభుత్వం దోహదం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** మత్స్యకారుల ఆ ర్థికాభివృద్ధి ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చే స్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూ ర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవా రం స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్, మల్లన్న గండి చెరువులో చేపల ఉత్పత్తిని పెంచేందుకు చేప పిల్ల ల పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ స్వ యంగా చేప పిల్లలను రిజర్వాయర్‌లోకి వదిలా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రా ష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చే స్తూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా ఏటా సు మారు 400 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుం ది. దాదాపు రూ. 4 కోట్ల విలువైన చేపలు మార్కెట్‌లోకి వస్తున్నాయన్నారు. మత్స్యకారుల ఆదా యం పెరగడం కోసం చేపలను పెంచడంతోపా టు మార్కెటింగ్ సదుపాయం, రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారులకు సూచించారు.

# 'చెత్త' సంక్షోభంలో హైదరాబాద్

జవహర్‌నగర్‌లో చెత్త వేయొద్దన్న ఎన్‌జిటి

చెత్త డంపింగ్‌కు లేని ప్రత్యామ్నాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మహానగరం 'చెత్త' సంక్షోభంలో చిక్కుకుంది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్తను వేయవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జిటి) ఆదేశించింది. అయితే నగరంలో చెత్త డంపింగ్‌కు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దీంతో చెత్త తరలింపుపై జిహెచ్‌ఎంసి అధికారులు ఆమోమాయంలో పడ్డారు. దశబ్దాలుగా జవహర్ నగర్ డంపింగ్‌యార్డ్‌లో చెత్త వేయడంలో దాదాపు పరిసర 30 గ్రామాలు కాలుష్యపు కోరల్లో చేక్కుకున్న విషయం తెల్సిందే. ఈ అంశంపై పలువురు ఎన్‌జిటిని ఆశ్రయించారు. జవహర్‌నగర్‌లోని వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రంలో తాజా చెత్తను వేయొద్దంటూ ఎన్‌జిటి మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈనెల 11న జరిగే తుది విచారణ వరకు చెత్త సేకరణ సమస్య జిహెచ్‌ఎంసికి సంకటంగా మారింది. ఈ ఆదేశాల నేపథ్యంలో నగరంలో వచ్చే నాలుగు రోజుల పాటు చెత్త సేకరణ వ్యవస్థ పూర్తిగా స్తంభించే అవకాశం ఉంది. జవహర్ నగర్ డంపింగ్‌యార్డు వల్ల ఏర్పడుతున్న కాలుష్యం, పాత వ్యర్థాల (లెగసీ వెస్ట్) నిల్వ, లీచేట్ ద్వారా పర్యావరణానికి కలుగుతున్న నష్టం అంశాలపై దాఖలైన పిటిషన్ను ఎన్‌జిటి ఇటీవల విచారించింది. అక్టోబర్ 28న విచారణ జరిగినప్పటికీ, ఉత్తర్వులు నవంబర్ 6న జిహెచ్‌ఎంసికి అందాయి. ఎన్‌జిటి తాత్కాలిక ఆదేశాల ప్రకారం, ఐఐటి ముంబాయ్ పర్యవేక్షణలో పాత వ్యర్థాల నిర్మూలనపై నివేదిక వచ్చే వరకు కొత్త చెత్తను జవహర్ నగర్‌కు తరలించరాదు. ఇప్పటికే ఉన్న చెత్తను ప్రాసెస్ చేయడానికి మాత్రం అనుమతి ఇచ్చింది. జవహర్ నగర్ చెత్త డంపింగ్‌యార్డ్‌కు ప్రతి రోజుకు 9,684 మెట్రిక్ టన్నుల చెత్తను తరలిస్తున్నారు. అందులో జిహెచ్‌ఎంసి పరిధి నుంచే 8,500 టన్నుల వ్యర్థాలు వస్తాయి. మిగిలిన 1,1001,200 టన్నులు పరిసర 14 మున్సిపాలిటిలకు వస్తాయి. 2018లో ఎన్‌జిటి ప్రధాన బెంచ్ జిహెచ్‌ఎంసికి 12 మిలియన్ టన్నుల పాత చెత్తను బయోమైనింగ్ ద్వారా తొలగించాలని ఆదేశించింది. అయితే టెండర్లు పిలిచినా స్పందన రాకపోవడంతో ప్రాజెక్టు నిలిచిపోయింది. ఇక జిహెచ్‌ఎంసి నియమించిన సాంకేతిక నిపుణులు ఐఐటి ముంబాయ్, బయోమైనింగ్ ప్రక్రియ ఆరోగ్యపరమైన ముప్పులు కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. తాజా పరిణామాల నేపథ్యంలో, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి), జిహెచ్‌ఎంసి, ఐఐటి ముంబాయ్, పర్యావరణ నిపుణులతో సమావేశం ఏర్పాటు చేసి, పాత తాజా చెత్తను నిర్వహించేందుకు తగిన మార్గం కనుగొనాలని నిర్ణయించింది. ఐఐటి ముంబాయ్ బృందం ప్రాంగణ పరిశీలన అనంతరం సమగ్ర నివేదిక సమర్పించనుంది. ఎన్‌జిటి తాజా ఆదేశాల కారణంగా, నగరంలో సుమారు 38,000 టన్నుల చెత్త సేకరించకపోవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో తాత్కాలికంగా చెత్త నిల్వ చేసే స్థలాలేమీ లేకపోవడంతో చెత్త తరలింపు పెద్ద సంక్షోభంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపాలిటీలు బహిరంగ ప్రదేశాలలో చెత్తను తాత్కాలికంగా నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. కానీ జిహెచ్‌ఎంసికి అలాంటి అవకాశమే లేకుండా పోయింది. నగరంలో చెత్త వేసేందుకు ఎక్కడ అవకాశమే లేదని అధికారులు అంటున్నారు. ఇక పిటిషనర్లు మాత్రం ఎన్‌జిటి తీర్పును స్వాగతిస్తూ, ఇది చారిత్రాత్మక నిర్ణయమని హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న కాలుష్య భయానికి ఇది మొదటి అడుగు అని అన్నారు. ఈ పరిణామాలతో హైదరాబాద్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.



### కౌంటింగ్ నిర్వహణపై
## ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి ఈనెల 14వ తేదీన నిర్వహించే ఎన్నికల కౌంటింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని జిహెచ్‌ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉప ఎన్నిక కౌంటింగ్ సూపర్ వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహణ నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను వివరించారు. కౌంటింగ్ సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కు సంబంధించి ఈనెల 14వ తేదీన నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తారన్నారు. కౌంటింగ్‌లో నియమ, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళిపై రూపొందించిన మాన్యువల్‌పై పూర్తి అవగాహనను చేసుకోవాలన్నారు. పగడ్బందీగా పోస్టల్ బ్యాలెట్, ఈవిఎంల లోని ఓట్ల లెక్కింపు జరపాలన్నారు. ఈ నెల 13వ తేదీన కౌంటింగ్ సిబ్బందికి మరోవిడత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల మాస్టర్ ట్రైనర్‌లు కౌంటింగ్ విధానం, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల బాధ్యులు సునంద, మమత పాల్గొన్నారు.

## ఐఆర్‌సి వార్షిక సదస్సు హైదరాబాద్‌లో నిర్వహణకు కేంద్రం ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సి) 85వ వార్షిక సదస్సును వచ్చే ఏడాది (2026) హైదరాబాద్‌లో నిర్వహించడానికి కేంద్రం ఆమోదించింది. 85వ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ఇందుకు అవకావం కల్పించాలని ఆ లేఖలోపేర్కొన్నారు. దీనిపైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై భువనేశ్వర్‌లో మంత్రి నితిన్‌గడ్కర్ ప్రకటించారు.సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులకు ప్రయోజనం చేకూరనుందని వెంకట్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో అవకాశం కల్పించినందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ,కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పలు ప్రాంతాల్లో విజిలెన్స్ ఆకస్మిక దాడులు

రూ.10.11 కోట్ల పిడిఎస్ బియ్యం పట్టివేత -13 వాహనాల సీజ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వరంగల్, కరీంనగర్,నల్గొండ జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.10.11 కోట్ల విలువైన రూ.41 లక్షల క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు నిబంధనలను ఉల్లంఘించి రహదారులపై తిరుగుతున్న 13 వాహనాలను సీజ్ చేసి రూ.3 లక్షల జరిమానా విధించారు.

**వరంగల్‌లో..**

వరంగల్ యూనిట్‌కు చెందిన రెండు బృందాలు, సివిల్ సప్లైస్ అధికారులతో కలిసి హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలం, కనిపర్తి గ్రామంలో ఉన్న శ్రీశైలం మల్లన్న ఇండస్ట్రీ రైస్‌బిల్లును తనిఖీ చేశారు. తనిఖీలో దాదాపు రూ. 9,34,93,25 విలువైన 40,649.24 క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యం స్వాధీనం చేసుకున్నారు.

**కరీంనగర్‌లో..**

రేకుర్తిలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విశ్వసనీయ సమాచారం అందిన వెంటనే, కరీంనగర్ యూనిట్ అధికారులు విజయ దుర్గ కాలనీ, రేకుర్తి డివిజన్లో ఉన్న పాస్తం కరుణాకర్‌కు చెందిన టిన్ షెడ్‌పై ఆకస్మిక దాడి నిర్వహించారు. తనిఖీలో రూ. 77,325 విలువైన 30.93 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం దొరికాయి.

**రూట్ చెక్‌లో13 వాహనాలు సీజ్..**

రవాణా, వాణిజ్య పన్నులు మరియు మైనింగ్ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ టోల్ గేట్ వద్ద తెల్లవారుజామున రూట్ చెక్ నిర్వహించారు. మొత్తం 13 వాహనాలను సీజ్ చేసి, చెల్లుబాటు అయ్యే ఇవే బిల్లు లేకపోవడం, పన్ను చెల్లించకపోవడం, ఓవర్‌లోడింగ్ మరియు చెల్లని పర్మిట్‌లు వంటి కారణాల వల్ల రూ. 3,01,300 జరిమానా విధించారు.

**టోల్‌ఫ్రీ నెంబర్ 14432..**

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న..ప్రభుత్వ నిధులు, సహజ వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం కట్టుబడి ఉంది. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగం లేదా ఏవైనా అవకతవకలకు సంబంధించి ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 14432 కు సమాచారం పంచుకోవాలని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేయబడింది.

## చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు కలెక్టర్ సూచన



**ప్రజాపక్షం/ములుగు:**బాగా చదువుకోవడంతో పాటు సాంకేతిక ప రిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థా నాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విద్యార్థినిల కు సూచించారు. శుక్రవారం ములుగు మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాలలో బిఇఎల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ క్రింద జిల్లాలోని 9 ఆశ్రమ పాఠశాలలు చిన్నబోయినపల్లి, కర్లపల్లి, లక్ష్మీ నగరం, ఏకె ఘనపూర్, జ గ్గన్నపేట, మేడారం, తాడ్వాయి, చిరుత పల్లి1, ఊరట్టం, కెజిబి కన్నాయిగూడెం పాఠశాలలకు డిజిటల్ క్లాస్ రూమ్ పరికరాలను సంస్థ తరుపున జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమక్షంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ కె శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమం ములుగు జిల్లాలో చేపట్టడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇంత మారుమూల ప్రాంతాలను ఎంచుకొని మా గిరిజన విద్యార్థిని విద్యార్థులకు పరికరాలను అందించడం ద్వారా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు ఎంతగాను ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఎంచుకున్న భాషపై డిజిటల్ విషయ పరిజ్ఞానం తెలుసుకొనుటకు, నేర్చుకొనుటకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా బిఈఎల్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ మా సంస్థ తరుపు న అందించే డిజిటల్ క్లాస్ రూమ్ పరికరాల వలన విద్యార్థులు భాష నైపుణ్యాల అవగాహన ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

'వందేమాతరం'లోని చరణాల తొలగింపు...

# విభజనకు బీజాలు నాటింది

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల దాడి

వందేమాతరం స్మారక కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని



**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాంగ్రెస్ పార్టీపై మరోసారి విమర్శల దాడికి దిగారు. జాతీయ గేయం వందేమాతరంలోని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించారని, ఇది విభజనకు బీజాలు నాటిందని, అటువంటి విభజన మనస్తత్వం ఇప్పటికీ దేశానికి ఒక సవాల్‌గా ఉన్నదని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. జాతీయగీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏడాది పొడవునా జరుగనున్న వందేమాతరం స్మారక కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో స్మారక స్టాంపు, నాణేన్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేశారు.వందేమాతరం భారత స్వాతంత్ర్య సమర యోధుల గొంతుకగా మారింది. అది ప్రతీ భారతీయుడి భావాలను వ్యక్తపరిచింది. దురదృష్టవశాత్తు వందేమాతరంలోని ముఖ్యమైన చరణాలు దాని ఆత్మలో ఒక భాగమైనదీ వేరు చేయబడింది. వందేమాతరాన్ని వేరుచేయడం కూడా విభనకు బీజాలు వేసింది. జాతి నిర్మాణం కోసం ఉపకరించే ఈ 'మహా మంత్రాన్ని' విభజించడం ద్వారా అన్యాయం ఎందుకు జరిగిందన్న విషయాన్ని నేటి తరాలు తప్పకుండా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి మోదీ సూచించారు. వందేమాతరం అనేది ప్రతీ యుగానికీ సంబంధించి ఎంతో అవసరమైనదని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు.మన భద్రత మీద, మన గౌరవం మీద ఉగ్రవాదం దాడిచేసినప్పుడు ఆపరేషన్‌సిందూర్ భారతదేశం దుర్గమాత విశ్వరూపాన్ని ఎలా సంతరించుకుందో యావత్ ప్రపంచం చూసిందన్నారు. వందేమాతరం కేవలం ఒక గానం మాత్రమే కాదని, ఇది లక్షలాది మంది భారతీయులకు స్వేచ్ఛ అంటే ఏమిటి అనే ఒక దార్శనికతను అందించిందని తెలిపారు. సుజలాం, సుఫలాం అనేది ఒక భారత్ కల అని మోదీ అన్నారు. అంతకు ముందు రోజు బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు గుప్పించింది. కాంగ్రెస్ పార్టీ జవహర్‌లాల్ అధ్యక్షతన తన మతపరమైన ఎజెండాకు ధైర్యంగా తోడ్పడిందన్నారు. 1937లో జాతీయ గేయంగా కుదించబడిన వందేమాతరాన్ని మాత్రమే స్వీకరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక పాపం చేసింది. అంతేగాకుండా ఆ పాటను మతంతో ముడిపెట్టడం ద్వారా తప్పు చేసింది. నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్‌పార్టీ మతపరమైన కారణాలను ఉటంకిస్తూ దుర్గామాతను ప్రశంసిస్తూ వందేమాతరంలోని చరణాలను ఉద్దేశపూర్వకంగా తొలగించింది' అని బిజెపి అధికార ప్రతినిధి సి.ఆర్.కేశవన్ 'ఎక్స్'లో పెట్టిన ఒక పోస్ట్‌లో ధ్వజమెత్తారు. గత 150ఏళ్లుగా దేశం వందేమాతరాన్ని స్మరిస్తోంది.ఇది మన ప్రజలందరిలోనూ నూతన స్ఫూర్తిని రగుల్కొల్పుతూ, కొత్త శక్తిని నింపుతోందని ప్రధానమంత్రి చెప్పారు.వందేమాతరంలోని మొదటి పంక్తి ఈ తప్పుడు ప్రచారాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మోదీ అన్నారు. దేశం అంటే తల్లిలాంటిదని, శక్తికి దైవిక స్వరూపమని భావించబడం వల్లే పురుషులు, మహిళలు ఇద్దరినీ సమానంగా చేర్చుకోవాలనే సంకల్పంతో స్వాతంత్ర్యం వచ్చిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ దార్శనికత భారతదేశానికి మరోసారి దేశనిర్మాణానికి మహిళా శక్తి ముందంజలో ఉండేలా కలలు కనేలా చేసిందని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

## ఎన్‌ఐటి వరంగల్‌లో రూ.1.27కోట్ల అత్యధిక ప్యాకేజీ

**ప్రజాపక్షం/కాజీపేట :** ఎన్‌ఐటి వరంగల్‌లో ఈ ఏడాది ఒక విద్యార్థికి అత్యధిక ప్యాకేజీ రూ. 1.27 కోట్లు వచ్చింది. ప్లేస్‌మెంట్ సీజన్ ప్రారంభ దశలోనే వచ్చిన అద్భుత ఫలితాలు, సంస బలమైన విద్యా పునాది, పరిశ్రమలతో ఉన్న సన్నిహిత బంధాలను విద్యార్థుల అసాధారణ ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయి.ఈ కొత్త రికార్డు ఎన్‌ఐటి వరంగల్ చరిత్రలో అత్యధిక దేశీయ ఆఫర్ రూ. 1.27 కోట్లు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బి.టెక్ విద్యార్థి నారాయణ త్యాగి బహుళజాతి కంపెనీ నుండి రూ. 1.27 కోట్ల సిటిసితో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఇది ఎన్‌ఐటి వరంగల్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ప్యాకేజీ. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి మొహమ్మద్ నహిల్ నష్వాన్ రూ. 1.0 కోటి సిటిసితో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఈ ఘనతలు ఎన్‌ఐటి వరంగల్‌ను దేశంలోని అగ్రశ్రేణి ఇంజనీరింగ్ విద్యాసంస్థలలో ఒకటిగా నిలబెట్టాయి. అం తర్జాతీయ ప్రమాణాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు మరోసారి నిరూపించాయి. 2025–26 ప్లేస్‌మెంట్ డ్రైవ్ ప్రారంభ రెండు నెలల వ్యవధిలోనే, విభిన్న శాఖల విద్యార్థులు అత్యుత్తమ అవకాశాలను సాధించారు. ఇప్పటివరకు ప్లేస్‌మెంట్ సీజన్ తొలి రెండు నెలల్లో రూ. 70 లక్షలకు పైగా సిటిసితో 6 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.రూ.50 లక్షలకు పైగా సిటిసితో 34 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.రూ.30 లక్షలకు పైగా సీటీసీతో 125 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.,రాబోయే నెలల్లో మరిన్ని అధిక విలువ గల ఆఫర్లు వచ్చే అవకాశముందని ఎన్‌ఐటి వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. విద్యార్థులందరికీ,అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

# నకిలీ దందా.. కల్తీ కల్లోలం

ఏది అసలో.. ఏదీ నకిలీనో

బోధపడక ప్రజలు ఇబ్బందులు

ఆహార పదార్థాల కల్తీతో అనారోగ్యాలు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్కెట్‌లోకి అసలు వచ్చిన కొన్ని గంటల్లోనే నకిలీ పుట్టుకొస్తుంది. ఇది నిత్యం వా డుకునే వస్తువుల దగ్గర నుంచి బట్టలు, సాంకేతిక పరికరాలు సహా అన్నింటికి ఈ నకిలీలు తయారవుతున్నా యి. ఈ నకిలీల కారణంగా అసలు ఏదో నకిలీ ఏదో అర్థం కాక వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నా రు. బ్రాండెడ్ ఉత్పత్తులకు సైతం చిన్న అక్షరాల తేడాతో నకిలీలు తయారవుతున్నాయి. నకిలీలను సైతం అసలు ధర కంటే ఒక రూపాయి ఎక్కువే విక్రయిస్తుండటం శోచనీయం. ఈ వస్తువుకు నకిలీ ఉంది. ఈ వస్తువుకు లే దు అనేది లేకుండాపోయింది. దైనందిన జీవితం ప్రా రంభమయ్యే పేస్టు దగ్గర నుంచి మొదలుకుని ప్రతి దానికి ఒక నకిలీ పుట్టుకొచ్చింది. సబ్బులు, తల నూనెలు మొదలుకుని అన్ని వస్తువుల్లో నకిలీలు దర్శనమిస్తున్నాయి. అన్నింటి కంటే ప్రమాదకరంగా ఆహార పదార్థాలకు నకిలీ ఉత్పత్తులను సృష్టించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ అనారోగ్యాలకు గురైన వారు వాడుతున్న మందుల్లో పెద్ద ఎత్తున నకిలీలు తయారవుతున్నాయి. చాలా మందుల దుకాణాల్లో వినియోగదారులకు ఈ నకిలీలను అంటగడుతున్నారు. అసలు ఖరీదులో పదవ వంతుకే కొందరు నకిలీ మందులను దుకాణాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ డూప్లికేట్ వ్యవస్థను ని యంత్రించడానికి తగిన యంత్రాంగం లేదు. విత్తనాలు, పురుగుమందులు నకిలీలు వినియోగంలోకి రావడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో పాటు ఉత్పత్తి రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. నగదుకు నకిలీ నోట్లు వచ్చాయి. బంగారం నకిలీది వినియోగదారులకు అంటగడుతున్నారు. నోట్ల నకిలీ కారణంగా నష్టపోతున్న వారి సంఖ్య రోజు రోజు కు పెరుగుతుంది. ఇవాళ అత్యంత ఖరీదైనదిగా చెబుతున్న బంగారానికి కూడా నకిలీది మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. హాల్ మార్క్ అంటూనే నకిలీది అంటగడుతుండటం శోచనీయం. మద్యం ప్రియులు సేవించే మద్యంలోనూ నకిలీ మద్యం మార్కెట్‌లో విచ్చలవిడిగా చెలామణి అవుతుంది. నకిలీ ధృవపత్రాల సృష్టి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నకిలీ ధృవపత్రాలతో ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు దొరికి పోతున్నారు.



అన్నింటికి మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా మందికి ప్రధాన వృత్తిగా మారడం, అతి పెద్ద ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉండడంతో అసలు భూ ఆధార ధృవ పత్రాలకు నకిలీలు పుట్టుకొస్తున్నాయి. అసలు యజమానులు నకిలీ ధృవపత్రాల సృష్టి కారణంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. విద్యార్థులను ముఖ్యంగా శిక్షణ కేంద్రాల్లో మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పుడు నకిలీకి ఈ వస్తువు ఉంది దీనికి లేదనేది లేకుండా అన్నింటికి నకిలీలు పుట్టుకొస్తున్నాయి. ఇక కల్తీలు ప్రతి దానిలోనూ కల్తీలే. కళాయిలో నూనె పోసి కమ్మని పదార్థాలు తయారు చేసుకుందామన్న ఆలోచన ఉండగానే బుస్సున పొంగి వంటగది పొగమయం అవుతుంది. చూస్తే నూనె ప్యాకెట్‌పై బ్రాండ్ నేమ్ అలాగే ఉంటుంది. ఇటీవల కాలంలో నూనెల కల్తీలు ముఖ్యంగా ద్రవ పదార్థాల్లో కల్తీలు తారాస్థాయికి చేరాయి. ఆహార పదార్థాలు కల్తీలు జరుగుతుండడంతో ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. ప్రజలకు కలిగే అనారోగ్యానికి సంబంధించి ఎక్కువ భాగం ఆహార పదార్థాల ద్వారానే జరుగుతుందని వైద్యులే ప్రకటిస్తున్నారు.

# మద్యం మత్తులో భార్యను కొట్టి చంపిన భర్త

**ప్రజాపక్షం/మోతె :** భార్యను మద్యం మత్తులో భర్త కొట్టి చంపిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని విభళాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ బందెల్లి రోజువారీగా సుతారి పనులు చేసుకుంటూ తాగుడుకు బానిసై తరుచుగా భార్యతో ఘర్షణ పడుతుండే వాడని తాగుడుకు డబ్బులు లేని సమయంలో భార్య షేక్ కరీంబి (45)ని కొట్టేవాడని తెలిపారు. రాత్రి సమయంలో ఘర్షణ పెద్దది కావడంతో విచక్షణ రహితంగా కట్టేతో బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



# సయ్యద్ మరణం సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/నాంపల్లి:** తిరుమలగిరి సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి షేక్ సయ్యద్ గుండెపోటు తో శుక్రవారం మృతి చెందారు. అయన మృతదేహానికి మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్ ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతియ తెలియజేశారు.సయ్యద్ అకాల మరణం పార్టీకి,ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు.పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నిరంతరం కష్టపడి పని చేసే వారిని గుర్తు చేశారు.ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు.నివాళులర్పించిన వారిలోమహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ,మండల సహాయ కార్యదర్శి నేతల రాజు,నాయకులు గిరిస్వామి,వెంకటాచారి,దశరథ,సత్తయ్య,సైదులు పాల్గొన్నారు.





# వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్ బి సి కాలనీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.శుక్రవారం ఆమె యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులు,విద్యార్థులు ఉండేందుకు డార్మెట్రీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ తో సహా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఇందుకు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని,అలాగే పనులు నాణ్యతతో ఉండాలని చెప్పారు.ప్రతి నెల పనులను పర్యవేక్షించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్.శ్రీనివాస్‌ను ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్,కాంట్రాక్టర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# పల్లా కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/దేవరకొండ :** అమరజీవి కామ్రేడ్ పల్లా కిష్టారెడ్డి కమ్యూనిస్టు పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం అని, కడవరకు ప్రజల పక్షాన కిష్టారెడ్డి పోరాడారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో కామ్రేడ్ పల్లా కిష్టారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా కిష్టారెడ్డి స్మారక స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ పల్లా కిష్టారెడ్డి 1959 నుండి 1982 వరకు పడమటిపల్లి ఏకగ్రీవ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారని, పడమటిపల్లి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతల్లో ఒకరిగా కిష్టారెడ్డి మాజీ గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, శాఖ కార్యదర్శి పల్లా రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యాదయ్య, రాంరెడ్డి, నాయకులు భూ పాల్‌రెడ్డి, మాధవరెడ్డి, శాఖ సహాయ కార్యదర్శులు గోవర్ధన్, నర్సింహా, సభ్యులు జంగయ్య, కృష్ణ య్య, లాలమ్మ, అంజమ్మ, భారీములు, పెద్దజంగయ్య, రాజు, సంజీవ, వెంకట్‌రెడ్డి, ధర్మ, రామ చంద్రారెడ్డి, బలరాం, కృష్ణయ్య, లక్ష్మయ్య, మహేష్, మున్నీ, భాగ్యమ్మ, ఉస్మాన్ పాల్గొన్నారు.

# సాగర్‌కు కొనసాగుతున్న వరద

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగుల గరిష్ట మట్టాన్ని చేరుకోవడం రిజర్వాయర్‌కు 67674క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చిచేరుతూ ఉండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం రెండు గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 16200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న నాటినుండి ఇప్పటివరకు ఏ రోజు సెప్టెంబరు వరకు వరద కొనసాగి నీటి విడుదల కొనసాగిన దాఖలాలు లేవని ప్రాజెక్టు మొదటి తరం పదవి విరమణ ఉద్యోగులు తమ అభిప్రాయాన్ని తెలిపారు. కుడి కాలవ ద్వారా 10000 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 5367 వేల క్యూసెక్కులు ఎస్ ఎల్ బి సి ఏ ఎంఆర్పి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 34307 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది.

# ధాన్యం కొనుగోలులో కోత విధించొద్దు

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు.శుక్రవారం అయన తిప్పర్తి మండలం కేశరాజు పల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు.17 తేమతో,తాలు,తరుగు లాంటివి లేకుండా నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,జాప్యం చేయవద్దని,వర్షం వచ్చినట్లయితే ధాన్యం తడిసిపోయేందుకు అవకాశం ఉంటుందని ,అందువల్ల ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ఆయన ఇదే మండలం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న వెంకటేశ్వర రైస్ మిల్లు ను తనిఖీ చేసి మిల్లులో ఖరీఫ్ ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ పరిశీలించారు. ఎలాంటి జాప్యం లేకుండా మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలని,ఇందుకుగాను అవసరమైన హమాలీలు, స్థలాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని, తరుగు, తాలు పేరిట, తూకం పేరిట రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం లో కోత విధించవద్దని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ ఎస్ఎల్బీసీ వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ తదితరులు ఉన్నారు.



# వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరగలేదు

ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్టు విద్యార్థుల నుండి జిల్లా యంత్రాంగానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అయినప్పటికీ ఈ విషయంపై జిల్లా యంత్రాంగం విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు.తమ చర్చల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకమైన వాతావరణంలోనే మెలిగినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై జిల్లా కలెక్టర్ శుక్రవారం స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ,ఆర్‌డిఓ అశోక్ రెడ్డిలతో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు.వైద్య కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ,హెచ్ఓడి లు,అధ్యాపక బృందం,విద్యార్థి సంఘాల నాయకులు, మెంటర్లు, విద్యార్థులతో ఆమె విడివిడిగా చర్చించారు.మీడియాలో వచ్చిన వార్తల దృష్ట్యా నిజంగా వైద్య కళాశాలలో జరిగిన సంఘటనలను వివరించాలని ఆమె విద్యార్థులను అడిగారు. తమను ఎవరు ర్యాగింగ్ చేయలేదని, స్నేహపూర్వక వాతావరణంలోనే తాము ఉన్నామని విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ర్యాగింగ్ అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటున్నదని, ఎవరైతే ర్యాగింగ్‌కు పాల్పడతారో వారు చట్టరీత్యా తప్పు చేసిన వారవుతారని,అలాంటి వారి పై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, అధ్యాపక బృందం ఉన్నారు.

**దేశభక్తి భావనను పెంపొందించాలి**

పౌరులలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందేమాతర జాతీయ గీతం సామూహికాలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో పాటు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బంకిం చంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని వందేమాతర జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లారీలను అధికంగా పంపిస్తాం

తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** వాతావరణం అనుకూలిస్తున్న నేపథ్యంలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంత మేరకు ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులకు తరలించడానికి లోడ్ చేయడానికి లారీలను అధికంగా పంపిస్తామని తెలిపారు. కేంద్రంలో ఈ రోజు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించారు. తేమ శాతం వచ్చిన కుప్పలు ఎన్ని ఉన్నాయని అడిగారు. తేమశాతం వచ్చిన ధాన్యం కుప్పలను ఎంత లేటు అయినా ఉండి కొనుగోలు చేయాలని కేంద్రం నిర్వాహకులకు తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వాతావరణంలో మార్పులు వచ్చే లోపు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా టార్పాలిన్‌లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు టార్పాలిన్ వాటిలో ఉంచుకోవాలన్నారు. రైతులకు మౌలిక సదుపాయాలు ఉన్నాయా అని పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐది వందేళ్ల చరిత్ర

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** భారత గడ్డపై సిపిఐది వందేళ్ల చరిత్ర అని, వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈనెల 20న గరిడేపల్లి మండల కేంద్రానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నాయకత్వంలో వచ్చే రాష్ట్ర జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతాకు సంబంధించిన కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న సిపిఐ ఆవిర్భవించిన తర్వాతనే మొట్ట మొదటిగా సిపిఐ డిమాండ్ చేసిందని, ఆ దిశగా పోరాడిన చరిత్ర సిపిఐది అన్నారు. భారతదేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటి పార్టీ సిపిఐ అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందు కోసం ప్రతి ప్రజాసంఘం నడుం బిగించాలని చెప్పారు. సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, పోటు బుజ్జి బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా కనకయ్య, నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



# గీత కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలి





పెండింగ్‌లో ఉన్న రూ. 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలి

గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/చండూరు:** రాష్ట్రంలో ప్రమాదవశాత్తు తాటి,ఈత చెట్టు పై నుంచి పడి మరణించిన కల్లు గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ.లు 13కోట్ల ఎక్స్‌గ్రేషియో బకాయిలను వెంటనే విడుదల చేయాలని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరు ఎక్సైజ్ కార్యాలయంలో గీత పనివారల సంఘం నాయకులతో కలిసి ఆబ్కారీ సిఐ పద్మకు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పల్లె శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులందరికి వృతి రక్షణ కవచాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గీత వృతిలో పనిచేస్తూ చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియోను 5లక్షల రూపాయల నుండి 10లక్షలకు పెంచాలని అదే విధంగా గాయాలపాలైన కార్మికులకు రెండు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ సివిల్ సర్జన్ పర్యవేక్షణలో శాశ్వత వికలాంగుల నిర్ధారణ సర్టిఫికెట్ పద్దతిని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని కల్లు గీత సహకార సంఘాలకు,టిఎఫ్‌టిలకు శాశ్వత లైసెన్స్ ఇవ్వాలని ,అర్హులైన ప్రతి ఒక్కరికి గుర్తింపుకార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత పసనివారల సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు గంట నగేష్ , కర్నాటి వెంకటేశం మల్లేశం , అంజయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు:** గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిల విడుదల చేయాలి గీత పనివారల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి డిమాండ్ చేశారు. గీత కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని శుక్రవారం కమిటీ పిలుపు మేరకు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద తాహసిల్దార్ నరేష్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీత వృత్తి రక్షణ వృత్తిదారులసంక్షేమ ఆధునికరణ వన పెంపకానికి పది ఎకరాల భూమి కేటాయించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న ప్రతి గీత కార్మికునికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మరగోని లాలు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, గీత పనివారల సంఘం మండల ప్రధాన కార్యదర్శి వనం వెంకన్న,ఈదుల కంటి కైలాష్,దుబ్బ వెంకన్న,ఐయితగోని లింగస్వామి,ధోటి నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** పోలీసు అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ఫెండ్లీ పోలీస్ లాగా ప్రవర్తించాలని నల్గొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ కొండమల్లేపల్లి మండల పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎస్పి కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది పనితీరు, పరిసరాలు స్థితి గతుల గురించి ఎస్ఐ అజ్మీరా రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో గది, సిబ్బందికి కేటాయించిన కిట్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలు, రికార్డులు తనిఖీ చేసి దర్యాప్తులో అలసత్వం వహించకుండా త్వరితగతిన ప్రజలకు పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణ, అక్రమంగా రేషన్ బియ్యం సరఫరా, జూదం వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట, ఆకతాయిలు వాహనాలను వేగంగా నడుపుటను నిరోధించుట వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఏఎస్పి మౌనిక, సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పత్తికి అత్యధిక నష్టం మునుగోడు నియోజకవర్గంలోనే

పత్తి రైతులను ఆదుకోవాలి

జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో మునుగోడు నియోజకవర్గంలోనే అత్యధికంగా పత్తి నష్టం జరిగిందని,రైతులు పత్తితీత దశలో ఆకార వర్షాలు కురవడం తీవ్ర నష్టాన్ని చేకూర్చడం దురదృష్టకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. వర్షానికి తడవగా మిగిలిన పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని,నియోజకవర్గ వ్యాప్తంగా సిసిఐ కొనుగోలు కేంద్రాలను కూడా పెంచేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నుండి ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఫోన్‌లో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమశాతం సాకుతో సిసిఐ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సిసిఐ రిజెక్ట్ చేసిన పత్తిని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని సిసిఐకి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు.రైతులు తీసుకెళ్తే కొనని పత్తిని దళారులు తీసుకెళ్తే సిసిఐ అధికారులు కొనుగోలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఈ విషయంలో దళారులను నియంత్రించడంతోపాటు సిసిఐ అధికారులు నేరుగా రైతుల పత్తిని కొనుగోలు చేసుకునే విధంగా చూడాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అత్యధికంగా పత్తిని పండిస్తున్నారని ఈ అకాల వర్షాల వల్ల 50 శాతానికి పైగా పత్తి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల పత్తి పంట దిగుబడి తగ్గిందని సాకు చూపిస్తూ 12 క్వింటాల నుండి 7 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తున్నారంటూ స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయంపై కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో మాట్లాడి వీలైనంత తొందరగా సిసిఐ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.లైసెన్సు లేకుండా దళారులు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్నారంటూమండలంలో దళారులు ఎంతమంది పత్తి కొనుగోలు చేస్తున్నారోవారి జాబితాను సిద్ధం చేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు.

# మహిళా కాంగ్రెస్ నాయకురాలు దుబ్బ రూప మృతి

పార్థివదేహానికి నివాళులర్పించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్ సుందర్ సతీమణి దుబ్బ రూప బ్రెయిన్ స్ట్రోక్ తో శుక్రవారం ఉదయం ఎల్‌బినగర్ ఓమ్ని హాస్పిటల్‌లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాస్పిటల్‌లో ఉన్న ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి,వారి కుటుంబాన్ని ఓదార్చి,ధైర్యం చెప్పారు.మహిళ కాంగ్రెస్ నాయకురాలిగా చురుకుగా పని చేసే దుబ్బా రూప శుక్రవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా చనిపోవడం చాలా దురదృష్టకరమని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రూప ఆకస్మిక మరణవార్త తెలుసుకుని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ప్రజా సేవలో అహర్నిశలు కృషి చేశారని ఆయన గుర్తుచేశారు.ఆమె మృతి పార్టీకి తీరనిలోటు అని వ్యాఖ్యానించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సంతాపం తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తనతో పాటు చురుకుగా పాల్గొన్నదని గుర్తు చేశారు. నల్లగొండలోని దేవరకొండ రోడ్‌లోగల స్వగృహానికి పార్థివ దేహాన్ని తీసుకువచ్చారు. ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యలు రూప పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పి,పర్యావరణ రహిత నిర్మాణంలో భాగ్య స్వాముల అవ్వాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోని విక్రయ దుకాణాలకు రూ.12వేలు జరినామ విధించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించబడిన విషయం తెలిసిందే నని అయితే ఇంకా కొంతమంది వ్యాపారులు, దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి జరినమాలు విధించడం జరిగింది అని తెలిపారు.మళ్లీ ఉల్లంఘిస్తే మరింత భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ గడ్డం శ్రీనివాస్,ట్రేడ్ లైసెన్స్ టీంలు,మున్సిపల్ జవాన్లు పాల్గొన్నారు.

# ముంబైలో మహిళా క్రికెట్ అకాడమీ..



మహిళల వన్డే వరల్డ్ కప్ విజయంతో భారత జట్టు కొత్త అధ్యాయానికి నాంది పలికింది. నలభై ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ ఛాంపియన్‌గా అవతరించిన టీమిండియా దేశంలో మహిళా క్రికెట్ పురోగతికి దారులు వేస్తోంది. అతివలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినట్టే క్రికెట్లోనూ వెన్నుదన్నుగా నిలిచేందుకు ముంబై క్రికెట్ సంఘం ఓ అడుగు ముందుకేసింది. వరల్డ్ కప్ ఛాంపియన్లు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రాధా యాదవ్‌లను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సన్మానించిన తర్వాత ఎంసీఏ కీలక నిర్ణయం తీసుకుంది. ముంబై కేంద్రంగా మహిళా క్రికెటర్ల కోసం వసతి, భోజన సౌకర్యాలతో ప్రత్యేకంగా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని తీర్మానించింది. భారత్‌లో మహిళా క్రికెటర్లకు మెరుగైన శిక్షణ ఇప్పిస్తే అద్భుతాలు చేస్తారు అనడానికి వరల్డ్ కప్ ట్రోఫీయే సాక్ష్యం. అందుకే.. ముంబై క్రికెట సంఘం శుక్రవారం కీలక నిర్ణయంతో ముందుకొచ్చింది. భారత క్రికెటర్లను సీఎం ఫడ్నవిస్ సన్మానించిన సందర్భంగా ఆయనకు వినతి పత్రం సమర్పించారు ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్.

బెంగళూరులో పురుష క్రికెటర్లకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉన్నట్టే మహిళలకు ఒకటి ఉండాలని, ముంబై మహానగరపాలక ప్రాంత పరిధిలోనే తమకు స్థలం కేటాయిస్తే.. అక్కడ సకల వసతులతో మహిళలకు క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామని లేఖలో పేర్కొన్నారు. ఒకేచోట శిక్షణ, రిహాబిలిటేషన్ వసతులు ఉంటే మహిళా క్రికెటర్లకు మరింత ఉపయుక్తంగా ఉంటుందిన ఎంసీఏ ప్రతినిధులు సీఎం ఫడ్నవీస్‌కు తెలియజేశారు. వారి అభ్యర్థన పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది.

భారత జట్టు దశాబ్దాల కల సాకారమవ్వడంలో కీలకంగా వ్యవహరించిన మంధాన, జెమీమా, రాధాలను సీఎం ఫడ్నవీస్ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ అద్భుత ఆటతో వరల్డ్ ఛాంపియన్స్‌గా అవతరించిన ఈ ముగ్గురికి పుష్ప గుచ్ఛం ఇచ్చి.. శాలువాలు కప్పి సత్కరించారు. అంతేకాదు తలా రూ.2.5కోట్ల చెక్కును ప్రదాన చేశారు సీఎం. కోచ్ అన్మోల్ మజుందార్‌కు రూ.2.5లక్షల చెక్కున ముఖ్యమంత్రి అందజేశారు. టీమిండియా చరిత్ర సృష్టించడంలో భాగమైన బౌలింగ్ కోచ్ ఆవిష్కర్ సాల్వీ, సహాయక సిబ్బంది, సెలెక్టర్లు దయాని ఎడుల్జీ, విశ్లేషకుడు అనిరుద్ధ దేశ్‌పాండేలను సీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, క్రీడా శాఖ మంత్రి మాణిక్ రావు కొకటే, సాంస్కృతిక శాఖామాత్యులు అశిష్ షెలార్, ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ ఖండరే, తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో పథిరన ఔట్



ముక్కోణపు సిరీస్‌కు 16 మందితో శ్రీలంక స్క్వాడ్! పరిమిత ఓవర్ల క్రికెట్ కోసం శ్రీలంక క్రికెట్ స్క్వాడ్‌లను ప్రకటించింది. పాకిస్థాన్‌తో వన్డే సిరీస్, ఆపై జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. అయితే.. ఆసియా కప్ స్క్వాడ్‌లోని పలువురిపై వేటు వేశారు సెలెక్టర్లు. యువ పేసర్ మథీశ పథిరన ఇన్ఫెక్షన్ కారణంగా సిరీస్‌కు దూరమవ్వగా.. మోకాలి గాయం నుంచి కోలుకోని మరో పేసర్ దిల్షాన్ మధుషనక సైతం అందుబాటులో లేదు. దాంతో.. యార్కర్ స్పెషలిస్ట్ ఇషాన్ మలింగ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఆసియా కప్ వైఫల్యంతో కంగుతిన్న శ్రీలంక ద్వైపాక్షిక సిరీస్‌లకు సన్నద్ధమవుతోంది. పాకిస్థాన్‌తో వన్డే సిరీస్, అనంతరం జింబాబ్వేతో పొట్టి సిరీస్‌లో చరిత అలసంక బృందం తలపడనుంది. ఈ రెండు సిరీస్‌ల కోసం శుక్రవారం సెలెక్టర్లు 16 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. నువనిందు ఫెర్నాండో, మిలాన్ రత్ననాయకే, నిశాన్ మధుష్క, దునిత్ వెల్లలాగే వన్డేలకు ఎంపికవ్వలేదు. వీరి బదులు.. లహిరు ఉదార, కమిళ్ మిశార, హసరంగ, ప్రమోద్ మధుషాన్‌లను తీసుకున్నారు సెలెక్టర్లు. ఆసియా కప్‌లో నిరాశపరిచిన వెల్లలాగే, పేసర్ కరుణరత్నే, బినుర ఫెర్నాండో స్థానంలో రాజపక్సే, లియనగే, దేషాన్ హేమంతలు పొట్టి సిరీస్‌కు ఎంపికయ్యారు. నవంబర్ 17న రావల్పిండిలో మొదటి వన్డేతో ఆతిథ్య పాక్, శ్రీలంక, జింబాబ్వే మధ్య ముక్కోణపు సిరీస్ ప్రారంభం కానుంది.

**శ్రీలంక వన్డే స్క్వాడ్ :**

చరిత అసలంక(కెప్టెన్), పథుమ్ నిశాంక, లహిరు ఉదార, కమిల్ మిశార, కుశాల్ మెండిస్, సదీర సమరవిక్రమ, కమిందు మెండిస్, జనిత్ లియనగే, పవన్ రత్ననాయకే, హసరంగ, థీక్షణ, జెఫ్రే వాండర్సే, చమీర, అసితా ఫెర్నాండో, ప్రమోద్ మధుషాన్, ఇసాన్ మలింగ.

**శ్రీలంక టీ20 స్క్వాడ్ :**

చరిత అసలంక(కెప్టెన్), పథుమ్ నిశాంక, కుశాల్ పెరీరా, కమిల్ మిశార, కుశాల్ మెండిస్, దసున్ శనక, కమిందు మెండిస్, భానుక రాజపక్సే, జనిత్ లియనగే, హసరంగ, థీక్షణ, దుశాన్ హేమంత, చమీర, నువాన్ తుషార, అసితా ఫెర్నాండో, ఇషాన్ మలింగ.

# డిఎన్ఏలో ఫ్రాక్టల్ యాంటీనా శక్తి!



డిఎన్ఏను జీవ సంకేతాల ఆధారంగా మాత్రమే పరిగణిస్తూ వస్తున్నాం. అయితే, కొంత మంది శాస్త్రవేత్తల కొత్త ప్రతిపాదనలను ప్రకారం, డిఎన్ఏకి ఫ్రాక్టల్ యాంటీనా మాదిరి పని చేసే విప్లవాత్మక శక్తి కూడా ఉంది. పునరావృతమయ్యే నమూనాలతో కూడిన క్లిష్టమైన జామితీయ ఆకారాన్ని ఫ్రాక్టల్‌గా పేర్కొంటారు. తాజా సిద్ధాంతాన్ని అనుసరించి, డబుల్ హెలిక్స్ నిర్మాణం వల్ల డిఎన్ఏ అనేది రేడియో తరంగాల నుంచి అల్ట్రావైలెట్ కాంతి వరకూ విస్తృతంగా ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలను గ్రహించగలుగుతుంది. ప్రసారం చేయగలుగుతుంది. ప్రతిధ్వనిస్తుంది. స్వీయసమానత లేదా సెల్ఫ్‌సిమ్మెంట్రీ, ఎలక్ట్రానిక్ కండక్షన్ వంటి బలాలను ఫ్రాక్టర్ యాంటినా లక్షణాలుగా చెప్తారు. డిఎన్ఏలో ఈ లక్షణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. అందుకే వేర్వేరు తరంగ దైర్ఘ్యాలలో డిఎన్ఏ స్పందించగలుగుతున్నది ఆధారాలు చూపిస్తున్నారు. కణ సమూహాలు కేవలం రసాయన సంకేతాల ద్వారానే కాకుండా, ఎలక్ట్రోమాగ్నెటిక్ రంగాల ద్వారా కూడా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవచ్చునిన సూత్రాన్ని ఈ కొత్త సిద్ధాంతం బలపరుస్తున్నది. డిఎన్ఏలో ప్రకంపనల సమన్వయం (వైబ్రేషనల్ కోహెరెన్స్), ఫీల్డ్ ఆధారిత మేధస్సు (ఫీల్డ్‌బేస్డ్ ఇంటెలిజెన్స్) వంటి నూతన కోణాల ఆవిష్కరణ జరిగే అవకాశాలు ఉన్నాయి. శరీర నిర్మాణ లక్షణాలపై అవగాహన, ఆరోగ్యం, చికిత్స, అత్యవసర వైద్యం వంటి రంగాల్లో ఈ కొత్త సిద్ధాంతం విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని నిపుణులు అంటున్నారు. డిఎన్ఏ వీటిని సాధించడంలో ఫ్రాక్టల్ యాంటీనా తత్వం ఉపయోగపడుతుంది. డిఎన్ఏలోని ఈ లక్షణాల వల్ల, అది పర్యావరణంలోని ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎఫెక్ట్స్ కి ఎక్కువ స్పందించేలా మారి, ఇవే కొన్ని సందర్భాల్లో ఆరోగ్య సమస్యలకు, జీవ పరిణామాల వేగం భిన్నంగా ఉండటానికి కారణమవుతాయని అధ్యయనం సూచిస్తుంది. ఈ పరిశోధన తుది నిర్ధారణ స్థాయికి వస్తే, జీవశాస్త్రంపై మన అవగాహననే మార్చే ప్రభావం చూపుతుంది.

# రాకెట్లకు ప్లాస్మా ఇంజిన్లు!





అంతరిక్ష ప్రయాణానికి ఉపయోగపడే రాకెట్లకు అత్యంత వేగంగా ప్రయాణించేందుకు ఉపయోగపడే, శక్తివంతమైన ప్లాస్మా ఇంజన్లు అమర్చే రోజులు ఎంతోదూరంలో లేవు. ఈ సరికొత్త సాంకేతికతను రష్యా అభివృద్ధి చేస్తున్నదని తెలుస్తోంది. అంతర్జాతీయ మ్యాగజైన్ల సమాచారం ప్రకారం సాధారణ రాకెట్ ఇంధనానికి బదులుగా ప్లాస్మా ఇంజినల్‌లో అత్యంత వేడిగల అయనైజ్డ్ గ్యాస్ (ప్లాస్మా)ను వినియోగిస్తారు. సాధారణంగా రాకెట్ అంగారగ్రహం (మార్స్) చేరడానికి సుమారు ఏడు నెలలు పడుతుంది. కానీ, ప్లాస్మా ఇంజిన్ వాడితే కేవలం 30 రోజుల్లోనే చేరుకోవడం సాధ్యమవుతుంది. ఇందులోని అయనైజ్డ్ గ్యాస్‌ని ఎలక్ట్రోమెగ్నెటిక్స్ ద్వారా వేగంగా కదిలేలా చేసాఇరు. ఇలా వేగంగా బయటకు తోసే గ్యాస్, రాకెట్‌కు విపరీతమైన బలాన్నిస్తుంది. ఫలితంగా ఎక్కువ కాలం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు పోతుంది. ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. ఈ కొత్త టెక్నాలజీతో అంతరిక్ష ప్రయాణాలను భవిష్యత్తులో సులభసాధ్యంగా, మరింత సురక్షితంగా మారుస్తుంది.

# టెరెల్-పెన్‌రోజ్ సిద్ధాంతానికి రుజువు..

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన స్పెషల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ ప్రకారం, ఎక్కువ వేగంతో లేదా సుమారు కాంతి వేగంతో ఒక వస్తువు ప్రయాణిస్తే, అది రుజు మార్గంలో వెళ్లకుండా, వక్రీకరణం చెందుతుంది. ఇది అణువుల స్థాయిలో కనిపించే యదార్థం. అయితే, జేమ్స్ టెరెల్, రోజర్ పెన్‌రోజ్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతానికి మరో నిర్వచనం ఇచ్చారు. కాంతి వేగానికి దాదాపు సమానంగా లేదా, అంతకు మించిన వేగంతో ఒక వస్తువు ప్రయాణిస్తే, అది వివిధ రూపాలను, వక్రతలను సంతరించుకుంటుందని వారు పేర్కొన్నారు. దీనినే టెరెల్–పెన్‌రోజ్ సిద్ధాంతంగా పేర్కొంటారు. తాజాగా, టియు వియెన్, యూనివర్సిటీ ఆఫ్ వియన్నా (ఆస్ట్రియా) శాస్త్రవేత్తలు అల్ట్రాఫాస్ట్ లేజర్లు, అత్యధిక వేగంగల కెమెరాలను ఉపయోగించి, కాంతి వేగాన్ని (సెకనుకు 299,792,458 మీటర్లు) ఫొటో తీశారు. దీనిని 'రిలేటివిస్టిక్' డ్రామాగా పేర్కోవచ్చు. ఒక ఘన వస్తువు వేగానికి లొంగిపోకుండా, ఒకవైపు వంగడం కనిపించింది. అంతేగాక, గుండ్రటి వస్తువు మాదిరిగా వృత్తాకారాన్ని సంతరించుకోగలదు. ఇది టెరెల్–పెన్‌రోజ్ సిద్ధాంతానికి ప్రత్యక్ష రూపం. ఈ పరిశోధన మనం భవిష్యత్తులో పరిశోధకులు, విద్యార్థులు ఒక అలౌకిక దృశ్యాన్ని చూసే అవకాశాన్ని కల్పించింది. దీని వల్ల భవిష్యత్తులోని ఫిజిక్స్, ఆప్టిక్స్, క్వాంటం విజ్ఞాన రంగాలకు కొత్త ఇమేజింగ్ టెక్నాలజీలు పరిచయమవుతాయి. రిలేటివిటీని ఒక చిత్రంలో ఇలా దర్శించడాన్ని గణితాన్ని కళగా మార్చడంగా చెప్పవచ్చు. ఏదైతేనేం, ఇటీవల జరిగిన ప్రయోగంతో మనిషి కళ్ల ముందు నిజంగానే విజ్ఞాన సిద్ధాంతం ప్రత్యక్షమైంది.



## ప్రజా పోరాటాలలో సిపిఐది కీలకపాత్ర



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణమైన స్వాతంత్ర్యంకావాలని ఆరోజుల్లోనే సిపిఐ బ్రిటిషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఆరోజుల్లో బ్రిటిషు ప్రభుత్వం సిపిఐపార్టీపై నిషేదం విధించిన సిపిఐ నాయకులు జైళ్లల్లో అజ్ఞాతవాసాలలో ఉండికూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సందర్భాలను ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిర్వహించడంలో సిపిఐకీలకపాత్ర పోషించిందన్నారు. ఈ పోరాటంలో 4500 మంది ప్రాణాలను కోల్పోవడం జరిగింది. డిసెంబర్ 26న లక్షలాదిమందితో ఖమ్మంలో జరిగేటటువంటి భారీ బహిరంగసభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, మండల మొలచింతలపల్లి శాఖ కార్యదర్శి జంగంశివుడు, సింగోటంశాఖ కార్యదర్శి చంద్రయ్య, తిర్నాంపల్లిశాఖ కార్యదర్శి వెంకటస్వామి, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

## 12 నుండి జన సేవాదళ్ శిక్షణ

**సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా**



**ప్రజాపక్షం / వరంగల్ :** సిపిఐ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఈనెల 12,13 తేదీలలో జరుగు జన సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పిలుపు నిచ్చారు. శివనగర్ తమ్మేర భవన్ లో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సమావేశం ఎండి అక్బర్ పాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. షేక్ బాష్ మియా మాట్లాడుతూ భారత దేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటిపార్టీ సిపిఐ అని అన్నారు. పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టిచాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐదన్నారు. ఆదిలాబాద్ నుండిఖమ్మంవరకు జరుగు బస్‌జాత 19న వరంగల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ నెల 21,22 తేదీల్లో జరుగు వరంగల్ జిల్లా జాతను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనసేవా దళ్ కవాత్ విజయవంతం కోసం ఈ నెల12, 13 తేదీలలో అజంజాహి మిల్ గ్రౌండ్లో జనసెవాదళ్ శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు.జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, సంఘీ ఏలేందర్ ,బుస్స రవీందర్, తోట చంద్రకళ, వీరగొని శంకరయ్య, కందిక చెన్నకేశవులు, యాకయ్య, చింతకింది కుమారస్వామి, ల్యాదల్ల శరత్, యాకాంబ్రచారి, జన్ను రవి, దామెర కృష్ణ, మస్క సుధీర్. తాళ్లపల్లి రహేల ఉన్నారు.

# కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం

**పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి**

**4వ జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎఐటి యుసి అనుబంధ చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం 4వ జిల్లా మహాసభలను ఈనెల 16,17 సిరిసిల్ల ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి కోరారు. సిరిసిల్ల ఏఐటియుసి కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏఐటియుసి భారతదేశంలో 1920 అక్టోబర్ 31 వ తేదీన బొంబాయి నగరంలో భారతదేశంలోని కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు ఏఐటియుసి కార్మిక సంఘం ఏర్పరచుకోవడం జరిగిందన్నా రు. 103 సంవత్సరాలు చరిత్ర కలిగి కార్మిక హక్కులకై నిరంతరం నిజాయితీగా పోరాడుతున్న సంఘమని కొనియాడారు. అప్పటినుం డి దేశంలోని కోట్లాది మంది సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కొరకై కార్మిక వర్గాన్ని సంఘటితం చేస్తూ నిరంతరం కార్మిక హక్కులకై పోరాడుతుందన్నారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో పాటు ఏఐటియుసి రాష్ట్ర నాయకత్వం పాల్గొని గత రెండు సంవత్సరాల కాలపు కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోని పవర్‌లూమ్ అనుబంధ రంగాలల సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొంక విజయ్,ఎలిగేటి రాజు, సోమ నాగరాజు, సదానందం, శ్రీరామ్, చెందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తేయాలి

**ఏడు క్వింటాళ్ల కొనుగోలుతో రైతుకు భారీ నష్టం**

**కలెక్టర్ హైమావతికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ వినతి**



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** పత్తి రైతులకు ఏలాంటి షరతులు లేకుండ పాత పద్దతిలో సిసిఐ కొనుగోళ్లు చేపట్టాలని ..రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కసాన్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి రైతులకుఇబ్బందులకు కలుగకుండ చూడాలని జిల్లా కలెక్టర్‌హైమావతికిసిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హైమావతికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ వినతి పత్రం అందచేశారు. మంద పవన్ కలెక్టర్‌తో మాట్లాడుతూ భారీ వర్షాల మూలంగా పత్తిపంట దెబ్బతినటంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతలు ఆందోళన చెందుతున్న క్రమంలో లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పత్తికి సిసిఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్‌లో ఒక రోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలని, గతంలో ఎకరానికి 12 క్వింటళ్లు కొనుగోలు చేసిన సిసిఐ ఈ సారి 7 క్వింటళ్లను కుదించటం రైతులకు తీవ్ర నష్టంచేకూరిందన్నారు. పత్తికి తేమశాతం 12 నుండి 20 శాతం పెంచాలని, రైతులను ఇబ్బందులను గురి చేసే ఆంక్షలు పెట్టి మరో సారి నడ్డివిరిచే విధంగా రైతన్నకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ కసాన్ యాప్ ను ఎత్తివేసి నేరుగా పాత పద్దతిలో పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి స్పందిస్తూ రైతులకు ఇబ్బంది కలుగకుండ చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. సిసిఐ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు మంద పవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జెర్రిపోతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## 'గీత కార్మికుల' బకాయిలు విడుదల చేయాలి

**సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరిగౌడ్**



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికులకు చెల్లించాల్సిన 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను విడుదల చేయాలని గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం ఆధునీకరణ, తాటి వనం పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలని తదితర డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం నాయకులు లోడ యాదయ్య, సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, పాలకూరల స్వామి, సుర్వి జంగయ్య, ముత్యాలు, కొండూరు యాదయ్య, బత్తిని మల్లేష్, వీరమల్ల జంగయ్య, ఐటపాముల అంజయ్య, నీళ్ల అంజయ్య, కొండ నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీ కోసం గళమెత్తిన విద్యార్థి సంఘాలు



## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో కల్వకుర్తిమహబూబ్‌నగర్‌చౌరస్తావద్ద ధర్నా చేశారు. ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మాట్లాడారు. తెలంగాణరాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

## షరతుల్లేకుండా పత్తి కొనుగోళ్లు

**సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షం కారణంగా మైచర్ రావడం లేదు. దీంతో ప్రభుత్వాలు మైచర్ లేదని రైతులకు మోసం చేస్తున్నారని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదరి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ షరతులు లేకుండా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.కుంటాల రాములు, అరుణ్‌కుమార్, మహబూబ్‌ఖాన్, అర్ధాంగి రమేష్, షేక్ పాషా, కామ్‌లే రామదాస్,బెజ్జంకి నర్సింగరావు, షేక్ సలీం, కడప సురేష్ ఉన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సమస్యల పరిష్కారం కొరకు కాలనీలో పర్యటన



**ప్రజాపక్షం/ఉప్పల్ :** హబ్సిగూడ డివిజన్‌లోని పిఅండ్‌టి కాలనిలో పలు సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గురువారం అధికారులు డిఇ నాగమణి, విద్యుత్ శాఖ ఎడిఇ దశరథ్‌తో కలసి కాలనీలో పర్యటించిన సందర్భంలో స్థానికులు కాలనీలో సిసి రోడ్లు వేయాలని, విద్యుత్తు సరఫరాలో సమస్యలున్నాయని హై ఓల్టేజ్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు, వీధి దీపాలు సక్రమంగా వెలగని పరిస్థితి ఉందని ఈ సమస్యలను సత్వరమే పరిష్కారం చెయ్యాలని కోరగా కార్పొరేటర్ వెంటనే విద్యుత్ శాఖ అధికారులను ఆయా సమస్యలను తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు.



## రైతులకు మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు

**ప్రజాపక్షం/నవాబుపేట:** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఆరుగాలం పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. నవాబ్ పేట్ మండలం వట్టిమీనపల్లి గ్రామ సమీపంలో గల గోదాంలో మార్క్ ఫెడ్ సౌజన్యంతో పిఏసిఏస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కాలే యాదయ్య మండల పిఏసిఏస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, ఎంపి చైర్మన్ రాథోడ్ గీత సింగ్, వ్యవసాయ అధికారిని జ్యోతి తో కలిసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, రైతులు దళారుల నమ్మి మోసపోకుండా పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, ప్రభుత్వ మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఏస్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సిఇఒ మోహన్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు, నరసింహారెడ్డి, ఖదీర్, రాజశేఖర్ రెడ్డి, లింగం, వెంకటేశం గౌడ్, మాజీ ఎంపిటిసి ఏక్బాల్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎఇఒ,అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ హ్యాకింగ్ అయిందంటూ ఎమ్మెల్సీ ఫిర్యాదు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తన ఫోన్ హ్యాకింగ్ అయిందంటూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేసారు. బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీగా ఉన్న ఆయన శుక్రవారం దుండిగల్ పోలీసులకు గత కొద్ది రోజులుగా హ్యాంకింగ్ అయినట్లు అనుమానిత అలర్ట్, వార్నింగ్‌లు వస్తున్నాయని, ఈ విషయంలో దర్యాప్తు చేసి నేరస్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని డిటెక్టివ్ ఇనస్పెక్టర్ బాలరెడ్డి తెలిపారు.

## సమస్యలు పరిష్కరించని అధికారులు

### దళిత సమాఖ్య అధ్యక్షుడు రామ్మోహన్ ఆగ్రహం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** దళితవాడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బిఎన్ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని దళితవాడలో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. ఎస్‌సి, ఎసిటి కమిషనర్ బక్కి వెంకటయ్య, అప్పటి తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ ఎలక్ట్రిసిటి అధికారులను ఆదేశించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్టి కమిషనర్ వెంకటయ్య దళితవాడలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దళితవాడలో సమస్యలతో ప్రజలు కాలనీవాసులు ప్రధానంగా సిసి రోడ్డు, మురికి కాలువలు అభివృద్ధి చేయాలన్నారు. దళిత సంఘానికి కేటాయించిన అంబేద్కర్ భవనం వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. స్థానిక విద్యుత్ అధికారులు, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఇతర అధికారులు స్పందించి దళితవాడలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.



## ప్రిన్సిపాల్ ప్రవర్తన మార్చుకోవాలి

### అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు జంగం భ్రమరాంబ

**ప్రజాపక్షం/బంట్వారం:** బంట్వారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూలా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్ళినప్పుడు తన ప్రవర్తన తీరు సరిగా లేదని అమ్మ అదర్శ పాఠశాల అధ్యక్షురాలు జంగం భ్రమరాంబ శుక్రవారం అన్నారు. గత కొన్ని రోజులుగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూలా విద్యార్థులు తమకు బోనోఫైడ్, ట్రాన్సఫర్ సర్టిఫికెట్, ఎస్‌స్‌సి మెమో, ఇంటర్ మెమోలు కావాలని వెళితే మీరు ఇష్టం వచ్చినప్పుడు ఇవ్వరు, మేము రమ్మన్నప్పుడు రావాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రుల పై చిరాకుపడ్డ దాఖాలలు తమ దృష్టికి వచ్చిందని, మీరు తీరు మార్చుకోవాలని అమ్మ అదర్శ పాఠశాల అధ్యక్షురాలు జంగం భ్రమరాంబ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పూర్వ విద్యార్థులు ఎవరైన బోనఫైడ్, సర్టిఫికెట్ కోసం వస్తే గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్ సరళ మేడం దగ్గకు వెళ్ళామని ఉచిత సలహాలు ఎన్నో ఇచ్చినట్లు పలు ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. మాకు బోనఫైడ్ కావాలని వెళ్లిన స్కూలు రికార్డ్‌లో ఏవైన తప్పులు సరిచేయమని వెళ్ళిన తల్లిదండ్రులకు పొంతనలేని సమాధానాలు చెబుతూ అక్కడి నుండి పంపిస్తున్నారు. విద్యార్థుల డాటాను యుడాస్ మరియు ఆఫర్ అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు విద్యా శాఖకు సమాచారం ఉండగా విద్యార్థులను తల్లిదండ్రులను ఇబ్బందుల గురి చేయవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల బర్త్‌సర్టిఫికెట్స్ కోసం ఆన్‌లైన్, మీ సేవ సెంటర్ల చుట్టు తిరిగి మా పిల్లల డాటాను కరక్షన్ చేయమని పాఠశాలల చుట్టు తిరిగుతూ అడుగుతుంటే ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులపై తల్లిదండ్రుల పట్ల చిరాకు పడడం సరైనది కాదని, ప్రవర్తనను మార్చుకోవాలని, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు జంగం భ్రమరాంబ అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా మధ్యాహ్న భోజనంలో భాగంగా ప్రస్తుత పిన్సిపాల్ విధులలో చేరినప్పటి నుంచి విద్యార్థులకు గుడ్డు ఇవ్వడం లేదని ఆరా తీయగా తమకు సంబంధం లేదని, ఆ విషయం స్థానిక మండల విద్యాధికారి వేకటేశ్వరావుని అడగాలని మాట దాట వేశారు. ఇప్పటికైన తమ తీరు మార్చుకోని విద్యార్థులకు మంచి విద్యాబుద్దులు నేర్పి ఉన్నత స్థాయిలో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రు లు ఉన్నారు.

# 44% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ

### మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి డిమాండ్

**ప్రజాపక్ష/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 44 శాతం ఫిట్మెంట్‌తో వేతన సవరణ అమలు చేయాలని ఏఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీ వైద్య కళాశాలలో హేమలత అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జులై నెల నుంచి అమలు కావాల్సిన పిఆర్‌సి అమలు చేయాలని, ఐదు విడతల డిఎ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యనివాహక అధ్యక్షుడు వి. వేణు కుమార్ మాట్లాడుతూ వైద్య శాఖ లో గత 60 సంవత్సరాలుగా గుర్తింపు పొందిన యూనియన్‌గా ఉద్యోగులకు ఎన్నో విజయాలు సాధించి పెట్టిందన్నారు. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీలు జరిపితే, రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి, వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ఉస్మానియా వైద్యశాల నర్సింగ్ ఆఫీసర్ కె . సుశీల మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్ని పునఃరుద్దరించాలని, 317 జిఒ ద్వారా ఇప్పటికీ న్యాయం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని, మహిళ నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పురుషులకు కూడా చెల్లించాలని , టివివిపిలో అసిస్టెంట్ కమీషనర్ (నర్సింగ్) పోస్టును తక్షణం భర్తీ చేయాలని కోరారు. యూనియన్ నగర కార్యదర్శి జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ఉద్యోగులకు లాబ్‌లో ఇన్ సర్వీస్ శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన నర్సింగ్ డైరెక్టరేట్‌ను తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నేతలు రాజు, ఫరూక్ భూమయ్య, లక్ష్మీ పతి, రాఘవేంద్ర, సాజిద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## భారత్‌లో అక్రమంగా స్థిరపడిన విదేశీయుల కోసం కూంబింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవలి కాలంలో కొంతమంది విదేశీయులు మెడికల్, స్టూడెంట్, బిజినెస్ తదితర వీసాలపై వివిధ దేశాల నుండి భారతదేశానికి వచ్చి అక్రమంగా స్థిరపడిన వారి కోసం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆసీఫ్‌నగర్‌లో నైజీరియా దేశానికి చెందిన జాన్‌కెన్నెడీ చుక్వు మెకా ఒకోరో అలియాస్ హోపి కప్ (43)ను అరెస్టు చేసి నైజీరియాకు పంపించామని టాస్క్‌ఫోర్స్ డిసిపి వై.వి.ఎస్.సుదీన్ద్ర తెలిపారు. హోపికప్ 2012లో బిజినెస్ వీసాపై భారత్‌లోకి ప్రవేశించాడని అతని వీసా, పాస్‌పోర్టు గడువు ముగిసినా నైజీరియాకు వెళ్లకుండా హైదరాబాద్‌లో అక్రమంగా స్థిరపడ్డాడని తెలిపారు. పాస్‌పోర్, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా వారు భారతదేశంలోనే ఉండి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అంటే భారతదేశంలో వివిధ రకాల మాదకద్రవ్యాలను రవాణా చేయడం, సరఫరా చేయడం మరియు అమ్మడం, దీని ఫలితంగా సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు పర్యవసానంగా వ్యసనం పెరుగుతోంది. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ హైదరాబాద్ ప్రజలను మాదకద్రవ్యాల దుర్వినియోగానికి దూరంగా ఉండాలని కోరుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలు మాదకద్రవ్యాల బారిన పడకుండా చూసుకోవడానికి వారి కార్యకలాపాలను గమనిస్తూ ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి సంబంధించిన ఏదైనా సమాచారాన్ని ఈగల్ బృందానికి 8712661601 మొబైల్ నంబర్‌కు అందించవచ్చు.



## ఎల్లయ్యగౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కవిత

**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ బస్సు ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ప్రమాదంలో 19మంది ప్రాణాలు గాల్లో కలువడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. బస్సు ప్రమాదంలో ముగ్గురు ఆడపిల్లలను కోల్పోయిన యాలాల మండల పరిధి పేర్కంపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్యగౌడ్ కుటుంబాన్ని కవిత పరామర్శించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధి పేర్కంపల్లి గ్రామాన్ని సందర్శించిన జాగృతి అధ్యక్షురాలు కవిత ఎలయ్యగౌడ్, విఠలమ్మలను ఓదార్చారు. ఈ లాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని, ముగ్గురు ఆడపిల్లలు బస్సు ప్రమాదంలో మృతి చెంద డం చాలా బాధాకరమని వారికి ధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ల క్ష్యం వల్లే చేవెళ్ళ రోడ్డు ప్రమాదం జరిగి 19మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలసి పోయాయని ధ్వజమెత్తారు. 19మంది బాధిత కుటుంబాలకి ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం, గాయాల పాలైన 30మందికి రూ.10వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశా రు. ప్రమాదం జరిగిన తరువాత రోడ్లు మరమ్మత్తులు చేపట్టడం ఏమిటని కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రమాదం జరిగిన తరువాత మరమ్మతులు చేయడం కంటే ముందే రోడ్డు మరమ్మతులు చేపడితే ప్రమాదం జరిగి ఉండేది కాదని, 19మంది కుటుంబాలు రోడ్డున పడేది కాదని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారని, ఇప్పటికైన సిఎం ఈ రోడ్డుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ప్రాంతానికి రేడార్ కేంద్రం రావడంతో వాహనాల రద్దీ పెరిగి పోయిందని అన్నారు. అదే విధంగా బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధాలుగా మారిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడడం జరిగిందని తెలిపారు. త్వరలోనే మళ్లీ తాండూరుకు వస్తానని చెప్పారు. కవిత వెంట స్థానిక నాయకురాలు మాజీ మున్సిపల్ చైర్‌పర్స్ కోట్రిక విజయక్ష్మి , జాగృతి నాయకురాలు శకుంతల, జాగృతి సభ్యు లు దత్తు, చంటియాదవ్ తదితరులు ఉన్నారు.



## 9న లాల్‌బజార్ అయ్యప్ప ఆలయంలో 15భాషల్లో నృత్య ప్రదర్శనలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దివంగత మాజీ ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈ నెల 9న సికింద్రాబాద్, తిరుమలగిరిలోని లాల్‌బజార్, అయ్యప్ప ఆలయంలో 15 భాషల్లో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు భారత్ భారతి (హైదరాబాద్) సౌత్ ఇన్‌చార్జి డాక్టర్ మీనాక్షి పద్మనాభన్ కార్యదర్శి డాక్టర్ బృంద తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, భారత్ భారతి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా వరల్డ్ మలయాళీ కౌన్సిల్ గ్లోబల్ వైస్ చైర్మన్ సురేంద్రన్, భారత్ భారతి జాతీయ అధ్యక్షులు వినయ్ పాత్రలై హాజరవుతారని తెలిపారు.

## ఉషోదయ పబ్లికేషన్‌లో ఉద్యోగ నియామకాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉషోదయ పబ్లికేషన్ (ఈనాడు) పత్రిక ప్రమోషన్‌కు సంబంధించి 20మంది ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని, ఆసక్తి, ఆర్హత ఉన్న అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయ శాఖ వెబ్‌సైట్ www.employment. telangana. gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి కల్పనాధికారి రాధిక పేర్కొన్నారు. డోర్ టు డోర్ ప్రమోషన్ నిమిత్తం తీసుకొనే ఈ ఉద్యోగులకు టిఎ, డిఎ సదుపాయాలతో పాటు ప్రతి నెల రూ.15,200 వేతనం ఇస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం తమను 94915 22001, 9866465024, 7386809422ల ద్వారా సంప్రదించవచ్చన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికతో కొత్త శకానికి నాంది పలకాలి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రధాన బలం బంధుప్రీతిని అని, కావున, దీనిని ఓటర్లంతా తిరస్కరించి, నిజాయితీపరుని ఎన్నుకొని ప్రజాస్వామ్యంలో కొత్త శకానికి నాంది పలకాలని సిటిజన్ ఫోరం తెలంగాణ, జన్ సేవా సంఘ్ హైదరాబాద్ సంస్థలు కోరాయి. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జన్‌సేవా సంఘ్ అధ్యక్షులు ఆర్.పి.సింగ్, కోశాధికారి బినిత్ సింగ్, కార్యనిర్వాహక సభ్యులు మహ్మద్ మున్వర్, సిటిజన్ ఫోరం తెలంగాణ ప్రతినిధి చలపతి, రిటైర్డ్ ఐజిపి నరసింహ మీడియాతో మాట్లాడారు. పాలకులు ఉచిత విద్య, వైద్యం పక్కనపెట్టి దేశాభివృద్ధి, ఉపాధిని అడ్డుకొనే పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. జన్ సేవా సంఘ్ మొదటి నుంచి అవినీతి రహిత, సుపరిపాలన ధ్యేయంగా ముందుకెళ్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు.

# ఉద్యమకారుల్లో ఉత్తేజాన్ని నింపిన వందేమాతరం గేయం

### రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గేయం ప్రజలందరిని ఒకటిగా చేర్చటంలో కీలకపాత్ర పోషించిందని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. ఈ గేయం ఉద్యమకారుల్లో ఉత్తేజాన్ని నింపిందని, సామాన్యులను సైతం సమర యోధులుగా మార్చిందన్నారు. వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కల్సి వందేమాతరం గేయాలాపన చేసారు. మరో పక్క ఉప్పల్ రింగ్ రోడ్‌లో కమిషనర్ సూచనల మేరకు ట్రాఫిక్ విభాగ డిసిపి డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అదనపు డిసిపి లక్ష్మి , ఎసిపి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, మధు, భాస్కర్‌లతో పాటు లిటిల్ ఫ్లవర్ కాలేజి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని దేశ భక్తిని చాటేలా సామూహిక వందేమాతరం గానం ఆలపించారు.

**దుండిగల్‌లో :**



శ్రీ బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆఫీస్ స్టాఫ్ అందరితో వందేమాతరం గేయం ఆలపించారు. ఈ గేయం అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో రణన్నినాదంగా ఉపయోగపడిందనీ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ గేయాన్ని జాతీయగేయంగా భారత ప్రభుత్వం స్వీకరించిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి. లక్ష్మయ్య, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉప్పల్‌లో :**
వందేమాతరం గేయం రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉప్పల్ రింగ్‌రోడ్ జంక్షన్ వద్ద ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ డిసిపి డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఉదయం 10 గంటలకు వందేమాతరం గేయం ఆలపించారు. వందేమాతరం గేయం ఆలాపించే సమయంలో ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా డిసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ శతాబ్దన్నర క్రితం బంకిం చంద్ర చటర్జీ గారి కలంలో పుట్టిన వందేమాతరం ఈ దేశ విముక్తికి నాంది పలికిందని, ఇది కేవలం దేశభక్తి గేయమే కాదు, భారతీయుల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ఆయన మాట్లాడుతూ, వందేమాతరం పాట దేశ మట్టిని, నీటిని, ప్రజలను దైవంగా చూసే భారత తాత్వికతకు పునాది వేసిందని పేర్కొన్నారు. డీసీపీ యువతకు పిలుపునిస్తూ భారత మాతకు వందనం చేయడం అనేది కేవలం మాటల పరిమితి కాదు అది దేశానికి అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యత పాటించడానికి మనం తీసుకున్న ప్రతిజ్ఞ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదనపు ట్రాఫిక్ డీసీపీ లక్ష్మి, ట్రాఫిక్ ఏసీపీ ఎంవీ శ్రీనివాస్, ఉప్పల్ లా అండ్ ఆర్డర్ ఇన్స్పెక్టర్ భాస్కర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, మల్లేష్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:**
స్వాతంత్ర ఉద్యమస్ఫూర్తికి బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయాన్ని నేటికి 150వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతరం గేయాన్ని ఎమ్మార్వో ఆఫీస్‌లో ఎమ్మార్వో,రెవెన్యూ అధికారులు,మున్సిపల్ ఆఫీస్‌ఆవరణలో మున్సిపల్ కమిషనర్, అధికారులు,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్,ఎస్సైలు,కానిస్టేబుల్స్,మరియు స్కూల్ విద్యార్థులచే గీతాలాపన చేశారు. ఈ గేయం ఉద్యమకారుల్లో ఉత్తేజాన్ని నింపిందని సామాన్యలను సమరయోధులుగా మార్చిందని వందేమాతరం గేయ విలువను స్ఫూర్తిని భవిష్యతరాలకు అందజేయాలని పిలుపునిచ్చారు.

**మేడ్చల్ మల్కాజిగిరిలో:** వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకొన్న నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయంలో సామూహిక గేయాలాపన చేసారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది. టిఎస్ఎస్ కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నేడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు, ర్యాలీ

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను శనివారం ఉదయం 7.30 గంటలకు మేడ్చల్ బస్‌స్టేషన్ నుండి సిఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియం వరకు విద్యార్థి యువజన జిల్లా స్థాయి ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ పాల్గొననున్నారు.



**వికారాబాద్‌లో :**
భారతీయ జాతీయ గీతం వందేమాతరం ,రచన 150వ వార్షికోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ వివిధ శాఖల జిల్లా అధికారులు , పాఠశాల విద్యార్థులతో కలిసి సామూక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ డిప్యూటి కలెక్టర్ చంద్రకిరణ్ , ఆర్‌ఓమంగ్లీనాయక్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి అధ్వర్యంలో,150సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పితోపాటు కార్యాలయ సిబ్బంది మొత్తం గీతాన్ని ఆలపించడం జరిగింది.ఎస్‌పి మాట్లాడుతూ వందేమాతరం గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరనగా నిలిచందని ,ఈ గీతం భాతరమాతం పట్ల ఉన్న భక్తి త్యాగం ,దేశబిమానానికి ప్రతీక అని తెలిపారు. ప్రతి భారతీయునిలో దేశభాక్తి ని ,ఐఖ్యతను ,జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తుంది అని అన్నారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాల వేడుకలు జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయల్లో ,పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

**శామీర్‌పేటలో :**
మూడుచింతలపల్లి మున్సిపాలిటిలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 150 సంవత్సరాల వందేమాతరం ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎస్ఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తిరంగా జెండాతో బారీ ర్యాలీని నిర్వహించారు. వందేమాతరం అంటు పెద్ద పెట్టున విద్యార్థులు నినాదాలు చేశారు. వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మాజి సర్పంచ్ జాం రవి, మున్సిపల్ మేనెజర్ ఉష, రెవెన్యూ ఆఫీసర్ రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, శానీటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, నాయకులు వేణుగోపాల్‌రావు, ఇర్మయ్య, యాదగిరి, శ్రీను, బిల్ కలెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## దాతల సహకారం అభినందనీయం



ప్రజాపక్షం/షాబాద్ :గ్రామస్తుల చేయూత దాతల సహకారం అభినంద నీయం అని ప్రధానోపాధ్యాయులు మర్పలి అశోక్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మన్మర్రి ప్రాథమిక పాఠశాలలో ఆకృతి ఫౌండేషన్ సభ్యులు శ్రీధర్ రెడ్డి, అంతారం నర్సింలు, వెంకటేష్ గ్రామస్తుల సహకారంతో వాటర్ ప్యూరిఫైయర్ 500లీటర్ల కెపాసిటి గల వాటర్ యంత్రాని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు మర్పలి అశోక్ మాట్లాడుతూ.. గ్రామస్తులు గ్రామ అభివృద్ధిలో భాగంగా పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్ఎంసి మాజీ చైర్మెన్ వెంకటేష్, శంకర్, శామలమ్మ, మల్లమ్మ, అంగన్ వాడీ టీచర్ చైతన్య పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్లలకు సహాయం



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామానికి చేందిన అందోజ్ సుజాత బిక్షమాచారి కుమార్తె రిషిత వివాహనికి 10 వేలు, మోర మొగులమ్మ లక్ష్మ య్య కూతురు మానస వివాహనికి 10 వేల ఆ ర్థిక సహయం అంద జేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి బట్టు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాల్ గ్రామంలో ఎవరికి ఎలాంటి అపద వచ్చిన అదుకోవడానికి తన వంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు.అపదలో పేదలకు కొండంత అండగా ఉంటానని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో మరింతగా ముందుకు సాగుతానని అన్నారు. తనకు సహకరిస్తున్న వారందరికి అయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యాచారంలో ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల కేంద్రంలో శుక్రవారం డివైఎఫ్ఐ 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి,ముందుగా డివైఎఫ్ఐ జెండాను అవిష్కరించారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య మాట్లాడుతూ డివైఎఫ్ఐ సంఘం 1980 నవంబర్ 1,2,3 తెదిల్లో పంజాబ్ రాష్ట్రంలో ని లూధియానా ప్రాంతంలో ఎర్పడిందన్నారు. యువకులు ఎదురుకుంటున్న సమస్యలపై అప్పటి నుండి ఇప్పటి వరకు పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు.నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. సమాజ మార్పు కోసం కృషి చేయాలన్నారు.విద్యార్థులకు పిజు రియంబర్స్ మేంటు 800 కోట్ల రూపాయల బకాయిలు వేంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో నాయకులు ఎం భగత్,ఎం. సురేశ్,పి. శివ,బి.రాకేశ్,శ్రీశైలం తదితరులు పాల్గోన్నారు.

## బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/మియాపూర్:ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని బిజెపి జిల్లా నాయకులు రవి గౌడ్ లు అన్నారు. శుక్రవారం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్ పేట్ లో జి హెచ్ ఎం సి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ జన్మదినన్ని పురస్కరించుకొని ఓల్డ్ హఫీజ్ పేట్, హుడా కాలనీ, గంగారాం, చందానగర్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సీనియర్ నాయకులు బోయిని మహేష్ యాదవ్ జన్మదిన కేక్ ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా అనూష మహేష్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆహార పొట్లాలను అందజేశారు ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ రమణయ్య ,బిజెపి జిల్లా నాయకులు రవి గౌడ్, హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.అంతేకాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ చూపిన బాటలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్ గౌడ,రాజు ముదిరాజ్,బాబు రెడ్డి,శ్రీనివాస్ యాదవ్ పవన్, నర్సింహా యాదవ్,పాలం శ్రీనివాస్,నవీన్,దేవేందర్ దాస్,రాజేష్,రామారావు, సుబ్బారావు, వినయ్, రాజు,శ్రీను, రాములు, కుమార స్వామి, అనిల్,శివ,చెందు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం
### కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాణి



ప్రజాపక్షం/షాద్‌నగర్:నిరు పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలోని ఇల్లు లేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. గత బిఆర్ఎస్ హయంలో ప్రజలకు ఎలాంటి సంక్షేమ ఫలాలు ఇవ్వకుండ ప్రజల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుందరయ్య, కార్యదర్శి రాఘవేందర్, నాయకులు నర్సింలు, శివయ్య, శంకర్, భిక్షపతి, రాజశేఖర్, శ్రీను తదితరులు ఉన్నారు.

## ఇవిఎం గోడౌన్ పరిశీలన



ప్రజాపక్షం/రంగారెడ్డి: రాజేంద్ర నగర్ లోని ఇవిఎం గోడౌన్ ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఇవిఎం గోడౌన్‌లకు వేసిన సీళ్లను పరిశీలించి,బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు,వివి ప్యాట్లు,ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు.ఇ వి ఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఆర్ డిఒ వెంకట్ రెడ్డి,స్థానిక తహశీల్దార్,వేర్ హౌస్ ఇంచార్జీ రాములు,ఎన్నికల విభాగం అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## పేద కుటుంబాల పిల్లల విద్యకు
# రూ.6వేల కోట్లు భారమా?
### ఉన్నత విద్యామండలి ఆఫీసు ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : రాష్ట్ర ప్రభుత్వానికి రెండేళ్లకాలంలో లక్షల కోట్ల ఆదాయం వచ్చినా, 14లక్షల మంది బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు రూ.6వేల కోట్లు ఫీజు బకాయిలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా కాలేజీలు మూసివేస్తే ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపులేదని విమర్శించారు. ఆరు నెలలకాలంలో ఒక్కొక్క కాంట్రాక్టుకు 7వేల కోట్లు, 4వేల కోట్లు ఇలా వేల వందల కోట్లు వంద మంది కాంట్రాక్టులకు చెల్లించారని, కానీ, పేద పిల్లల చదువులకు రూ.6 వేల కోట్లు ఇచ్చేందుకు భారమా? అని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ సంఘం రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని వేలాది మంది విద్యార్థులు ముట్టడించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజురీయింబర్స్ మెంట్ స్కీం అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వనికి ఏం చేయాలో తోచక పోతే తమను చర్చలకు పిలిస్తే ఎలా పైసలు తేవాలో సూచిస్తామన్నారు. అప్పు లు తెచ్చైనా విద్యార్థుల చదువులకు ఫీజులివ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌ల డబ్బులను కొందరు మంత్రులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. బిసి సంఘం నేతలు భరత్, సి.రాజేందర్, భీంరాజు, అనంతయ్య, మోదీ రాందేవ్, బాలయ్య, మణికంఠ ఉన్నారు.

## సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 'వందేమాతరం' గేయాలాపన



ప్రజాపక్షం/రంగారెడ్డి:"వందేమాతరం" జాతీయ గేయం150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో,సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం వందేమాతరం గేయాన్ని సామూహిక గానం నిర్వహించారు.సైబరాబాద్ సిఎ ఆర్ హెడ్‌క్వార్టర్స్ ఎడిసిపి జె.ఎస్.కె.షమీర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్, సిఏఆర్ హెడ్‌క్వార్టర్స్ పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.పోలీస్ సిబ్బంది "వందేమాతరం" గీతాన్ని ఆలపించి, జాతీయ గీతానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు.స్వాతంత్ర్య సమరంలో ఈ గీతం ప్రేరణగా నిలిచిన విధానాన్ని, దేశ ఐక్యతను బలోపేతం చేసే స్ఫూర్తిని సీనియర్ అధికారులు సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఎసిపి అరుణ్,లా అండ్ ఆర్డర్ సిబ్బంది,ఆర్ఐలు శేఖర్, వెంకటరమణ,అనిల్ కుమార్, ఆర్ఎస్ఐ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'వందేమాతరం' గేయానికి గౌరవ వందనం
### రంగారెడి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ "వందే మాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు"వందే మాతరం"గీతాన్ని సామూహిక గానం చేయడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.

శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి,శ్రీనివాస్,డిఆర్ఒ సంగీతలతో కలసి ఉదయం 10.00 గంటలకు"వందే మాతరం" గీతాన్నిసామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని తెలిపారు.వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి,భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందన్నారు.ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరు ఈ భావనను మనసులో నిలుపుకోవాలని సూచించారు.అలాగే ప్రతిరోజూ పాఠశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ,ఐక్యత భావాలు మరింత బలపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి పౌరుడు, విద్యార్థులు ఈ గీతం ద్వారా దేశసేవా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశ భక్తి భావాన్ని పెంపొందిస్తుందని,దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపే రైతులకు చెల్లింపు : కె.చంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపే చెల్లింపులు జరగాలనీ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి అధికారులు,సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం అబ్దుల్లాపూర్మెట్ మండలం లోని బాచారం,బండ రావిరాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి పరిశీలించారు.బాచారం,బండ రావిర్యాల పిసిసి (ప్రొక్యూర్ మెంట్ అండ్ పర్చాజ్ సెంటర్)సెంటర్‌లను సందర్శించి,కొనసాగుతున్నవరిసేకరణ కార్యక్రమాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.తనిఖీ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎలాంటి నష్టం జరగకుండా సేకరించిన వరిధాన్యాన్ని నిర్ణీత తేమ స్థాయికి చేరుకున్న వెంటనే రైస్ మిల్లులకు తరలించాలనీ,అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని,మిల్లర్ రసీదులు సకాలంలో అందేలా చూడాలని,తద్వారా రైతులకు కొనుగోలు చేసిన 48 గంటలలోపే చెల్లింపులు జరగాలనీ సంబంధిత అధికారులు,సిబ్బందిని ఆదేశించారు.రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వసతులు ఉండేలా చూసుకోవాలి అని తెలిపారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లర్లకు పంపించాలని,తూకం వేసి మిషన్లు,గన్ని బ్యాగులను, టార్పాలిన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం మంగళ్ పల్లిలోని జయలక్ష్మి రైస్ మిల్లును తనిఖీ చేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దీపక్‌రెడ్డి విజయం ఖాయం : కాసం రాంరెడ్డి



ప్రజాపక్షం/సరూర్‌నగర్: జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో బిజేపి పార్టీ భారీ విజయం సాధించడం ఖాయమని రంగారెడ్డి జిల్లా మీడియా సెల్ కన్వీనర్ కాసం రాంరెడ్డి అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గుడా డివిజన్ రేహమత్‌నగర్‌లో ఎల్‌బినగర్ నియోజవర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి కాసం రాంరెడ్డి వాడవాడల బైక్‌ర్యాలీతో ముమ్మర ప్ర చారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేపడతున్న ప్రభుత్వ పథకాలకు అకర్షతులై ఎన్నికల ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఎవ్వరూ ఎన్ని కుట్రలు చేసిన జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ఓటర్లు బీజేపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందర్నీ అలరించిన వందేమాతరం గేయాలాపన



ప్రజాపక్షం/శంకర్ పల్లి: శంకర్ పల్లి పట్టణంలోని తహసిల్దార్ , మున్సిపల్ కార్యాలయలలో శుక్రవారం 15వ వందేమాతరం వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన వందేమాతరం వేడుకల్లో తహసిల్దార్ సురేందర్, ఎంపిడి ఒ వెంకయ్య గౌడ్ పాల్గొనగా, మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన వందేమాతరం వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ యోగేష్ సిబ్బంది పాల్గొన్నారు. వందేమాతరం గీతాన్ని ఆలాపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిదాయకమైన జాతీయగీతం అన్నారు. వందేమాతరం గీతాన్ని 1875 సంవత్సరంలో బంకింగ్ చంద్ర చటర్జీ రాశారని తెలిపారు.ఈ గీతం స్వాతంత్ర పోరాటం ఎంతో దోహద పడిందని తెలిపారు. 150 సంవత్సరాల ముందు అన్ని విద్యాసంస్థలు బ్రిటిష్ వారికి సంబంధించిన గీతాన్ని పాడేవారని చెప్పారు. వందేమాతరం అంటే మాతృభూమికి వందనమని అర్థం అన్నారు.వందేమాతరం నినాదం బ్రిటిష్ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఒక స్ఫూర్తి నినాదంగా నిలిచిందని తెలిపారు.కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



### గేయ రచనకు 150ఏళ్లు

ప్రజాపక్షం/షాద్‌నగర్: జాతీయ గీతంకు 150 ఎళ్ల పూర్తి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు షాద్‌నగర్ జడ్‌హెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ గీతం పాడి సంబరాలు నిర్వహించారు. మాజీ జడ్‌పిటిసి వెంకట్ రాంరెడ్డి, జిహెచ్ఎంసి సభ్యులు భాగ్యమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. విద్యార్థుల బుజాలపై దేశ భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి దేశానికి మంచి పేరు తీసుకరావాలని కొనియాడరు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌదర్‌పల్లిలో రైతులకు ఐపిఎం కిట్ పంపిణీ



ప్రజాపక్షం/యాచారం : పోలం బడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టేంట్ ప్లాంటు ప్రోటేక్షన్ అధికారి బసవన్నప్ప అన్నారు.శుక్రవారం యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో రైతులకు ఐపిఎం కిట్ ను పంపింణి చేశారు. అయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో అధునిక పద్దతులు పాటించాలన్నారు. ఎప్పటికప్పు డు రైతులు వ్యసాయాధికారుల సూచనలు సలహాలు పాటించాలన్నారు.క్షేత్రపాఠశాలలో భాగంగా రైతులకు కిట్లు పంపిణి చేశామన్నారు.టమోటో పంట వేసినప్పటినుండి పంట చేతికి వచ్చేవరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.సిఐపిఎంసి ఇన్‌చార్జివేంకట్‌రెడ్డి మాట్లాడుతూ పురుగు మందులు వాడే టప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకొవాలన్నారు. ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జివి ఉపయోగం గురించి రైతులకు వివరించారు. పురుగులపై నిఘా పెట్టడానికి లింగాకర్షణ బుట్టలు వాడాలని ఉదయ్‌కుమార్ తెలిపారు.మండల వ్యవసాయధికారి అర్ రవినాథ్ ,విస్తరణ అధికారి స్వేత,గ్రామ పెద్దలు పాల్గోన్నారు.

## సర్వేలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలి



ప్రజాపక్షం/రంగారెడ్డి: జిల్లాలోని భూముల సర్వేపై వచ్చిన ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదు ఎందుకు పరిష్కారం కాలేదు తగు వివరణ ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి సంబంధిత ఎడి సర్వే అధికారిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డుల భూముల సర్వే పై ప్రజలు ఇబ్బందికి గురవుతున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని వారిని కార్యాలయం చుట్టూ తిరిగిన పరిష్కారం లభించనందున తాను తనిఖీ చేస్తున్నానని ఆయన తెలిపారు.ల్యాండ్ సర్వేలపై అనేక ఫిర్యాదులు పరిష్కరించకుండా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు ఆ సమస్యపై పరిష్కరించక పోవడానికి గల కారణాలను సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియ జేయాలని,కార్యాలయ సిబ్బంది తగు విధంగా స్పందించి ప్రజల ఫిర్యాదు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంస్థల భూములలో ప్రైవేట్ వారి భూముల సర్వేలో కచ్చితంగా వ్యవహరించాలని,లేనిది ఉన్నట్లు,ఉన్నది లేనట్లు తెలిపితే సంబంధికుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎడి సర్వే అండ్ ల్యాండ్ అధికారిని ఆదేశించారు.అనంతరం పలు సర్వేల ఫిర్యాదులను, ఫైల్స్‌లను తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులు అప్పిల్‌కు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు.

# రీల్

## అదరగొట్టిన చికిరి చికిరి పాట



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్, మోస్ట్ రస్టిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది'ఫస్ట్ సింగిల్ అయిన చికిరి చికిరి ప్రోమోకు అద్భుతమైన స్పందన వచ్చింది, లిరికల్ వీడియోపై భారీ అంచనాలని పెంచింది. భావోద్వేగాలను అద్భుతంగా చూపించే దర్శకుడు బుచ్చి బాబు సాన, ఈసారి ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రహ్మాన్‌తో పని చేయడం తన కల నెరవేరినట్టుగా చెప్పారు. రహ్మాన్‌పై ఆయనకున్న అభిమానాన్ని ఈ ప్రమోలోనే చూపించారు. పాట సిట్యుయేషన్ రహ్మాన్‌పై ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఆయన ఈ పాటని సిట్యుయేషన్ తగ్గట్టుగా అద్భుతంగా మలిచారు. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. శుక్రవారం మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ని రిలీజ్ చేసి ఎక్సయిట్మెంట్‌ని మరింత పెంచారు. పర్వత ప్రాంతంలో నివసించే పెద్ది.. ఓ రోజు గ్రామంలో తన చికిరిని చూసిన క్షణం నుంచే ఆమె అందం, అమాయకత్వం అతనిని మంత్ర ముగ్ధుడ్ని చేస్తాయి. ఆమెను చూసి కలిగిన ఆ ఆనందాన్ని ప్రతి క్షణం వేడుక చేసుకుంటాడు. ఈ బ్యూటీఫుల్ ఫీలింగ్స్ ని లిరిసిస్ట్ బాలాజీ తన సాహిత్యంలో ఎంతో అద్భుతంగా మలిచారు.

## కమల్‌హాసన్ సమర్పణలో రజనీకాంత్ 173 చిత్రం



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై భారత సినీ రంగంలో మైలు రాయిగా నిలిచే మహత్తరమైన ప్రాజెక్ట్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఇద్దరు మహానటుల మధ్య ఐదు దశాబ్దాల స్నేహం, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునే బిగ్ సినిమాటిక్ ఈవెంట్. రజనీకాంత్‌కమల్ హాసన్ల అనుబంధం తరతరాల కళాకారులకు, ప్రేక్షకులకు స్ఫూర్తినిస్తుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ 44 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకొని రూపొందుతున్న రజనీకాంత్ 173 ఇది. సూపర్స్టార్ రజనీకాంత్ మాగ్నటిక్ స్క్రీన్ పవర్, సుందర్ సి డైరెక్షన్ కలిపి ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని అందించబోతుంది.కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా పొంగల్ 2027 సందర్భంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది.

## 'టాక్సిక్' ఊహకు అందదు

### రుక్మిణి వసంత్



ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేసి, అంతర్జాతీయ స్థాయిలో మన సత్తాను చాటేందుకు రాకింగ్ స్టార్ యష్ ప్రస్తుతం 'టాక్సిక్ – ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' పనుల్లో బిజీగా ఉన్నారు. యాక్షన్‌ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశ బెంగళూరులో జరుగుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరిలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న చిత్రాల్లో ఆడియెన్స్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌ల్లో 'టాక్సిక్' ఒకటిగా నిలుస్తుంది. క్రేజీ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో జరిగిన చిట్ చాట్‌లో 'టాక్సిక్' గురించి ఆమె ప్రస్థావించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం పట్ల రుక్మిణి వసంత్ తన ఉత్సాహంగా ఉన్నానంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే.. 'టాక్సిక్' అనేది ఇప్పటివరకు కన్నడ లేదా భారతీయ సినిమాల్లో మనం చూసిన వాటన్నంటి కంటే భిన్నంగా ఉంటుంది. ఇది రా అండ రస్టిక్‌గా ఎన్నో లేయర్స్‌తో అద్భుతంగా ఉండబోతోంది. దర్శకురాలు గీతు విజన్ ఎంతో బోల్డ్ ఉంటూనే.. అదే సమయంలో ఎంతో హృద్యంగానూ ఉంటుంది' అంటూ రుక్మిణి చెప్పిన మాటలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించబడుతున్న ఈ భారీ సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో అనువాదం చేసిన రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రానికి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు, గ్లోబల్ ఫిల్మ్ మేకింగ్ అవార్డుతో సహా అనేక ప్రశంసలను అందుకున్న గీతు మోహన్‌దాస్ మరోసారి వండర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.

## డిసెంబర్ 19 నుండి 21 వరకు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్



అంతర్జాతీయ లఘు చిత్రాల ఫెస్టివల్ వేడుకకు హైదరాబాద్ వేదిక కానుంది. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19, 20, 21 మూడు రోజుల పాటు హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ ఫెస్టివల్ కు సంబధించిన వెబ్ సైట్ ను ఎఫ్ డీ సి ఎండీ ప్రియాంక, దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ అధినేత ఉమామహేశ్వర్ రావుతో కలసి దిల్ రాజు ప్రారంభించారు. అనంతరం దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల వేడుకను ఘనంగా నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌ను నిర్వహిస్తోందని అన్నారు. డిసెంబర్ 19,20,21 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతుందన్నారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐమాక్స్ థియేటర్‌లో షార్ట్ ఫిలిం వేడుక జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది నవంబర్ 14న అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాన్ని జరిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఫెస్టివల్ చివరి రోజుల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని దిల్ రాజు చెప్పారు. సమాచార శాఖా కమిషనర్, ఎఫ్ డీ సి మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మూడు రోజుల పాటు అంతర్జాతీయ లఘు చిత్రాల ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 3 సెకండ్ల నుంచి 25 నిమిషాల పాటు నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ పంపాలని చెప్పారు. ఈ షార్ట్ ఫిలిమ్స్‌ను HISFF.IN వెబ్ సైట్‌లోనే అప్ లోడ్ చేయాలని అన్నారు. ఇంటర్నేషనల్ స్థాయి ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణుల హాజరు అవుతారని చెప్పారు. దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ అఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపాల్, అంకురం సినిమా దర్శకుడు ఉమా మహేశ్వర్ రావు మాట్లాడుతూ తెలంగాణలో గొప్ప సాంస్కృతిక విప్లవం ఉందని అన్నారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ మీడియా రంగాన్ని తెలంగాణ ఫోక్ సాంగ్స్ శాసిస్తున్నాయని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులతో జ్యూరీ ఉంటుందని ఆయన చెప్పారు.

## బహిరంగ ప్రదేశాల్లో కనిపించొద్దు



(3వ పేజీ తరువాయి)

ప్రజా భద్రత, ఆరోగ్యం దృష్ట్యా ఇలాంటి బహిరంగ ప్రదేశాల్లోని వీధి కుక్కలను, జంతువులను షెల్టర్లకు తరలించాలి. వీధి కుక్కల నిర్వహణ కోసం ఈ ఆదేశాలు జారీ చేయడం సముచితం అని కోర్టు భావిస్తోంది' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. సంస్థాగత ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు, జంతువులు ప్రవేశించకుండా కంచెలు, సరిహద్దు గోడలు, గేట్లు ఏర్పాటు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే ఇతర నిర్మాణాత్మక చర్యల ద్వారా సదరు ప్రాంగణాలు సురక్షితంగా ఉండేటట్లు చేయాలని సంబంధిత సంస్థల పరిపాలనాధిపతులకు కోర్టు సూచించింది. ఇదంతా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, వీలున్నంత వరకు ఎనిమిది వారాల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అందుకే సంస్థాగత ప్రాంగణాల నిర్వహణ, పరిశుభ్రత సహా వీధి కుక్కలు క్యాంపస్‌లోకి ప్రవేశించకుండా చూసుకోవడానికి సంబంధింత సంస్థలు ఒక నోడల్ అధికారిని నియమించాలని ధర్మాసనం పేర్కొంది. స్థానిక మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు కనీసం 3 నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా బహిరంగ ప్రదేశాల్లో, సంస్థాగత ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అంతేకాదు సంస్థల లోపల, వాటి సమీప ప్రాంతాల్లో వీధి కుక్కల ఆవాసాలు లేవని నిర్ధరణ చేసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

**స్టెరిలైజ్ చేయాలి** 'విద్యా సంస్థలు, ఇతర సంస్థల ప్రాంగణాల్లో కనిపించే ప్రతి వీధి కుక్కను వెంటనే జంతు జనన నియంత్రణ నియమాలకు అనుగుణంగా తగిన విధంగా స్టెలిలైజేషన్ చేయాలి. టీకాలు వేసిన తరువాత వాటిని నియమిత షెల్టర్లకు తరలించాలి. ఇదంతా ఆ ప్రాంత మున్సిపల్ సంస్థల, అధికారుల బాధ్యత. మరో కీలకమైన విషయం ఏమిటంటే, వీధి కుక్కులను పట్టుకున్న ప్రదేశంలోనే తిరిగి వదిలిపెట్టకూడదు' అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఇక నగరాల రోడ్లు, రహదారులపై వీధి కుక్కల ముప్పును ఎదుర్కోవడానికి ఆగస్టు నెలలో రాజస్థాన్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సైతం సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తమ అధికార పరిధిలోకి వచ్చే జాతీయ, రాష్ట్ర రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేస్‌ల వద్ద ఉన్న వీధి కుక్కలను, ఇతర జంతువులను తొలగించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇందుకోసం వీధి కుక్కలు ఎక్కువ కనిపించే జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని 'ఎన్‌హెచ్‌ఏఐ'కి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## పనోరమా స్క్రీనింగ్‌కు సంక్రాంతికి వస్తున్నాం ఎంపిక




ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో పనోరమా స్క్రీనింగ్ కు తెలుగు సినిమా సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంపికైంది. వెంకటేష్ కెరీర్ లోనే అత్యధికంగా వసూల్లు సాధించిన చిత్రమిది. వెంకటేష్ సరసన ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్ లుగా నటించిన ఈ సినిమాను అనిల్ రావిపూడి తెరకెక్కించారు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రం పనోరమా కు ఎంపిక కావడం సంతోషించదగ్గ పరిణామమని నిర్మాతలు తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాము పేరుతో 2026 సంక్రాంతికి ఈ ఇసినిమా విడుదల ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.




## 'సుప్రీం' విచారణ

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమైనందున ఈ విషయం అత్యవసరం' అని ప్రశాంత్‌భూషణ్ చెప్పారు. బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తు నిర్వహించాలనే ఎన్నికల సంఘం నిర్ణయం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇప్పటికే విచారిస్తోంది.అక్టోబరు 16న బిహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'ఖచ్చితమైనది' అని ఎన్నికల సంఘం పేర్కొంది. పిటిషనర్ రాజకీయ పార్టీలు, ఎన్‌జిఒలు ఈ ప్రక్రియను అప్రతిష్ట పాలు చేయడానకి తప్పుడు ఆరోపణలు చేయడంతోనే సంతృప్తి చెందుతున్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. తుది ఓటర్ల జాబితా ప్రచురింపబడినప్పటి నుండి పేరు తొలగింపునకు వ్యతిరేకంగా ఏ ఓటరు కూడా ఒక్క అప్పీల్ కూడా దాఖలు చేయలేదని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నెలల తరబడి జరిగిన ఎస్‌ఐఆర్ ప్రక్రియ తర్వాత తయారుచేసిన రాష్ట్ర తుది ఓటర్ల జాబితా నుంచి 'ముస్లిములను అవమానంగా మినహాయించారు' అని పిటిషనర్లు చేసిన ఆరోపణలను కోర్టు తప్పు పట్టింది.సెప్టెంబరు 30న ఎన్నికలు జరుగనున్న బిహార్ తుది ఓటర్ల జాబితాను ప్రచురించిన ఎన్నికల సంఘం ప్రత్యేక ముమ్మర సవరణకు ముందు 7.89 కోట్లుగా ఉన్న తుది ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య దాదాపు 47లక్షలు తగ్గి 7.42 కోట్లకు చేరుకుందని తెలిపింది.అయితే తుది సంఖ్య 7.24 లక్షల నుండి 17.87 లక్షలకు పెరిగింది. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో కోటి మంది ఓటర్ల పేర్లు ఉన్నాయి. ఇది మరణాలు, వలసలు, నకిలీ ఓటరుల సహా వివిధ కారణాల వల్ల 65లక్షల మంది ఓటర్లను అసలు జాబితా నుండి తొలగించింది. ముసాయిదా జాబితాలో 21.53 లక్షల మంది కొత్త ఓటర్లు చేరగా, 3.66లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయి. ఫలితంగా, నికరంగా 17.87 లక్షల మంది ఓటర్లు పెరిగారు. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు గాను 121 స్థానాలకు గురువారం బిహార్‌లో తొలిదశ ఎన్నికలు పూర్తిఅయ్యాయి. మిగతా 122 స్థానాలకు నవంబరు 11న ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబరు 14న జరుగనుంది.







## న్యాయం, మార్పు సందేశం పంపేందుకే...

### అఖిలేశ్‌తో భేటీపై ఆజం ఖాన్

**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు ఆజం ఖాన్ శుక్రవారం లక్నోలో అఖిలేశ్ యాదవ్‌ను కలిశారు. పార్టీ అధ్యక్షుడితో తన సమావేశం ఉత్తరప్రదేశ్‌లో స్థితిస్థాపకత, న్యాయం, రాజకీయ మార్పు ఆవశ్యకత సందేశాన్ని తెలియజేయడానికి ఉద్దేశించిందని తెలిపారు. అనంతరం ఖాన్ తన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజమ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఎదుర్కొన్న అణచివేత, చారిత్రక అన్యాయం ఉన్నప్పటికీ రాతి లేదా పర్వతం కంటే ఓర్పు బలంగా ఉన్న వ్యక్తులు ఇప్పటికీ ఉన్నారని చూపించడమే మా సమావేశం నిజమైన ఉద్దేశం' అని అన్నారు. 'మా వారు చాలా మంది ఇప్పటికీ జైలులో ఉన్నారు. మేము కలిసినప్పుడు ఆ బాధాకరమైన సమయాలను ఒకరినొకరు గుర్తు చేసుకుంటాము. తద్వారా భవిష్యత్ తరాలు అలాంటి అన్యాయం ఒకప్పుడు జరిగిందని గుర్తుంచుకుంటాయి' అని తెలిపారు. భూ కబ్జా, బెదిరింపులు సహా బహుళ ఆరోపణలపై దాదాపు రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన తర్వాత ఇటీవల విడుదలయిన సీనియర్ ఎస్పీ నాయకుడు.. 'అవగాహన మార్పు'గా అభివర్ణించినందుకు మీడియా వర్గాలకు కతజ్ఞతలు తెలిపారు. 'ఒకప్పుడు నన్ను తప్పుగా అర్థం చేసుకున్న వారు ఇప్పుడు మాకు చాలా అన్యాయం జరిగిందని గ్రహించినట్లు కనిపిస్తోంది' అని అన్నారు. ఆజం ఖాన్ తన నివాసం, రాంపూర్‌లోని జౌహర్ విశ్వవిద్యాలయంలో ఆదాయపు పన్ను దాడులను గుర్తుచేసుకుంటూ, 'ఏ మంచి వ్యక్తి అయినా సిగ్గుతో తల వంచుకునేలా చేసే పదాలను అధికారులు ఉపయోగించారు' అని తెలిపారు. 'దర్యాప్తు సంస్థల దుర్వినియోగం మళ్లీ జరగకూడదు. రాజకీయ వ్యవస్థ మెరుగుపడి, నిజంగా ఏమి జరుగుతుందో ప్రజలు అర్థం చేసుకునే వరకు అన్యాయం కొనసాగుతుంది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com